ఆదివారం
గత వారం రోజుల్లో జిల్లాల్లో...
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

కొత్త ఐటి బిల్లుకు లోక్‌సభ ఆమోదం
ప్రధాని ఎస్పీజీలో మహిళా అధికారి
5

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-8-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 192 పేజీలు: 10+4 వెల: 6.50

# సంక్షేమానికి లక్షకోట్లు


సోమవారం మొయినాబాద్ మండలంలో అర్హులకు రేషన్‌కార్డు అందజేస్తున్న డి.సిఎం భట్టి

### విద్యుత్ అంతరాయం లేని రాష్ట్రంగా తెలంగాణ
### గ్రీన్ ఎనర్జీతో మరో ముందడుగు.. విద్యుత్ కార్మికులకు కోటి బీమా
### ప్రభుత్వ ఆఫీసులు, కళాశాలలపై సోలార్ ఏర్పాటు
### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**చేవెళ్ల, సోమవారం11, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అంతరాయం లేకుండా, ప్రజ,లకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఆర్థిక పరిస్థితులు బాగోలేకున్నా రాష్ట్ర ప్రజలకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు , ప్రజా ప్రభుత్వం చేపడుతున్న ఎన్నో సంక్షేమ పథకాల్లో భాగంగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోని రాష్ట్రం పై ఆర్థిక భారం ఉన్నా లక్ష కోట్లు ప్రజా సంక్షేమ పథకాలకు కర్చుచేసిన ప్రజా ప్రభుత్వమని ధైరంగా చెప్పగలమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు, సోమవారం రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండలంలోని ముర్తుజగూడ గ్రామంలోని, చిల్కూర్, నాగిరెడ్డిగూడ, బాకారం, విద్యుత్ ఉపకేంద్రానికి 33,11 కేవి కు శంకుస్థాపన, అర్హులైన వారికి రేషన్ కార్డులను పంపిణి కార్యాక్రమానికి ముఖ్య అతిధిగా ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ 33,11 కేవి విద్యుత్ ఉపకేంద్రాలను, హైద్రాబాద్‌కు అతి చేరువలో ఉండి, పట్టణ విస్తరణ త్వరితగతంగా వేగంగా విస్తరిస్తుందని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులలు, ప్రజలకు కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందస్తుగా చర్యలు చేపడుతుందని,

>>2

## సిఎం పదవి ఆశించా..
### కానీ ఇచ్చిన పదవి సంతృప్తికరమే
### రాజగోపాల్‌కు మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చాం: డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు11:** తాను ముఖ్యమంత్రి పదవిని ఆశించిన మాట నిజమేనని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సీఎల్పీ లీడర్ గా ఉన్న తాను సీఎం పదవిని ఆశించానని చెప్పారు. కానీ, పార్టీ

>>2


న్యూఢిల్లీలో పోలీసు వాహనం నుంచి మీడియాతో రాహుల్

### ఢిల్లీలో విపక్ష ఎంపీల భారీ ర్యాలీ
# రాహుల్ అరెస్టు

### అఖిలేష్, ప్రియాంక సహా పలువురిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు
### ఇసి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని రాహుల్ ఆరోపణ
### పార్లమెంటు వద్ద ఉద్రిక్తత

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన పార్లమెంట్ టు ఈసీ ర్యాలీ ఉద్రిక్తతలకు దారితీసింది. బారికేడ్లను దాటి వస్తున్న ఇండియా కూటమి ఎంపిలను అడ్డుకోవడంతో వారంతా బారికేడ్లదగ్గర కూర్చుని బైఠాయిం పుజరిపి నిరసన ప్రకటించారు. దీనితో పోలీసులు నాయకులమధ్య తీవ్ర వాగ్వాదంజరిగింది. మరోవైపు అఖిలేష్ యాదవ్ తోపాటు పలువురు ఎంపిలు బారికేడ్లు దూకి మరీ వెళ్లారు. పరిస్థితులు చేయిదాటిపోతుండటంతో రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టుచేసి వాహనంలోకి ఎక్కించారు. పార్లమెంటు భవనంనుంచి ఈసీ ఆఫీసు కిలోమీటరు దూరం లో ఉంది. ఈసీ ఆఫీసుకు ఇండియా కూటమి ర్యాలీగా బయ లుదేరింది. అయితే పార్లమెంట్‌చుట్టూ పోలీసులు బారికేడ్లు

>>2


ఢిల్లీలో విపక్షాల ఆందోళనలో ప్రియాంక తదితరులు



### పాత పద్ధతిలోనే
## టెన్త్ పరీక్షలు
### విద్యార్థుల ఉత్కంఠకు తెర

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు11:** పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులు ఉన్నాయా? లేదా? అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ ఉత్కంఠకు సోమవారం సాయంత్రం విద్యాశాఖ తెర దించింది. పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ఇంటర్నల్ మార్కులను తొలగిస్తూ గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వం జివో జారీ చేసింది. అయితే ఇటీవలే ఢిల్లీలోని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సిఈఆర్‌టి) నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఈ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తాయి. దీంతో విద్యాశాఖ అధికారులు పునరాలోచనలో పడ్డారు. దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూశారు. దీంతో 10వ తరగతి పరీక్షలపై పాత

>>2

రేవంత్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట
2

### రైతు బీమా కోసం కొత్త పాస్‌బుక్‌ల
# వెరిఫికేషన్
### మార్గదర్శకాలను విడుదల చేసిన వ్యవసాయశాఖ
### రైతుల నమోదు, రెన్యువల్స్ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు11:** తెలంగాణ రాష్ట్రంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన రైతు బీమా ఈ నెల 14వ తేదీ నుంచి అమలు చేయనున్నారు. దీనికి సంబంధించి వ్యవసాయశాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నిబంధనల మేరకు కొత్త రైతుల నమోదు, రెన్యూవల్స్ చేపట్టాలని క్షేత్ర స్థాయి అధికారులకు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతుల్లో బీమాకు అర్హులైన వారిని వ్యవసాయశాఖ గుర్తించనుంది. భూ భారతిలో నమోదై, సీసీఎల్ఎల్‌లో నమోదైన భూములు కలిగిన రైతుల్లో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న రైతులు బీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు, ఆర్ ఎఫ్ ఆర్ పట్టాదారులకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ అందించే డాటా ఆధారంగా రైతుబీమా కల్పించనున్నారు. ఈ మేరకు కొత్త వారందరూ ఈనెల 13లోగా క్షేత్ర స్థాయిలో ఏఈవోలు, ఏవోలతో వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. 2025-26 రైతు బీమా కోసం క్షేత్రస్థాయి అగ్రికల్చర్ అధికారులకు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి రైతు బీమా పోర్టల్లో అధికారులు అప్లోడ్ చేయనున్నారు. రైతు బీమా పథకానికి అర్హులై ఉండి అప్లయ్ చేసుకోని వారికి సైతం తాజాగా దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. అయితే, ఐదెకరాలలోపు భూమి ఉండి కూడా గతంలో ఆప్లయ్ చేసుకోని రైతులకే ఈ దఫా అవకాశం కల్పిస్తున్నట్లు తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సంవత్సరం కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు, గతంలో

>>2



# 18 నుంచి అసెంబ్లీ?
### మూడు రోజులు జరిగే అవకాశం
### ఘోష్ నివేదికపై విస్తృతంగా చర్చ
### 16 లేదా 17న పిఎసి సమావేశం
### 23 నుంచి పాదయాత్ర పునఃప్రారంభం
### సిఎం రేవంత్‌తో పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు11:** స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. ఈలోగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటోంది. పంద్రాగస్టు తర్వాత ఈనెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో కాళేశ్వరం అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికను చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తర్వాత గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తీర్మానం చేయనున్నారు. పలు బిల్లులను ఆమోదించనున్నారు. కాగా, పలు కీలక అంశాలను చర్చించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసానికి వెళ్లిన మహేశ్ కుమార్‌గౌడ్ గంటన్నరకు పైగా సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై నేతలిద్దరూ మాట్లాడుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమయ్యేం దుకు ఈనెల 16 లేదా 17 తేదీలలో గాంధీ భవన్‌లో పిసిసి,పిఏసీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మెజారిటీ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నేతలు భావిస్తున్నారు. ముఖ్యంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లు,స్థానిక సంస్థల ఎన్నికలపై ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకోనున్నారు. బోర్డు, కార్పొరేషన్ డైరెక్టర్ల పోస్టుల నియామకాలు త్వరగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జనహిత పాదయాత్రలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కారాలపై నేతలు చర్చించినట్లు సమాచారం. ఈనెల 23 నుంచి పాదయాత్రను పునఃప్రారంభించనున్నారు. ఈసారి పాదయాత్రలో సిఎం రేవంత్‌రెడ్డి కూడా పాల్గొనున్నారు. కాగా, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సెప్టెంబర్ 30లోపు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో.. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించాలని డిమాండ్ పెరుగుతోంది. ఈ నిబంధన వల్ల చాలా మంది పోటీ చేసే

>>2

## ప్రభుత్వం కార్మిక పక్షమే
### చిన్న నిర్మాతల వైపు కూడా కార్మికులు ఆలోచించాలి
### హైదరాబాద్ ఫిల్మ్ హబ్‌గా అభివృద్ధి: మంత్రి కోమటిరెడ్డి


సోమవారం మంత్రి కోమటిరెడ్డితో భేటీ అయిన నిర్మాతలు, సినీ సంఘాల ప్రతినిధులు

**హైదరాబాద్ ఆగస్టు 11,ప్రభాతవార్త:** సినికార్మికుల సమస్యల పరిష్కారంకు మానవీయ కోణంలో మాప్రభుత్వం స్పందిస్తుందని చిన్న నిర్మాతల పట్ల కూడా కార్మికులు పట్టువిడుపు ధోరణితో సహకరించాలని హైదరాబాద్ ఫిల్మ్‌హబ్‌గా మార్చేందుకు ఇలాంటి ఆందోళనలు ప్రతిబంధకంగా మారుతాయని సినిమాటోగ్రఫి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రరోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం సచివాలయంలో సినిమా నిర్మాతలు, వివిధ సినిమా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సినీ కార్మికుల సమ్మె

>>2

### బిఆర్ఎస్ హయాంలో అప్పు 8 కాదు...
## 3.5 లక్షల కోట్లు మాత్రమే
### సిఎం రేవంత్ ఆరోపణలు అసత్యం
### మేం అప్పు చేసి ఆస్తులు సృష్టిస్తే.. కాంగ్రెస్ దివాలా తీయిస్తోంది: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు11:** కేసీఆర్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పు చేసిందని గాయి గాయి చేసిన రేవంత్ రెడ్డి చెంప ఛెల్లుమనేలా కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఆరోపిస్తున్నట్టుగా తమ హయాంలో రాష్ట్ర అప్పు రూ.8 లక్షల కోట్లు కాదని, కేవలం రూ.3.5 లక్షల కోట్లు మాత్రమే అన్న నిజాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఒప్పుకుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల విషయంలో రేవంత్ రెడ్డి అండ్ గ్యాంగ్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్దాలన్న సంగతి పార్లమెంట్‌లో నిరూపించ బడిందన్నారు. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి రూ. 8 లక్షల కోట్ల అప్పులంటూ నిరాధార ప్రచారానికి దిగిన రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారని కేటీఆర్ ప్రశ్నించారు. తాము అధికారం నుంచి దిగిపోయిన తరువాత అంటే 2024 మార్చి 31 నాటికి తెలంగాణ ప్రభుత్వ అప్పు రూ.3,50,520.39 కోట్లు మాత్రమే అన్న కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ అనవసరంగా అప్పులు చేయలేదన్నారు. సంక్షేమ పథకాలకే కాకుండా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఆస్తుల సృష్టి కోసమే తెచ్చిన అప్పులను ఉపయోగించిందన్నారు. మిషన్ భగీరథ, మిషన్

>>2




### మరో 476 పార్టీలపై
## ఇసి వేటు
### నిబంధనలు ఉల్లంఘించడంతో కమిషన్ చర్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** చట్టబద్ధమైన నిబందనలు ఉల్లంఘించే రాజకీయ పార్టీలపై ఈసీ దృష్టిపెట్టింది. దేశంలో మరో 476 పార్టీలను రద్దుచేసే దిశగా చర్యలను మొదలుపెట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇటీవలే 334 పార్టీలను రద్దుచేసిన ఎన్నికలసంఘం తాజాగా రెండో రౌండ్‌లో మరో 476 పార్టీలను గుర్తించి వాటిపై వేటువేసే చర్యలుచేపట్టింది. రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలవారీగా జాబితాను కూడా విడుదల చేసింది. ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళనచేసే చర్యల్లోభాగంగా వీటిని డీలిస్ట్ చేస్తున్నట్లు ప్రకటించింది. 2019 నుంచి ఆరేళ్లలో ఒక్క ఎన్నికలో అయినా పోటీచేయాలనే ముఖ్యమైన షరతును భర్తీచేయడంలో విఫలమైన రిజిష్టర్డ్ గుర్తింపులేని రాజకీయ పార్టీలను గుర్తించేందుకు

>>2

# అంతా వరద బురద
### తీవ్ర ఇక్కట్లకు గురవుతున్న ప్రజలు
### హైదరాబాద్‌లో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లలో వరద నీరు



**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వారం రోజులుగా వరుసగా కురుస్తున్న భారీ, అతి భారీ వర్షాల వల్ల వరదనీరు గంటల తరబడి రోడ్లపై నిలుస్తుండడంతో వాహనదారులు ఎక్కడికక్కడ ట్రాఫిక్ జాంలో ఇరుక్కుపోయి తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇతర ప్రాంతాల విషయం ఎ లావున్నా గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ సమస్య మరింత తీవ్రంగా వుంది. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళుతుర్న బెంగ ళూరు, విజయవాడ, ముంబాయి, నిజామాబాద్, వరంగల్ జాతీయ రహదారులపైనా ఈ సమస్య ఎక్కువగా వుంది. ఇక భారీ వర్షం వల్ల ఫ్లై ఓవ ర్లతో పాటు అండర్ పాస్‌లలోనూ వరదనీరు నిలుస్తుండడం ట్రాఫిక్ సమస్యను మరింత జటిలం చేస్తోంది. వాహనదారుల ఇక్కట్లను తొలగించేందు కు, ప్రజల అవస్థలను దూరం చేసేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు కొంతమేరకే ఫలితాలు ఇస్తుండడం గమనార్హం. తెలంగాణలో ఈ ఏడాది వర్షాకాలంలో మరిన్ని భారీ వర్షాలు ముంచెత్తనున్నాయని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు సామాన్యులను హడలె తిస్తున్నాయి. రాష్ట్రంలో వర్షాకాలంలో వర్షాలు కురవడం సాధారణమే అయినా కొన్నేళ్లుగా వరదనీరు అనేకచోట్ల గంటల తరబడి, జాతీయ రహదా రులపై కొన్నిచోట్ల రోజుల తరబడి ప్రవహిస్తుండడం ఆయా ప్రాంతాలలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తోంది. గడచిన వారం రోజులుగా రాష్ట్ర ంలో కురుస్తున్న భారీ

>>2

# రేవంత్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు కొట్టివేస్తూ తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు11:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2019 అక్టోబర్‌లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పరిధిలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ రేవంత్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఆ కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో రేవంత్ పిటిషన్ పై ధర్మాసనం పలుమార్లు విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు కేసును కొట్టివేస్తూ సోమవారం తీర్పు వెలువరించింది.

# టెన్త్ పరీక్షలు

>> విధానాన్నే కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాత విధానం ప్రకారమే 20 శాతం ఇంటర్నల్ మార్కులు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పదో తరగతి పరీక్షల్లో 80 శాతం ఎక్స్‌టర్నల్ మార్కులు, 20 శాతం ఇంటర్నల్ మార్కులు కేటాయించనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. కాగా, 2025-26 విద్యా సంవత్సరం నుండి ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో 80 మార్కులు బాహ్య మూల్యాంకనానికి, 20 మార్కులు అంతర్గత మూల్యాంకనానికి కేటాయించే విధానాన్ని కొనసాగించే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాన గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (టిఆర్ఎస్ఎంఎ) ఆహ్వానిస్తోంది. ఈ నిర్ణయం నిరంతర సమగ్ర మూల్యాంకన విధానం (సిసిఈ) ప్రధాన లక్ష్యాన్ని నిలబెడుతూ, విద్యార్థుల అకడమిక్ ప్రదర్శనను పబ్లిక్ పరీక్షల ద్వారా మాత్రమే కాకుండా, అంతర్గత అసైన్‌మెంట్లు, ప్రాజెక్టుల్లో వారి నిరంతర కృషి, విజయాలను కూడా గుర్తించే సమతుల్యమైన మూల్యాంకన విధానాన్ని నిర్ధారిస్తుందని టిఆర్ఎస్ఎంఎ అధ్యక్షులు ఎస్.మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్.రమేశ్ రావు పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని తమ అసోసియేషన్ తరపున పలుమార్లు చేసిన వినతులను గుర్తించినందుకు గాను ముఖ్యమంత్రికి పాఠశాల విద్యాశాఖకు కృతజ్ఞతలు తెలుపుతుందన్నారు. ఈ నిర్ణయం సమానత్వాన్ని కాపాడే మూల్యాంకన విధానాన్ని కొనసాగించడంలో, విద్యార్థులపై అనవసరమైన పరీక్షా ఒత్తిడిని తగ్గించడంలో, పాఠశాలల్లో సమగ్ర విద్యను ప్రోత్సహించడంలో సహాయపడుతుందన్నారు.

## వారం - వర్జ్యం

12-08-2025,మంగళవారం(సంకట చతుర్థి)
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
తదియ ఉ.8.41
పూర్వాభాద్ర ఉ.11.52
వర్జ్యం : సా.5.11 - 7.06
దు.ఉ.8.25-9.16, రా.11.41-12.32
శుభసమయం:ఉ.6.30-7.15, సా.6.45-7.25
రాహుకాలం - మ.3.00-4.30

## వారాఫలం

**మేషం :** ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**వృషభం :** నూతన వ్యాపారాలు పురోభివృద్ధి ఉంటాయి. పరిశ్రమలలో ఏర్పడిన అవరోధాలు తొలుగుతాయి.

**మిథునం:** ఆప్తుల సలహాలతో నూతన కార్యక్రమాలను చేపడతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కర్కాటకం:** పోటీపరీక్షలు, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సోదరుల నుండి ధనలాభం పొందుతారు.

**సింహం:** నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కన్య :** సోదరులతో ఏర్పడిన ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. ప్రయాణాలు.

**తుల :** ఉద్యోగాలలో ఆకస్మికమైన మార్పులు చోటుచేసుకుంటాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు.

**వృశ్చికం:** ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు. సంఘంలో ప్రత్యేక గౌరవం లభిస్తుంది.

**మకరం:** అరుదైన అవకాశం వెతుక్కుంటూ రాగలదు. వాటిని సద్వినియోగం చేసుకొంటారు.

**కుంభం:** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. నూతన కాంట్రాక్టులు లభిస్తాయి.

**మీనం :** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



భారీ వర్షానికి సోమవారం గురుగ్రామ్‌లో రహదారిపై ఏర్పడ్డ భారీ గుంత

# ప్రభుత్వం కార్మిక పక్షమే

>> కారణంగా షూటింగ్ లు నిలిపివేయబడినందున పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి వివిధ సంఘాల సభ్యులను కోరారు. సినిమా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నామని, ఈ కమిటీ అన్ని పక్షాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. బుధవారం నుండి షూటింగ్స్ పునఃప్రారంభమవుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఫిలిం హబ్‌గా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని మంత్రి పునరుద్ఘాటించారు. సినిమా మరియు వినోద రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో అందమైన ప్రదేశాలు ఉండటంతో అవి ఉత్తమ సినిమా షూటింగ్ లొకేషన్లుగా ఉపయోగించవచ్చని చెప్పారు. ఇది స్థానిక ప్రజలకు ఆదాయాన్ని కల్పించడమే కాకుండా ఉపాధి అవకాశాలు కూడా పెంచుతుందన్నారు. సినిమా కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉంది. అదే సమయంలో సిని పరిశ్రమలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉందని మంత్రి తెలిపారు. అయితే సమ్మెకు వెళ్లడం సరైన మార్గం కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పేద సినిమా కార్మికులకు ఇళ్లు ఇవ్వాలని, అలాగే మౌలిక సదుపాయాలు కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో సానుకూలంగా ఉన్నారని మంత్రి చెప్పారు. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ అన్ని పక్షాల మధ్య ఐక్యత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా హైదరాబాద్‌ను గ్లోబల్ ఫిలిం హబ్‌గా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ చర్యలను బలపరిచేలా అందరూ కలసిపనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, వివిధ సినిమా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సిఎం పదవి ఆశించా..

>> హైకమాండ్ తనకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిందని... ఈ పదవితో తాను సంతోషంగానే ఉన్నానని తెలిపారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన మాట కూడా వాస్తవమేనని భట్టి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని... కాంగ్రెస్ దరిదాపుల్లోకి కూడా బీజేపీ, బీఆర్ఎస్‌లు రాలేవని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య సఖ్యత లేదనే వార్తలపై ఆయన స్పందిస్తూ... పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రేణుకా చౌదరిలతో తనకు ఎలాంటి విభేదాలు లేవని చెప్పారు. గోదావరి -బనకచర్ల ప్రాజెక్టుకు ఎలా కట్టాలో ఏపీ ప్రభుత్వానికి తెలిస్తే... ఆ ప్రాజెక్టును ఎలా ఆపాలో తమకు తెలుసని భట్టి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నివేదికను అసెంబ్లీలో పెడతామని... అవినీతికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో అసెంబ్లీ నిర్ణయిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డిపై పరోక్షంగా విరుచకపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు మంత్రి పదవి ఇస్తామన్న హామీని అమలు చేయకుండా రాష్ట్ర ముఖ్య నేతలు అడ్డుకున్నారని మండిపడ్డారు. తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు వివరించినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రాజగోపాల్ రెడ్డి ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. తనకు మంత్రి పదవిపై హైకమాండ్ మాట ఇచ్చిన విషయం సహా.. కొందరు అడ్డుకుంటున్నారనే వాస్తవాలను భట్టి బయటపెట్టారని చెప్పారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదన్నారు. ప్రజలుకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలని, అవినీతి రహిత పాలన అందించాలని కోరుతున్నానని పేర్కొన్నారు. తెలంగాణ సమాజ ఆకాంక్షలను నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని ఆశిస్తునట్లు స్పష్టం చేశారు.

# సంక్షేమానికి లక్షకోట్లు

>> పరిశ్రమలకు సైతం విద్యుత్ సరపరాచేసే విధంగా, రైతులకు బోరుమోటర్లకు ఎలాంటి ఇబ్బందులకు ఉండకూడదనే ఉద్దేశంతో మండలానికి 100 ట్రాన్స్ ఫారమ్‌లను నేడు అందజేస్తున్నట్లు తెలిపారు, రాష్ట్రం రాబోయే భవిష్యత్‌కు అనుగుణంగా కేవలం నాన్ కన్వేషన్ గ్రీన్ ఎనర్జిని చేయడం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వం కార్యాలయాలను లెక్క చెప్పాలని, ప్రభుత్వ, పాఠశాలలు, కళశాలలు, యూనివర్సిటి లలో సోలార్ ఎనర్జిని ద్వారా విద్యుత్‌ను అందించే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది, అందుకు జిల్లా కలెక్టర్‌లకు పూర్తి సమాచారాన్ని, వారం రోజుల్లో ఇవ్వలని ఆదేశాలను జారిచేశారు, ప్రభుత్వం మాడ్రన్ సోలార్ కాకుండా, ఇరిగేషన్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాల్సిందిగా భావిస్తుందన్నారు, భవిష్యత్ మైడల్ పవర్‌తోపాటు, సోలార్ గ్రీన్ ఎనర్జిని అభివృద్ధి చేసెందుకు, ప్రభుత్వ భూముల్లో సోలార్‌ను ఏర్పాటుచేసి తద్వార విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు, చేవెళ్ల ఎమ్మెల్యే అడిగిన 132కెవి అజీజ్‌నగర్‌లో 5 ఎకరాల భూమి ఏర్పాటుచేసి ప్రహారి నిర్మాణం చేసి సిద్దంగా ఉందని, అక్కడ నుతన విద్యుత్ ఉపకేంద్రం అడిగారని, కచ్చితంగా ఏర్పాటుచేస్తామని హామి ఇచ్చారు, విద్యుత్ అధికారులకు అజీజ్‌నగర్‌లో 132కెవి ఉపకేంద్రానికి ఏర్పటుకు ప్రణాళికను వ్యాయం సంబందించి, వివరాలను ఇవ్వలని విద్యుత్ సిఎండికి ఆదేశించారు, ప్రస్తుతం ఇప్పుడు చిల్కూర్ నాగిరెడ్డి గూడ, బాకారంకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు టిఎస్ఎన్‌పిడిసిఎల్, టిఎస్ఎస్‌పిడిసిఎల్, ఉపకేంద్రాలను, 20 కోట్ల పైబడి కర్చుతో సబ్‌స్టేషన్‌లను ఏర్పాటుచేస్తున్నామన్నారు, మెత్తం 5 సబ్‌స్టేషన్‌లు సాంక్షన్ అయ్యాయని, ఇంకా రెండు పనులు నడుతస్తున్నాయన్నారు, కిలోకి 50 రూపాయలు మార్కెట్ ధర ఉన్న సన్న బియ్యం, ఉచ్చితంగా రేషన్ కార్డులో ఉన్న ప్రతి ఒక్కరికి 6 కిలోలు చొప్పున పంపిణి చేస్తుందన్నారు, రాష్ట్రంలో 95 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం సరఫార చేస్తున్నామన్నారు, రంగారెడ్డి జిల్లాలో 31 ఐదు, వేల కొత్త రేషన్ కార్డులను, 1,97444 మంది రేషన్ కార్డులలో అదనంగా కుటుంబీకులను చేర్చడం జరిగిందన్నారు.

# రాహుల్ అరెస్టు

>> ఏర్పాటుచేసారు. ర్యాలీ వెళ్లకుండా అష్టదిగ్బంధం చేసారు. దీనితో తీవ్ర ఉద్రిక్తతలుచోటుచేసుకున్నాయి. వెంటనే స్పందించిన పోలీసులు లాఠీచార్జిచేసినంతపనిచేసారు. కానీ చేయలేదు. అయితే ముందుగా రాహుల్‌గాంధీ, కెసి వేణుగోపాల్, అఖిలేష్‌యాదవ్ వంటి సీనియర్ నాయకులందరినీ అరెస్టుచేసి వాహనంలో అక్కడినుంచి తొలగించారు. ఓటరు జాబితాల ప్రత్యేకసవరణపై ప్రశ్నించేందుకు శాంతియుత మార్గంలో ర్యాలీగా వెళుతున్న ఎంపిలపై పోలీసులు దౌర్జన్యంచేయడం ఎంతవరకూ సబబని రాహుల్‌ప్రశ్నించారు. తదనంతరం నాయకులందరినీ సొంతపూచీకత్తుపై పోలీసులు విడుదలచేసినట్లు తెలుస్తోంది. సోమవారం పార్లమెంటు సమావేశాలుప్రారంభం అయినప్పటినుంచీ కూడా విపక్ష ఎంపిలు ప్రత్యేకించి ఓటర్లజాబితా సవరణలపైనే ఫోకస్ పెట్టారు. అందుకు అనుగుణంగా ర్యాలీ తీయడంలో ర్యాలీకి అనుమతులు లేవని అడ్డగించిన పోలీసులు చివరకు రాహుల్ ఇతర సీనియర్లందరినీ అరెస్టులుచేసారు.

**పార్లమెంటు నుంచి ఇసి వరకు విపక్ష ఎంపిల ర్యాలీ**

బీహార్‌లోప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో విపక్ష ఎంపిలుచేపట్టిన పార్లమెంట్ టు ఈసీ ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీనితోప్రతిపక్ష ఎంపిలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తంచేసారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలందరినీ ఢిల్లీపోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు. బీహార్‌లో ఓట్ల సవరణకు నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి ఎంపిలు ఈర్యాలీచేపట్టారు. పార్లమెంట్‌నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి బయలుదేరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందంటూ ఎంపిలు నినాదాలుచేసారు.

ఈ ర్యాలీలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ,ఎన్సీపీ అధినేత శరద్ పవార్, సమాజ్‌వాదీ ఎంపి అఖిలేష్ యాదవ్‌సహా సుమారు 300 మంది లోక్‌సభ రాజ్యసభ విపక్ష ఎంపిలు పాల్గొన్నారు. ఈ ర్యాలీకి ఎలాటి ముందస్తు అనుమతి తీసుకోక పోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. సంసద్ మార్గ్‌లో భారీగాపోలీసులు మొహరించారు. ఈ రహదారిని బ్లాక్‌చేసి బారికేడ్లుపెట్టారు. దీనితోపరిస్థితిఉద్రిక్తంగా మారింది. అఖిలేష్‌యాదవ్ సహా కొంతమంది ఎంపీలు బారికేడ్లు దూకేందుకు యత్నించారు. వాటిపైకి ఎక్కి నిరసన తెలిపారు. పోలీసులు వారిని నిలువరించడంతో ఎంపిలుఅక్కడే బైఠాయించి నిరసనలు తెలిపారు. దీనితో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో అక్కడినుంచి తరలించారు. బీహార్ సమగ్రసవరణ బీహార్‌సర్ సర్వే సహా పలు అంశాలపై మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని కాంగ్రెస్‌నేత జైరామ్‌రమేష్ ఈసీకి లేఖరాసారు. ఇందుకు అనుమతించిన కేంద్ర ఎన్నికల సంఘం విపక్షాలతో భేటీకి అంగీకరించింది. అయితే 30 మంది విపక్ష ఎంపిలు మాత్రమే సమావేశానికి రావాలని చెపుతూ సోమవారం మధ్యాహ్నం అపాయింట్‌మెంట్ ఇచ్చింది. దీనితోనే విపక్ష ఎంపిలందరూ ఎన్నికల సంఘానికి ర్యాలీ తీయడంతో అనుమతులు లేవని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



ఢిల్లీలో విపక్షాల ఆందోళనలో అధ్యక్షుడు ఖర్గే, పవార్ తదితరులు

# మరో 476 పార్టీలపై ఇసి వేటు

>> జాబితాలనుంచి తొలగించేందుకు చర్యలుచేపట్టినట్లు తెలిపింది. ఇందులోభాగంగానే తొలిరౌండ్‌లో ఆగస్టు 9న 334 పార్టీలను జాబితానుంచి తొలగించగా రెండోరౌండ్‌లో మరో 476 పార్టీలను గుర్తించినట్లు వెల్లడించింది. తాము డీలిస్ట్‌చేసిన పార్టీలేవీ ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29సీ, 29బీ ఆదాయపు పన్ను చట్టం 1961, ఎన్నికల గుర్తులు రిజిస్ట్రేషన్, కేటాయింపులు ఉత్తర్వులు 1968 కింద ఉన్న ప్రయోజనాలు ఇకపై పొందలేవనిఈసీ ప్రకటించింది.

**తెలంగాణ నుంచి 13 పార్టీలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు11:** నిబంధనలను పాటించకపోవడంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 13 రిజిస్టర్డ్ గుర్తింపు లేని రాజకీయ పార్టీలను (ఆర్‌యుపిపిఎ) ఎన్నికల సంఘం (ఈసీ) జాబితా నుండి తొలగించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్షన్ రెడ్డి తెలిపారు.ఆగస్టు 9న జారీ చేసిన ఈ ఉత్తర్వులను అమలుచేయాల్సిందిగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లకు పంపినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రద్దు చేసిన పార్టీలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య సమితి పార్టీ (రంగారెడ్డి), బహుజన్ సమాజ్ పార్టీ - అంబేద్కర్-ఫూలే (మెడ్చల్-మల్కాజిగిరి), ఇండియన్ మైనారిటీస్ పొలిటికల్ పార్టీ (హైదరాబాద్), జాతీయ మహిళా పార్టీ (రంగారెడ్డి), యువ తెలంగాణ పార్టీ (రంగారెడ్డి), జాగో పార్టీ (హైదరాబాద్), నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (హైదరాబాద్), తెలంగాణ కర్మిక రైతు రాజ్యం పార్టీ (హనుమకొండ), తెలంగాణ లోక్‌సత్తా పార్టీ (హైదరాబాద్), తెలంగాణ మైనారిటీస్ ఓబీసీ రాజ్యం (హైదరాబాద్), తెలంగాణ ప్రజా సమితి - కిశోర్‌రావు, కిషన్ (హైదరాబాద్), తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ (వరంగల్), యువ పార్టీ (హైదరాబాద్). రాష్ట్రం సహా దేశవ్యాప్తంగా పార్టీ రిజిస్టర్లను శుద్ధి చేయడం, క్రియాశీలంగా ఉన్న, నిబంధనలను పాటించే పార్టీలను మాత్రమే జాబితాలో ఉంచడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టినట్లు ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు.



ఎంపీల ఫ్లాట్ల ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం న్యూఢిల్లీలో శ్రమజీవులతో సంభాషిస్తున్న ప్రధాని మోడీ

# అంతా వరద బురద

>> వర్షాలు ఇందుకు ఒక ఉదాహరణగా చెప్పాలి. వర్షాకాలానికి తోడుగా బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడడంతో రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులుగా భారీ నుండి వర్షాలు కురుస్తున్నా. హైదరాబాద్ సహా పలుచోట్ల క్లౌడ్ బరస్ట్ తరహాలో కుంభవృష్టి కురిసింది. ఇక చిన్న పాటి వర్షానికే రాష్ట్రంలోని రహదారులన్నీ చెరువులను తలపించడం తెలిసిందే. భారీ వర్షం పడితే, క్లౌడ్ బరస్ట్ అయి కుంభవృష్టి కురిస్తే రహదారు లన్నీ చెరువులు, నదులను తలపిస్తుంటాయి. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా వీటికి సమీపంలో గల రహదారులు, వాటికి దగ్గరగా వున్న జాతీయ రహదారులపై వరదనీరు నదుల్లో ప్రవహించినంత వేగంగా ప్రవహిస్తుండడంతో కొన్నిసార్లు వాహనదారులు నీటిలో కొట్టుకు పోతున్నారు. నిన్నమొన్నటి వరకు ముంబాయి, చెన్నై, బెంగళూరు నగరాలలో కురిసిన భారీ వర్షాలకు ఆయా నగరాలలో ప్రజల అవస్థలను టీవీలలో చూసిన భాగ్యనగర వాసులు ఈ కష్టాలు నిజంగా ఎలా వుంటాయనేది రెండేళ్లుగా ప్రత్యక్షంగా చూస్తున్నారు.

ఇదివరకటితో పోలిస్తే కొన్నేళ్లు గా వానల ధాటి వున్నట్లుండి తీవ్రమవుతున్న తీరు వాతావరణ శాఖ అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వర్షం మొదలైన ఐదు పది ని మిషాల వ్యవధిలోనే చాలా ప్రాంతాలలో భారీ, అతి భారీగా మారడంతో రోడ్లన్నీ ఏర్లుగా మారుతున్నాయి. ఇక భారీ వర్షం ధాటికీ హైదరాబాద్, సై బరాబాద్, రాచకొండ పరిధుల్లో ట్రాఫిక్ వ్యవస్థ తరచూ అదుపు తప్పుతోంది. నగరంలోని ప్రధాన రహదారులైన అఫ్జల్‌గంజ్, ఉస్మాన్‌గంజ్, మోజం జాహీ మార్కెట్, లక్‌డికాపూల్, ఖైరతాబాద్, పంజగుట్ట, సనత్‌నగర్ మార్గం, చార్మినార్, అఫ్జల్‌గంజ్ కోఠి, ముషీరాబాద్ మీదుగా సికింద్రాబాద్ మా ర్గం, దిల్‌సుక్‌నగర్, కోఠి మీదుగా మోజంజాహీ మార్కెట్, సనత్‌నగర్ మార్గం, సికింద్రాబాద్ బాలానగర్ మీదుగా పటాన్‌చెరు వెళ్లే మార్గం, దిల్‌సుక్ నగర్, మూసారాంబాగ్, కోఠి మీదుగా సికింద్రాబాద్ వైపు వెళ్లే మార్గాలలో వరదనీరు గంటల తరబడి నిలిచి వుండడంతో ట్రాఫిక్ ఒక్కసారిగా కూనా రిల్తుతున్నాయి. ఇదే సమయంలో వివిఐపిలు, ఐటి కంపెనీలు ఎక్కువగా వుండే మాదాపూర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల లోనూ వర్షం ధాటికి వరద నీరు రోడ్లను ముంచెత్తుతోంది. ఇక హైదరాబాద్ నుంచి విజయవాడ, బెంగళూరు, ముంబాయి, నిజామాబాద్, వరంగల్ కు వెళ్లే జాతీయ రహదారులపై తరచూ వరదనీరు చేరి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచి పోతోంది. జాతీయ రహదారులపై వరదనీరు చేరడం అనేది ఈ నాటిది కాదు. అయితే ఈ సమస్య ప్రతీయేటా నెలల తరబడి వేధిస్తున్నా దీనికి శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పాలి. ప్రధాన రహదారులతో పాటు వాటికి అనుసంధానంగా వుండే సమాంతర మార్గాలలో కూడా తీవ్రంగా ప్రవహించడంతో వాహనదారులు తీ వ్ర ఇబ్బందులను చవిచూస్తున్నారు. రాష్ట్రంలో మరో వారం రోజుల పాటు భారీ వర్షాలు కురిసే వీలుందని వాతావరణ శాఖ చెబుతుండడంతో ట్రా ఫిక్ ఇక్కట్లు, ప్రజల అవస్థలు అప్పటి వరకు తీరేలా లేవు.

**ఫ్లై ఓవర్లు అండర్ పాస్‌లలోనూ వరదనీరు...తప్పని ట్రాఫిక్ జాంలు**

ఇదిలావుండగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిలతో పాటు అండర్ పాస్‌లలోనూ వరదనీరు నిలిచి పోవడంతో ట్రాఫిక్‌జాంలు తప్పడంలేదు. పంజాగుట్ట, బేగంపే ట్, పివి నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే పైనా తరచూ వరద నీరు నిలిచి పోతుండడంతో వాహనదారులు ముందుకు కదలలేక పోతున్నారు.

ఈ స మస్య గ్రేటర్ హైదరాబాద్‌లోని ఫ్లై ఓవర్లపైన మాత్రమే కాకుండా రాష్ట్రంలోని మెజారిటీ ఫ్లై ఓవర్లపైనా వుండడం గమనార్హం. ఇదే సమయంలో మల క్‌పేట్ రైల్వే బ్రిడిజ్ల సహా పలుచోట్ల అండర్ పాస్‌ల మార్గాలలోనూ వరదనీరు నిలిచిపోయి ట్రాఫిక్ జాంలకు ఆస్కారం ఏర్పడుతోంది.

# 18 నుంచి అసెంబ్లీ?

>> అవకాశం కోల్పోతున్నారు.గతంలో మున్సిపాలిటీ చట్టంలో ఈ నిబంధనను తొలగించినట్లే ఇప్పుడు పంచాయితీ రాజ్ చట్టంలోనూ సవరణలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జనాభా నియంత్రణలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1995లో పంచాయతీరాజ్ చట్టంలో ఈ నిబంధనను చేర్చింది. సెక్షన్ 21(3) ప్రకారం ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉన్నవారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు.ఈ నిబంధన వల్ల ఎంతో మంది ఆశావహులు పోటీ చేసే అవకాశాన్ని కోల్పోతున్నారు. గతంలో ఈ నిబంధనను ఉల్లంఘించి ఎన్నికల్లో గెలిచిన సందర్భాల్లో, ఓడిపోయిన అభ్యర్థులు కోర్టులకు వెళ్లడంతో, కోర్టుల తీర్పుల కారణంగా పదవులు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ఈ నిబంధనను తొలగించాలని డిమాండ్ చాలా కాలంగా ఉంది.మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇద్దరు పిల్లల నిబంధన లేనప్పుడు. పంచాయతీ ఎన్నికలకు మాత్రమే ఈ నిబంధన ఎందుకు అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ చట్టంలో సవరణ చేసి ఈ నిబంధనను తొలగించింది.ప్రస్తుతం, కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఇదే తరహా ఒత్తిడి పెరుగుతోంది.ఇద్దరి పిల్లల నిబంధనను తొలగించడమే కాకుండా,బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే కూడా ఈ చట్టంలో మార్పులు అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. పంచాయతీరాజ్ శాఖ గతంలోనే ఈ నిబంధనను ఎత్తివేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయితే అప్పుడు ఈ అంశంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి పెరగడంతో ప్రస్తుతం ప్రభుత్వం దీనిపై పునరాలోచనలో పడింది. పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 21(3) ను తొలగించే ప్రతిపాదనను కేబినెట్ ముందు ఉంచడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సవరణ అమల్లోకి వస్తే, రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేసే అవకాశం లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# బిఆర్ఎస్ హయాంలో అప్పు 8 కాదు... 3.5 లక్షల కోట్లు మాత్రమే

>> కాకతీయ,పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం,కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆ నిధులను ఖర్చు చేసిందన్నారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ, సమర్థతతోనే రాష్ట్రం వేగంగా పురోగమించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలివిగా ఆర్థిక నిర్వహణ చేసిన సంగతి కేంద్రం ఇచ్చిన నివేదికతో తెలుస్తుందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ అప్పులు రూ.3,50,520.39 కోట్లు అయితే,అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల విలువ రూ.4,15,099.69 కోట్లుగా ఉందన్నారు. అంటే, అప్పుల కంటే ఆస్తుల విలువ రూ. 64,579 కోట్లు ఎక్కువగా ఉందని తెలిపారు. గత ఆరు ఆర్థిక సంవత్సరాలుగా (2018-19 నుండి 2023-24 వరకు) ప్రతి ఏటా తెలంగాణ అప్పుల కంటే ఆస్తుల విలువ రూ. 50 వేల కోట్లకు పైగా పెరిగిందన్న కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వ సమర్థతకు ఈ గణాంకాలే నిదర్శనం అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేస్తుందని ఆరోపించిన రేవంత్ రెడ్డి, తాను ముఖ్యమంత్రి అయిన మరుక్షణం నుంచే విపరీతంగా అప్పులు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. 2023 డిసెంబర్ నుంచి అంటే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ మార్గాల ద్వారా రూ.1.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ అప్పులు చేసినట్లు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అంగీకరించిన సంగతిని కేటీఆర్ గుర్తుచేశారు. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టకుండానే, హామీ ఇచ్చిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలుచేయకుండానే రేవంత్ ప్రభుత్వం ఇన్ని లక్షల కోట్లు అప్పు ఎందుకు చేసిందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వ అనాలోచిత, అస్తవ్యస్త ఆర్థిక నిర్వహణతో తెలంగాణ తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు కేంద్రం ఇచ్చిన గణాంకాలపై ఏం సమాధానం చెబుతారని కేటీఆర్ ప్రశ్నించారు.నిజాలు తెలుసుకుని,నిరాధారమైన ఆరోపణలు మానుకుని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.పారదర్శకత లేని ఆర్థిక విధానాలను అవలంబిస్తూ, అప్పులను ప్రజల మీద మోపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా తమ పరిపాలన గురించి సమీక్షించుకోవాలన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గడం ప్రమాద ఘంటికలను మోగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. కాగ్ త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం బాగా తగ్గిందని అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఆర్థిక రంగం దెబ్బతింటోందని, ఆరు గ్యారెంటీల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసిందని విమర్శించారు.రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే.. అప్పులు మాత్రం పెరుగుతున్నాయని, రూ.2,738 కోట్ల మిగులు ఉంటుందని బడ్జెట్ లో చూపారని మండిపడ్డారు. మొదటి త్రైమాసికానికే రూ.10,583 కోట్ల రెవెన్యూ లోటు ఉందని, మూడు నెలల్లోనే రూ. 20,266 కోట్లు అప్పుగా తీసుకున్నారని ధ్వజమెత్తారు. ఒక్క రోడ్డు వేయలేదని ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదని అన్నారు.

# రైతు బీమా కోసం కొత్త పాస్‌బుక్‌ల వెరిఫికేషన్

>> అర్హత ఉండి ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వారందరూ కలిపి దాదాపు 2 లక్షల వరకు ఉండొచ్చని ప్రాథమిక అంచనా. కొత్త బీమా సంవత్సరంలో ఇప్పటికే రైతు బీమా కలిగిన లబ్ధిదారులైన రైతుల రెన్యూవల్స్‌కు సంబంధించి డేటా పరిశీలన ఈనెల 12లోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ క్షేత్ర స్థాయి అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. 60 సంవత్సరాలు నిండిన వారిని తొలగించి మిగిలిన అర్హులైన రైతులకు బీమాను రెన్యూవల్ చేయాలని సూచించారు. రైతు బీమా పోర్టల్లో రెన్యూవల్ అప్లోడ్ ప్రక్రియ పూర్తి అయిన వారికి ఈనెల 14వ తేదీ నుంచి కొత్త బీమా అమలు చేయనున్నారు. ఒకే రైతుకు రెండు అంతకంటే ఎక్కువ గ్రామాల్లో భూమి పట్టా పాస్ బుక్ కలిగి ఉన్నప్పటికీ ఒకే పాలసీకి వర్తింపు ఉంటుందని తాజా మార్గదర్శకాల్లో అధికారులు పేర్కొన్నారు. భూ భారతిలో జూన్ 5వ తేదీ వరకు ఫట్టా పాస్‌బుక్, సీసీఎల్ఎలో నమోదైన రైతులకు మాత్రమే రైతు బీమా వర్తింపు ఉంటుందని అధికారులు తెలిపారు. సీసీఎల్ఎలో లేని భుములున్న రైతులకు బీమా వర్తింపు ఉండదని తాజా సర్క్యులర్ లో స్పష్టం చేశారు. రైతు బీమా కలిగిన రైతులు సహజ మరణమైనా, ఏ విధంగా చనిపోయినా సదరు రైతు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందుతుందని వ్యవసాయశాఖ పేర్కొంది.

## వచ్చే నెలలో వందేభారత్ హైస్పీడ్ స్లీపర్ రైళ్లు

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** వచ్చే నెలలో నూతనంగా వందేభారత్ సెమీ హైస్పీడ్ రైళ్లను ఏర్పాటుచేయనున్నారు. గంటకు 180కి.మీ వేగంతో ప్రయాణించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. భారత రైల్వేలో రాత్రి వేళ్లలో ప్రయాణాలకు సౌకర్యవంతంగా రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. అయితే స్లీపర్ కోచ్ రైళ్లు రాజధాని మార్గంలోనే ఉంటాయని,ఏసీ ఫస్ట్‌క్లాస్, ఏసీ 2 టయర్, ఏసీ 3 టయర్ సహా 16కోచ్‌లతో 11వందల28 మంది ప్రయాణికుల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. న్యూఢిల్లీ-హౌరా, న్యూఢిల్లీ-ముంబై, న్యూఢిల్లీ -పూణే, న్యూఢిల్లీ- సికింద్రాబాద్ మార్గాల్లో రాకపోకలు సాగించనున్నాయి. 508 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 2 గంటల 7 నిమిషాల్లో చేరుకుంటుందని కేంద్ర రైల్వేశాఖ వెల్లడించింది.

## రైల్ల టిక్కెట్ల రద్దుపై రిఫండ్ పెంపు

**హైదరాబాద్,ఆగస్టు11, ప్రభాతవార్త:** అనివార్యాల కారణాలతో రైళ్ల టికెట్ల క్యాన్సల్‌పై కీలకం నిర్ణయం తీసుకోనుంది. అయితే టిక్కెట్లపై వచ్చే రిఫండ్ కొంత అదనంగా ఇచ్చేందుకు కేంద్రప్రభుత్వం యోచిస్తుంది. టిక్కెట్లపై క్లర్కేజ్ చార్జీ తగ్గింపు లేదా పూర్తిగా తొలగించే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటివరకు వెయింటింగ్ లిస్ట్, ఆర్‌ఏసీ టిక్కెట్లను రద్దు చేసుకున్నప్పుడు ఈ చార్జీలు మినహాయించుకొని ప్రయాణికులకు డబ్బులు తిరిగి చెల్లిస్తున్నారు.

## దేశవ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై

**హైదరాబాద్,ఆగస్టు11, ప్రభాతవార్త:** దేశంలో అన్ని రైల్వే స్టేషన్లలో ఉచిత హైస్పీడ్ వైఫై సౌకర్యం ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. పార్లమెంట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఫై సదుపాయంతో ప్రయాణికులు, సినిమాలు,పాటలు, గేమ్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అన్‌లిమిటెడ్ అని పేర్కొన్నారు. ఇక అత్యవసర సమయాల్లో స్టేషన్ పరిసరాల్లో ఆఫీస్ పనులు కూడా చేసుకోవచ్చని వివరించారు. అయితే ఇది సహకార సంస్థ 'రైల్‌టెల్' ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా న్యూఢిల్లీ, అహ్మదాబాద్,ముంబాయ్,కాచిగూడ, సికింద్రాబాద్‌తోపాటు 6115 స్టేషన్లల్లో సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. వైఫై ఎనేబ్ చేసి రైల్‌వైర్‌వైఫై నెట్‌వర్క్‌కు కనెక్ట్ చేయడంతో పాటు ఫోన్‌నెంబర్ ఓటీపీని నమోదు చేయడంతో వైఫైసేవలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు.

## 43 కేజీల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్,ఆగస్టు 11 ప్రభాతవార్త:** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న 43 కేజీల గంజాయిని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ పట్టుకున్నారు.దీని విలువల రూ.22 లక్షలు ఉంటుందని అంచనావేశారు. హైదరాబాద్‌కు చెందిన ఒక అద్దెకారును కిరాయికితీసుకొని కారులో ఒడిశా ప్రాంతానికి వెళ్లి అక్కడి నుంచి కారులో 43 కిలోల గంజాయిని తీసుకువస్తుండగా ఏక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు పట్టుబడ్డాడు.సురేందర్ సింగ్ (23) రాజ్‌కోట్, రాజస్థాన్ స్వంత స్వగ్రామం. కాగా చాలా సంవత్సరాల క్రితమే నగరానికి వచ్చిన హైదరాబాద్‌లో నివాసముంటున్న ఆయన గత కొంత కాలంగా గంజాయి అమ్మకాలు సాగిస్తున్నాడని విచారణలో వెల్లడయ్యింది. భద్రాచలం ఇసుక స్టాండ్ సమీపంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఖమ్మం టీమ్ ఎస్ఐ శ్రీధర్‌రావు, హెడ్‌కానిస్టేబుళ్ల ఎంఏ ఖరీమ్, జి.బాలు,కానిస్టేబుళ్ల వెంకట్,సుధీర్, హరిష్, వీరబాబు, ఉపేందర్‌లు కలిసి పక్కా సమాచారం మేరకు వాహనాల తనిఖీలు నిర్వహించారు. వారి తనిఖీలో 43 కేజీల గంజాయి పట్టుబడింది. వారు పట్టుకున్న గంజాయిని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.గంజాయిని పట్టుకున్న ఖమ్మంఎన్‌ఫోర్స్ మెంట్‌టీమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ అభినందించారు.

## కీసర ఔటర్ రింగురోడ్డుపై ఘోర ప్రమాదం
## వాహనం ఢీ కొని ముగ్గురు కూలీల మృతి

**కీసర, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ఔటర్ రింగురోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మొక్కలకు నీరు పడుతున్న ముగ్గురు కూలీలు అక్కడిక్కడే మృతిచెందారు. ఔటర్‌రింగురోడ్డుపై అతివేగంగా వస్తున్న వాహనం కూలీలను ఢీకొనటంతో ముగ్గురు కూలీలు మృతిచెందారు. సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. కీసర పోలీస్‌ఇన్స్‌పెక్టర్ అంజనేయులు కథనం ప్రకారం ఒడిస్సాకు చెందిన నారాయణ(28), చెక్మోహన్ (24), జైరామ్ (32)లు రెండు రోజుల క్రితమే బతుకు దెరువు నిమిత్తం శామీర్‌పేటకు వచ్చినట్లు తెలిపారు. అయితే ఇతర కూలీలతో కలిసి ఆ ముగ్గురు కూలీలు కూడ మొక్కలకు నీరు పోసే పనికి రావటం జరిగిందన్నారు. మధ్యాహ్నం భోజనం చేశాక కూలీలు అందరు కలిసి కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారన్నారు. విశాఖపట్నం గాజువాక నుంచి సెల్‌ఫోన్ టవర్ సామాగ్రితో మేడ్చల్ వైపునకు వస్తున్న టాటా ఇంట్రా వాహనం అతివేగంగా వచ్చి కూలీలపైకి దీసుకొచ్చినట్లు తెలిపారు. దీంతో కొందరు ఇతర కూలీలు తప్పించుకున్నారు. వాహనం ఆగ కుండా అదేవేగంతో వెళ్తూ ఉండటంతో కూలీలు తప్పించుకునేందుకు పరుగెత్తుత్తుండగా ముగ్గురి కూలీలను ఢీకొట్టినట్లు తెలిపారు. తీవ్రగాయాలకు గురైన ఆ ముగ్గురు కూలీలు అక్కడిక్కక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వాహనం డ్రైవర్ గణేశ్ మద్యం మత్తులో ఉండి అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడపటంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుప్రతి మార్చురికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదంకు కారణమైన వాహనం డ్రైవర్ గణేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## లుసెంట్ ఫార్మా కంపెనీకి చెందిన
## రూ.5.67 కోట్ల ఆస్తులు జప్తు చేసిన ఇడి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** పాకిస్థాన్‌కు అక్రమంగా ట్రమడాల్ అనే డ్రగ్‌ను విక్రయించినందుకు హైదరాబాద్‌లోని ప్రముఖ ఫార్మా కంపెనీ లుసెంట్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 5.67 కోట్ల రూపాయల ఆస్తులను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరా బాద్ విభాగం జప్తు చేసింది. ఈ మేరకు ఈడీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. లుసెంట్ ఫార్మా కంపెనీ ట్రమడాల్ డ్రగ్‌ను కొంత కాల ంగా పాకిస్తాన్‌కు అక్రమంగా అమ్ముతూ దండిగా లాభాలు గడిస్తోందని ఈడీ ఆరోపించింది. ఈ క్రమంలో ఐదు కోట్ల 40 లక్షల రూపాయలు ఈ కంపెనీ ఆర్జించినట్లు ఈడీ పేర్కొంది. ఇదంతా మనీలాండరింగ్ కోణంలో జరిగిందని ఈడీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో లుసెంట్ ఫార్మా కంపెనీ ఆ స్తులను జప్తు చేసినట్లు ఈడీ తెలిపింది. వాస్తవానికి గత ఫిబ్రవరి నెలలోనే ఈ ఆస్తులు జప్తు జరిగినా అధికారికంగా సోమవారం వెల్లడించారు.




## రూ.50 లక్షలతో ఎస్‌బిఐ విద్యామౌలిక సదుపాయాల కల్పన

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఎస్‌బిఐ చైర్మన్ చల్లా శ్రీని వాసులుసెట్టి ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌కు మద్దతును అందించారు. గ్రామీణ అభ్యాసం, సాధికారతను బలోపేతం చేయడానికి విద్యా మౌలిక సదుపాయల కింద కంప్యూటర్, ప్రయోగ శాలల ఏర్పాటుతో సహా 50 లక్షల విలువైన విద్యా మౌలిక సదుపాయాలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ నికర లాభంలో 1శాతం సామాజిక బాధ్యత కింద కేటాయించాలని ఆదేశించిన ప్పటికీ, చాలా కాలంగా ఈ రంగంలో అగ్రగామిగా ఉందన్నారు. గ్రామ సేవా కార్యక్రమం సమగ్ర గ్రామ అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని చెప్పారు. అయితే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ ఉద్యోగ మరియు నిరుద్యోగ వ్యక్తులకు నైపుణ్యం పెంపొందించడం మరియు మద్దతు ద్వారా సాధికారత కల్పిస్తున్నట్లు వెల్లడించారు. తన సర్కిల్‌ల ద్వారా ఆరోగ్య సంరక్షణ, విద్య, పర్యావరణం మరియు గ్రామీణాభివృద్ధికి సంబంధించి దేశవ్యాప్త వివిధ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. స్థానిక ఉపాధిని పెంచ దానికి బ్యాంక్ అనేక ప్రాంజమిక ఆరోగ్య కేంద్రాలను దత్తత తీసుకుంది, పాఠశాల మౌలిక సదుపాయాలను మెరుగు పరచడం, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలలో పెట్టుబడి సైతం పెట్టినట్లు తెలియచేశారు.

### బెట్టింగ్ యాప్‌లపై కొనసాగుతున్న ఇడి విచారణ
## రానాను 4గంటలు విచారించిన అధికారులు



**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక మంది ప్రాణాలను బలిగొన్న బెట్టింగ్ యాప్‌ల గోల్‌మాల్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ విభాగం సినీ తారలను విచారించే క్రమం కొనసాగుతోంది. ఈ కేసులో ఇంతకు ముందు ప్రకాష్ రాజ్, విజయ్ దేవరకొండను విచారించిన ఈడీ అధికారులు సోమవారం నాడు దగ్గుబాటి రానాను నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. పలువురు సినీ నటులతో పాటు సోషల్ మీడియా ఇన్‌ఫ్ల్యూయెన్సర్లు, టీవి హోస్ట్‌లు బెట్టింగ్ యాప్‌లను ప్రమోషన్ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో జంగ్లీ రమ్మీ, a23, జీట్‌విన్, పారిమ్యాచ్, లోటస్ 365 వంటి యాప్‌లను ప్రమోట్ చేసిన ప్రముఖులపై 1867 పబ్లిక్ జూదం చట్టం కింద పంజాగుట్ట, మియాపూర్, సైబరాబాద్, సూర్యాపేట, వైజాగ్‌లలో కేసులు నమోదయ్యాయి. బెట్టింగ్ యాప్‌లో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. ఈ క్రమం లోనే నటుటు దగ్గుబాటి రానాకు ఈడీ నోటీసులు జారీ చేయగా ఉదయం 11గంటల సమయంలో ఆయన బషీర్‌బాగ్ లోని ఈడీ కార్యాలయానికి వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నించారు. ఏ ఏ బెట్టింగ్ యాప్‌లకు మీ రు ప్రమోట్ చేశారు? ఈ సందర్భంగా ఆయా కంపెనీల నుంచి మీకు అందిన సొమ్ము ఎంత? ఇదే సమయంలో కమీషన్లు ఎంత ముట్టాయి? అని ఈడీ అధికారులు రానాను ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో పాటు రానాకు సంబం ధించిన బ్యాంకు లావాదేవీలు, బెట్టింగ్ యాప్‌లతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను ఈడీ అధికారులు తీసుకున్నట్లు తెలిసింది. ఈ పత్రాల ఆధారంగా రానాను ఈడీ అధికారులు నాలుగు గంటల పాటు అనేక అంశాలపై ప్రశ్నిం చినట్లు సమాచారం. కాగా ఈడీ అధికారుల ప్రశ్నలకు రానా కొంత ఇబ్బందిపడినప్పటికీ సమా ధానాలు ఇచ్చినట్లు తెలిసింది. తాను ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్‌ల వల్ల ఎవరికీ నష్టం కలగలేదని ఆయన చెప్పినట్లు తెలిసింది. కాగా ఇదే కేసులో ఈ నెల 13వ తేదీన మంచు లక్ష్మీ ఇడిఅధికారుల ఎదుటవిచారణకు రానున్నారు.

### హెచ్‌సిఎ గోల్‌మాల్ కేసులో కొనసాగుతున్న సిఐడి విచారణ
## దేవరాజ్‌ను ఐదవ రోజు విచారించిన అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** సంచలనం రేపిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) నిధుల గోల్‌మాల్ కేసులో సిఐడి విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో గత జూలై నెల తొమ్మిదవ తేదీన అరెస్టయిన అధ్యక్షుడు జగన్‌మోహన్ రావుతో పాటు కోశాధికారి శ్రీనివాసరావు, సీఈ ఓ సునీల్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ కార్యదర్శి రాజేందర్ యాదవ్, అధ్యక్షురాలు కవితలను ఇప్పటికే ఆరురోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించిన సిఐడి అధికారులు ఇదే కేసులో గత నెల 25వ తేదీన పట్టుబడ్డ హెచ్‌సిఎ కార్యదర్శి దేవరాజ్‌ను వరుసగా ఐదవ రోజు కూడా విచారించారు. హెచ్‌సిఎ స్కాంలో ఈ ఆరుగురి పాత్ర వుందని గతంలో దీనిపై విచారించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చడం తెలిసిందే. దీనిపై ఈడీ కూడా రంగంలోకి దిగడం విదితమే. బిసిసిఐ నుంచి అందిన వందల కోట్ల రూపాయల నిధులను హెచ్‌సిఎ పక్కదారి పట్టించి, సొంత అవసరాలకు వాడుకుందని సిఐడి విచారణలో తేలగా దీంతో పాటు గత ఐపిఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ జట్టును టికెట్ల కోసం బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడినట్లు విజిలెన్స్ ఎన్‌ఫో ర్స్‌మెంట్ నిగ్గు తేల్చింది.

ఉప్పల్ స్టేడియంలో జరిగిన కోట్లాది రూపాయల పనులలో భారీగా అక్రమాలు జరిగాయని, హెచ్‌సిఎ అధ్యక్షుడుగా జగన్‌మో హన్‌రావు ఎన్నికే అక్రమమని, మాజీ మంత్రి కృష్ణా యాదవ్ నెలకొల్పిన గౌలిగూడ క్రికెట్ క్లబ్‌ను ఆయనకు తెలియకుండా సంతకం ఫోర్జరీ చేసి శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరిట ఓ క్లబ్‌ను తన వారిచేత తప్పుడు పత్రాలతో జగన్ మోహన్‌రావు ఏర్పాటు చేసినట్లు సిఐడి తేల్చింది. దీని తరువాత ఇందులో తన వారినే నియమించి, తాను సభ్యుడుగా చేరి, ఆరు నెలలకే హెచ్‌సిఎ ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందడం అంతా డ్రామాగా వుందని సిఐడి విచారణలో తేలింది. ఈ కేసులో మొదట అరెస్టయిన ఐదు గురు నిందితులు వెల్లడించిన సమాచారం ఆధా రంగా ఆ తరువాత పట్టుబడ్డ దేవరాజ్‌ను సిఐడి విచారిస్తోంది. ఇందులో భాగంగా దేవరాజ్ ఇంట్లో సోదాలు చేసిన సిఐడి అధికారులు ఉప్పల్ స్టేడియంలో జరిగిన అక్రమాలపై ఆయనను గంటల తరబడి ప్రశ్నించినట్లు తెలిసింది.

అక్కడి రికార్డులను దేవరాజ్ ఎదుట వుంచి ప్రశ్నించి అన్ని విష యాలను నిగ్గు తేల్చినట్లు సమాచారం. దేవరాజ్ వెల్లడించిన సమాచారం ఆధారంగా మరికొందరిని విచారించేందుకు సిఐడి సిద్ధమవుతోంది.

## యువశాస్త్రవేత్తలు దృఢ సంకల్పంతో కెరీర్‌ను ప్రారంభించాలి
### శిక్షణలో ముఖ్యఅతిథుల దిశానిర్దేశం


జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు ,పాల్గొన్న నూతన శాస్త్రవేత్తలు

**అత్తాపూర్ ఆగస్టు11,ప్రభాతవార్త:** యువశాస్త్రవేత్తలు అంకిత భావంతో పని చేస్తూ రైతులకు సహాయ,సహకారాలు అందించాలని పలువురు ముఖ్యఅతిథులు పేర్కొన్నారు.సోమవారం 115వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ (ఎఫ్‌ఓసీ ఏఆర్‌ఎస్)ను రాజేంద్రనగరలోని ఐసీఏఆర్ నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నారం)లో ప్రారంభించారు. కొత్తగా నియమించిన 108 మంది శాస్త్రవేత్తలు ఆగస్టు -నవంబర్ మధ్య నిర్వహించే కోర్సులో చేరారు. మొత్తం 108 మంది ప్రొబేషనర్లు, 73 మంది పురుషులు మరియు 35 మంది మహిళలు, దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు మరియు 35 వ్యవసాయ విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన సేవలు(ఎఆర్‌ఎస్)లో కొత్తగా నియమించిన శాస్త్రవేత్తలకు దిశానిర్దేశం చేయడానికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ సభ్యుడు డాక్టర్ చబిలేంద్ర రౌల్ మాజీ కార్యదర్శి,డిఓఎఫ్, ఎంఓసీఎఫ్ , మరియు మాజీ ప్రత్యేక కార్యదర్శి, డేర్/ఐసీఏఆర్ కార్యదర్శి, న్యూఢిల్లీ, ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మరియు సమాజానికి ప్రత్యక్ష ప్రయోజనాలను అందించే ప్రాథమిక మరియు అనువర్తిత పరిశోధనలను కొనసాగించాలని ఆయన ప్రొబేషనరీ శాస్త్రవేత్తలను కోరారు. గౌరవ అతిథిగా హాజరైన న్యూఢిల్లీలోని ఐసిఎఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఫిషరీస్ సైన్స్ అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్) డాక్టర్ జోయ్ క్రుష్ణ జెనా, ఆధునిక వ్యవసాయ వ్యవస్థలలోని సవాళ్లు మరియు అవకాశాలపై ఆయన ఆలోచనలను పంచుకున్నారు. మరో గౌరవ అతిథిగా విచ్చేసిన అరుణ్ తివారీ, మిస్సైల్ సైంటిస్ట్ (రిటైర్డ్), రచయిత, మాజీ డిఆర్‌డిఓ డైరెక్టర్, హైదరా బాద్‌లోని కేర్ ఫౌండేషన్ డైరెక్టర్, వ్యవసాయ శాస్త్రవేత్తలను దేశంలోని గొప్ప వనరులలో ఒకరు గా అభివర్ణించారు. అంకితభావం మరియు గర్వంతో పనిచేయాలని ఆయన వారిని కోరారు. నారం యాక్టింగ్ డైరెక్టర్, డాక్టర్ గోపాల్ లాల్, ఐసీఎఆర్ వ్యవస్థలో చేపట్టిన ప్రభావవంతమైన పరిశోధన కార్యక్రమాల గురించి మాట్లాడారు. ముందుగా కోర్సు సమన్వయకర్త డాక్టర్ డి.దామోదర్ రెడ్డి స్వాగతం పలికారు. 115వ ఫోకర్స్ కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఎం. రమేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అకాడమీ శాస్త్రవేత్తలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విపక్ష ఎంపిల అరెస్టులపై వెలువెత్తిన ఆగ్రహం
### ఢిల్లీ పాలకుల నియంతృత్వ పోకడలను నిరసించిన తెలంగాణ మంత్రులు

**హైదరాబాద్, ఆగస్టు 11,ప్రభాతవార్త:**బీహార్‌లో ఓట్ల జాబితా సవరణకు నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి ఎంపిలు చేపట్టిన పార్లమెంట్ టు ఇసి ర్యాలీని పోలీసులు అడ్డుకొని రాహుల్‌గాంధీ, ప్రియాంకలతో పాటు ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ఇండియా కూటమి నాయకులను అదుపులోకి తీసుకోవడంతో దేశవ్యాప్తంగా ఇండియా కూటమి నిరసన వ్యక్తం చేసింది. తెలంగాణ కాంగ్రెస్ నేతలు, రాష్ట్ర మంత్రులు బిజెపి కేంద్రపాలకుల నియంతృత్వ పోకడలను నిరసించారు.

**అరెస్టు అప్రజాస్వామిక చర్య: టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్:** ఓట్ల చోరీ పై ఆధారాలతో సహా నిరూపించి దేశ వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టిన మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ ఎంపిలు ప్రియాంక గాంధీ ఇండియా కూటమి ఎంపిలను ప్రధాని మోడీ సర్కారు ఢిల్లీలో అరెస్ట్ చేయడాన్ని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ తీవ్రంగా ఖండించారు.ఎన్నికల సంఘాన్ని కలిసి ఓట్ల చోరీ పై వినతి పత్రంఇస్తామని శాంతి యుతంగా వెళ్తున్న ఎంపీలను అరెస్ట్ చేయడం అక్రమమని అన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేసి ఓట్ చోరీ పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు..

**అరెస్ట్ అక్రమం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
ఇండియా కూటమి ఎంపీలను ఢిల్లీలో అరెస్ట్ చేయడం ప్రజాస్వామిక ప్రక్రియను అబాసుపాలుచేయడమేనని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు.

**దొంగ ఓట్లతో దొడ్డిదారిన అధికారంలోకి రావడమే బిజెపి విధానం మంత్రి దనసూరి సీతక్క:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర నేతల అక్రమ అరెస్టును రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తీవ్రంగా ఖండించారు. రామ రాజ్యం అంటే దొంగ ఓట్లతో దొడ్డిదారిన అధికారంలోకి రావడమా? జై శ్రీరాం అని నినాదాలు చేస్తూ ప్రజల తీర్పును తారు మారు చేసి పదవులు పొందడమా అని బీజేపీపై నిప్పులు చెరిగారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే సీతక్క అన్నారు.

**నిరసన హక్కులను కాలరాయడం తగదు: మంత్రి పొన్నంప్రభాకర్**
ప్రతిపక్ష ఎంపిల అప్రజాస్వామిక అరెస్ట్‌ను మంత్రి పొన్నం ప్రభా కర్ తీవ్రంగా ఖండించారు. శాంతియుత ర్యాలీ ద్వారా ఇసికి వినతి పత్రం సమర్పించాలని భావించిన ఇండియాకూటమి అరెస్ట్ చేయడం సరికాదు.దీనికి బీజేపీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న ఓటు చోరీ పై ఇసిమాట్లాడాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోడి,అమిత్‌షా అరెస్టులతో రాక్షసానందం పొందుతున్నారని దుయ్యబట్టారు.

**కేంద్ర పాలకులకు బుద్ధిచెప్పనున్న ప్రజలు: నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి:** రాహుల్‌గాంధీ అరెస్టును 140కోట్లమంది భారతీయులు మనసుమీదికి తీసుకొన్నారని కేంద్రపాలకులకు సరైన సమయంలో బుద్ధిచెప్పడానికి వారు సన్నద్ధంగా ఉన్నారని నాగర్‌కర్నూల్ ఎంపి ఎంపీ డాక్టర్ మల్లు రవి తన ఖండనలో పేర్కొన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలో బీహార్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ సమయంలో ఓట్ల చోరీ ఇష్యూ చర్చనీయాంశంగా మారింది. దీని గురించి కాంగ్రెస్ సహా ఇండియా కూటమి ఎంపిలు ఎలక్షన్ కమిషన్‌ను కలవాలని ప్రయత్నించారు. పార్లమెంట్ నుంచి కొంచెందూరం రాగానే మమ్మల్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే కూర్చొని ఆందోళన చేపట్టాం. ఈ సమయంలో పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు అని ఎంపీ మల్లు రవి వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ భారీ మూల్యం చెల్లించక తప్పదని మల్లురవి హెచ్చరించారు.

## జగిత్యాల కలెక్టరేట్‌లో అమానవీయ ఘటన
### స్పందించిన మంత్రి వడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**ప్రజావాణిలో సమస్య తెలిపేందుకు వచ్చిన దివ్యాంగుడిని ఓ కానిస్టేబుల్ ఈడ్చుకెళ్లిన సంఘటన సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన దివ్యాంగ బాధితుడు రాజ గంగారాం గత కొన్ని యేండ్లుగా ఇంటి ముందర రోడ్డు సమస్య పరిష్కారం కోసం పోరాడుతున్నాడు. గత సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాకపోవడంతో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి రాగా అక్కడ ఉన్న సిబ్బంది పోలీసులు కలెక్టర్ వస్తున్నాడని దివ్యాంగుడిని ఈడ్చికెల్లారు. అదే సమయంలో కలెక్టర్ సత్యప్రసాద్ ప్రజావాణి హాల్లోకి వస్తు దివ్యాంగుడిని చూసుకుంటూ హాలులోకి వెళ్లిపోయాడు. రోడ్డు సమస్యను 24 గంటల్లో పరిష్కరించి నివేదిక సమర్పించాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి వడ్లూరు లక్ష్మణ్‌కుమార్ మెట్పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌తో ఫోన్లో మాట్లాడరు. ఈ సంఘటన విషయం తెలియగానే కలెక్టర్ ఆఫీస్‌కు రావడం జరిగిం దని తెలిపారు. వికలాంగుడి వివరాలు తెలుసుకొని మంత్రి కలెక్టర్ ఆఫీసు నుండి మెట్పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు ఫోన్ చేసి మల్లాపూర్ మండల్ ముత్యంపేటకు చెందిన దివ్యాంగుడైన రాజ గంగారం ఇంటికి వెళ్లి ఇల్లుకు సంబంధించిన రోడ్డు సమస్య ఉంటే పరిష్కరించాలని ఇంటికి వెళ్లాలంటే చట్టపకారం రోడ్డు అవసరమని ఈ నిబంధనలు ఉన్నాయని దానికి సంబంధించిన రోడ్డుకి ఏమైనాడబ్బులు ఖర్చు అవుతాయి అనుకుంటే ప్రభుత్వ పరంగా అందజేస్తామని ఎలాంటి సమస్య ఉన్న పరిష్కరించి 24 గంటలలో రిపోర్టు నాకు అందజే యాలని పేర్కొన్నారు. ఒకవేళ సమస్య పరిష్కారంగాని పక్షంలో నేను ఈ నెల 14న స్వయంగా ఆ గ్రామానికి వచ్చి పరిశీలిస్తానని ఫోన్లో మంత్రి ఆర్డిఓ శ్రీనివాస్‌కు తెలిపారు.

## బీహార్ డిప్యూటి సిఎంకు ఎలక్టోరల్ అధికారి నోటీసులు



**పాట్నా,ఆగస్టు 11:** బీహార్ ఓటర్ల జాబితా సవరణ ఇపుడు విపక్షాలకు ప్రధాన అస్త్రంగా లభించింది. బీహార్ లోని ప్రధాన ప్రతిపక్షం ఆర్జేడీ ఇపుడు ఆరాష్ట్ర డిప్యూటీసిఎంపై ఫోకస్‌పెంచింది. డిప్యూటీసిఎం సీనియర్ బిజెపి నాయకుడు విజయ్‌కుమార్ సిన్హా రెండువోట్ల ఓటరుగా నమోదు కావడం, రెండు వేర్వేరు ఐడిలు కలిగి ఉన్నారని ఆర్జేడీ చీఫ్ తేజస్వియాదవ్‌వేసిన ఫిర్యాదుతో ఎన్నికల సంఘం ఆయనకు నోటీసులు జారీచేసింది. పాట్నాలోని బంకిపూర్ నియోజ కవర్గంలో కూడా ఆయన పేరు నమోదయింది. బీహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌కుమార్ తన సోషల్ మీడియా పోస్టులో విజయ్‌కుమార్‌సిన్హా తన అసెంబ్లీ నియోజకవర్గం లఖిసరాయ్ ఓటర్లజాబితాలో ఉందని చెప్తూ అందుకు సంబంధించిన ముసాయిదా జాబితా స్క్రీన్‌షాట్‌ను పోస్టుచేశారు. అలాగే పాట్నాలోని బంకిపూర్ సెగ్మెంట్ లిస్టులోకూడా ఆయన పేరు ఉందని ఆధారాలు చూపించారు. ఒకే వ్యక్తి రెండు వేరువేరు అసెంబ్లీ సెగ్మెంట్లలో నమోదయి ఉన్న కారణంపై వివరణకోరుతూ బంకిపూర్ నియోజ కవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నోటీసు జారీ చేశారు. ఈనోటీసులకు ఈనెల 14వ తేదీ లోపు వివరణ ఇవ్వాలని ఆయనను ఆదేశించారు. ఆర్జేడీ చీఫ్ తేజస్వికూడా డిప్యూటీసిఎం రెండు ఓటర్ ఐడిలపై మాట్లాడుతూ ఇపుడు ఏంచర్యలు తీసుకుంటారంటూ ధ్వజమెత్తారు. అయితే డిప్యూటీ సిఎం మాత్రం తాను ఒక్కప్రాంతంలో మాత్రమే ఓటువేసానని స్పష్టం చేసారు. తొలుత తనతోపాటు తన కుటుంబసభ్యుల పేర్లు బంకిపూర్ నియోజ వర్గంజాబితాలో ఉన్నాయని అన్నారు. 2024 ఏప్రిల్‌లో లఖిసరాయ్ నియోజ కవర్గంలో తనపేరు జోడిం చాలని దరఖాస్తు చేశానన్నారు. తనతో పాటు తన కుటుంబసభ్యులపేర్లను బంకిపూర్ జాబితానుంచి తొలగించేందుకు అవసరమైన ఫారాలు నింపి ఇచ్చానన్నారు. కానీ తన పేరు బంకిపూర్ జాబితా నుంచి తొలగించలేదని, అది తన తప్పిదంకాదన్నారు.

## సెప్టెంబరు30న 'మహిళల వన్డే వరల్డ్ కప్ టోర్నీ

**హైదరాబాద్,ఆగస్టు11, ప్రభాతవార్త:** వచ్చే నెలలో మహిళల వన్డే వరల్డ్‌కప్ టోర్నీ ప్రారంభంకానుంది. సోమవారంముంబాయ్‌లో జరిగిన ట్రోఫీ ఆవిష్కరణలో భారత లెజెండ్ క్రికెటర్స్ యువరాజ్ సింగ్ మిథాలీ రాజ్‌తోపాటు ప్రస్తుత మహిళా క్రికెట్ స్టార్స్ హర్మన్ ప్రీత్ కౌర్ స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ ఐసీసీ సీఈవో సంజోగ్ గుప్తా వెల్లడించారు. ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్2025 కు భారత్ వేదికగా సెప్టెంబర్ 30న ప్రారంభం కానున్నట్లు వివరించారు.అయితే 2016 తర్వాత 19ఏళ్ల తరువాత భారత్ మహిళల ఐసీసీ క్రికెట్ టోర్నీకి ఆతిథ్యం అందించనుంది. అంతకు ముందు కూడా 1978, 1997, 2013లో కూడా ఏర్పాటు చేసింది.

## లోకసభలో క్రీడా, యాంటీడోపింగ్ బిల్లులు ఆమోదం

**హైదరాబాద్,ఆగస్టు11, ప్రభాతవార్త:** జాతీయ క్రీడా గవర్నెన్స్, జాతీయ యాంటి డోపింగ్ బిల్లులకు లోకసభ ఆమోదించింది. సోమవారం కేంద్ర క్రీడాశాఖమంత్రి మన్సూక్ మాండవీయ సభలో ప్రవేశపెట్టారు. అయి తే స్వాతంత్ర్యం తర్వాత క్రీడల్లో జరిగిన అతిపెద్ద సంస్కరణ జాతీయ క్రీడా పరిపాలన బిల్లుయే అని పేర్కొన్నారు. క్రీడాకారులు అభివృద్ధి చెందాలని వరల్డ్ లెవల్‌లో రాణించేందుకు ఇది దోహదపడేందుకు బిల్లును తీసుకువచ్చినట్లు వివరించారు. అదేవిధంగా క్రీడా వ్యవహారాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని మరింతగా పెంచడమే ఉద్దేశ్యమన్నారు. క్రీడా రంగంలో ఏకైక సంస్కరణల అడుగు అని స్పందించారు. ఈ రెండు క్రీడా బిల్లులతో జవాబుదారి, సరైన న్యాయం, సుపరి పాలనకు వీలేర్పడుతుంది. క్రీడా సమాఖ్యలు సముచితంగా వ్యవహరించేందుకు వీలేర్పడుతుందన్నారు. ఇక యాంటీ డోపింగ్ బిల్లు కూడా కొత్త చట్టమే అని పేర్కొన్నారు.

వరల్డ్‌లో జరుగుతున్న డోపింగ్ విధానాలను సమర్థిస్తుందని మాన్సూక్ వెల్లడించారు.


**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II**
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
**OA No. 353 OF 2025**

BETWEEN:
M/s. YES Bank Ltd. ....Applicant
Vs
Mr. MD Abdul Rasheed ....Defendant

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**
To
**Mr. MD Abdul Rasheed, S/o Mr. Mohd Abdul Ghafoor,** H.No.18-9-424, Chandrayanagutta, Bandlaguda, Hyderabad-500005. **Also At: Mr. MD Abdul Rasheed, S/o Mr. Mohd Abdul Ghafoor,** H.No.5-9-62, Khanlateef Khan Estate, Opp. Fateh Maidan, Opp. LB Stadium, Hyderabad-500024.
....Defendant

Please take the summons in the above O.A.No. 353 OF 2025 filed by the Applicant for Recovery of **Rs.25,53,146.35/- (Rupees Twenty Five Lakhs Fifty Three Thousand One Hundred Forty Six And Thirty Five Paise Only)** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"VAARTHA"** Telugu Newspaper and posted the matter on **16/09/2025.**
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under; (i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original Application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on **16/09/2025 at 10.30 A.M at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001,** in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this **08th day of August, 2025.**
(By order of the Tribunal)
Sd/- Registrar
Debts Recovery Tribunal-II, Hyderabad



తెలంగాణ ప్రభుత్వం
**పురపాలక సంఘ కార్యాలయము తాండూరు: వికారాబాద్ జిల్లా**
NIT No. E1/Tenders/31/2025 ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు నోటీసు తేది: 11.08.2025
పనిపేరు: అభివృద్ధి పనులు (6) నెం.లు. అంచనా మొత్తం రూ. 26.40 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది & సమయం: 11.08.2025, సాయంత్రం: 04.00 గంటలకు. బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం: 18.08.2025 సాయంత్రం 4.00 గంటలకు. తదుపరి వివరాల కోసం అధికారి పేరు చిరునామా, తాండూరు పురపాలక సంఘం, శ్రీ.విక్రంసింహా రెడ్డి, కమిషనర్, మొబైల్ నెం. 9849905909, శ్రీ మణిపాల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మొబైల్ నెం. 9701362735 మరియు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/-. కమిషనర్, పురపాలక సంఘం తాండూరు.
DIPR.NO. 6300-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 11.08.2025



**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
NIT No. 18/MAU61-USI0HB(OTH)/321/2025-CETT Dt : 11.08.2025
**E PROCUREMENT TENDER NOTICE**
**NAME OF WORK:** "Providing of Housekeeping, Sanitation, Pest Control Services, Technical Services and for supply of house keeping material for sanitation etc., for the building of AP High Court i.e., High Court Main Building, Annexe building, Six Temporary Court Halls Building, High Court Digitization Center building & External area at Nelapadu for a period of One year" – **Estimate Cost Rs.360.00 Lakhs.** The bid can be downloaded on AP e-procurement portal from **14.08.2025 to 29.08.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **29.08.2025 up to 15.00 Hrs,** Technical bid opening **29.08.2025 @ 16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**
**E PROCUREMENT SHORT TENDER NOTICE**
NIT No.71/MAU61-ADMN0IS(APSW)/17/2025-IS Dt. 08.08.2025
**NAME OF WORK:** APCRDA-"RFP for Selection of Solution Provider to Configure, Customize, Integrate, Implement and Maintain ICT Platform for Construction Management for APCRDA and ADCL for the period of 2 years". The bid can be downloaded on AP e-procurement portal from **12.08.2025 to 20.08.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **20.08.2025 up to 15.00 Hrs,** Technical bid opening **20.08.2025 @ 16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**
Sd/- Commissioner, APCRDA, Vijayawada



pnb Housing Finance Limited Ghar Ki Baat
అనుబంధం-IV-A - స్థిరాస్తి/ల యొక్క ఇ-వేలం బహిరంగ విక్రయ ప్రకటన
[illegible] www.pnbhousing.com
B.O. ఉప్పల్ : 3వ అంతస్తు, ప్లాట్ నం.6 & 7, ఇన్నర్ రింగ్ రోడ్, కెనరా బ్యాంక్ దగ్గర, సమతాపురి, నాగోల్, హైదరాబాద్, తెలంగాణ-500068.
B.O. బంజారాహిల్స్ : 4వ అంతస్తు, [illegible] షోరూమ్ పైన, రోడ్ నం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
[illegible] M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ [illegible] www.pnbhousing.com [illegible]

| (A) | (B) | (C) | తనఖాపెట్టబడిన ఆస్తుల వివరణ (D) | (E) | (F) | (G) | (H) | (I) | (J) | (K) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| HOU/UPL/0721/898289 [illegible] B.O: ఉప్పల్ | రూ. 5314376.1 & 10-10-24 | భౌతికంగా స్వాధీనం | ఫ్లాట్ నం.201, 2వ అంతస్తు, ప్లాట్ నం.194 & 195 [illegible] సర్వే నం.60, వార్డ్ నం.8, బ్లాక్ నం.3, [illegible] రోడ్ నం.14, [illegible] హైదరాబాద్, తెలంగాణ-500079, [illegible] ఇండియా. | రూ. 4,714,000.00 | రూ. 471400 | 29-08-2025 | రూ. 10,000 | 18.08.2025 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 30.08.2025 మ.02.00 గం. నుండి మ.3.00 గం. | తెలియదు |
| HOU/HYD/0523/1111400 [illegible] B.O: బంజారాహిల్స్ | రూ. 1706589.12 & 07-03-25 | భౌతికంగా స్వాధీనం | ఫ్లాట్ నం.204, 2వ అంతస్తు, టవర్ నం.Do.5, [illegible] సర్వే నం.42, [illegible] గ్రామం, ఉప్పల్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా, 500068. | రూ. 1,544,000 | రూ. 154400 | 29-08-2025 | రూ. 10,000 | 18.08.2025 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 30.08.2025 మ.02.00 గం. నుండి మ.3.00 గం. | తెలియదు |

[illegible] www.bankeauction.com [illegible] 9948562888/7428193765, టోల్ ఫ్రీ నెం.1800 120 8800, ఇ-మెయిల్: auction@pnbhousing.com లేదా www.pnbhousing.com [illegible]
ప్రదేశము: ఉప్పల్, తేది: 12.08.2025 సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఘర్షణల వల్ల శక్తి వృథా అవుతుంది. హెచ్చుతగ్గులు వస్తాయి. ఆందోళనలు చెలరేగుతాయి. అశాంతి కలుగుతుంది.

- ఐ.జాన్సన్

# 'సర్' కొత్త సవాళ్లు!

దేశంలో 'ఓట్ల చోరీ' జరుగుతోందన్న సరికొత్త ఆరోపణలతో 'కాంగ్రెస్' పార్టీ ఎన్నికల సంఘంతో ఓ చిన్న సైజు యుద్ధమే ప్రకటించింది. బీహార్ ప్రత్యేక ఓటర్ల రివిజన్ కార్యక్రమం మొదలెట్టక ముందు, తర్వాత జరుగుతున్న తతంగాన్ని విపక్షాలు ఏ విధంగానూ అంగీకరించలేకపోతున్నాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'ఓట్ల దొంగతనం' విషయమై తీవ్ర ఆరోపణలకు కొనసాగింపుగా ఇప్పుడు 'ఓటు చోరీ' వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఓటర్ల డిజిటల్ జాబితాలు బయటపెట్టాలని డిమాండ్ చేసిన నేపథ్యంలోనే ఈ వెబ్‌సైట్ రూపకల్పన జరిగింది. 'ఓటు చోరీ' వ్యవహారాన్ని బట్టబయలు చేయడం చాలా కీలకమంటూ రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా వీడియోను సమస్త ప్రజానీకానికి అందేలా విడుదల చేశారు. గత పదేళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వాటికి సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను అందించాలని కోరుతూ ఆగస్టు 8న బెంగుళూరు ఫ్రీడమ్ హాల్‌లో జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం బిజెపి కలిసి ఓటు అక్రమాలకు పాల్పడ్డాయని ఢంకా భజాయించి చెప్పారు. అంతకు ముందే కర్ణాటక రాష్ట్రంలోని మహదేవపురం అసెంబ్లీ సెగ్మెంట్ లెక్కలనా సరాగా చేసుకొని రాహుల్ ఢిల్లీలో పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. తాజాగా కర్ణాటక ఎన్నికల కమిషన్ రాహుల్ గాంధీ ఆరోపణలకు సంబంధించి ఆధారాలను కోరారు. ఈ అంశంపై కాంగ్రెస్ ఢిల్లీలో పార్లమెంటు నుంచి ఇసి కార్యాలయానికి ర్యాలీ ప్రారంభించింది. రాజధాని నగరం విపక్షాల నినాదాలు, వాగ్వాదాలతో దద్దరిల్లింది. ఇండియా కూటమిలోని 25 పార్టీల ఎంపిలూ ఇందులో పాల్గొన్నారు. బిజెపి ఎలక్టోరల్ మోసాలకు పాల్పడి గెలుస్తోందన్న విషయంలో నిజనిర్ధారణ చేసే దిశగా కాంగ్రెస్ ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో డిజిటల్ ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘానికి ఎక్కడికక్కడ విజ్ఞప్తుల ద్వారా జాబితాలను పరిశీలించే కార్యక్రమాన్ని రూపొందించింది. అన్ని రాష్ట్రాలు ఇదే కార్యాచరణలోకి మళ్లాయి. ఎన్నికల సంఘంతో భేటీకి అనుమతి ఉంది. కానీ ఎంపీలు ర్యాలీగా వెళ్లేందుకు పోలీసుల సమ్మతి లేదు. దాంతో రాహుల్ గాంధీతోసహా మల్లిఖార్జున ఖార్గే, ప్రియాంక గాంధీ ప్రధాన ప్రతిపక్ష ఎంపీలు, విపక్ష భాగస్వామ్య పార్టీల ఎంపీలను అదుపులోకి తీసుకున్నారు. 'ఓటు చోరీ' అంశానికి కాంగ్రెస్ అనుకున్నంత ప్రచారానికి ఎన్నికల సంఘమే అవకాశమిస్తోంది. ఎన్నికలు దేశం గుండె చప్పుడని, అలాంటి పరిస్థితుల్లో ఒక్క ఓటు దొంగిలించబడినా అది ప్రజాస్వామ్యం గొంతు నొక్కడమేనని రాహుల్ స్పష్టంగానే విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యానికి నష్టంవాటిల్లుతోంటే కూటమి ఎంపీలు ఊరుకోబోమని చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందంటూ ప్రజల్ని చైతన్యపరిచే బాధ్యతను రాహుల్ గాంధీ తీసుకున్నారు. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు తొక్కిపడుతున్నారు? నకిలీ ఓట్ల నమోదు సాకుతో అసలు సిసలైన ఓటర్ల ఓట్లను ఎందుకు తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇవీ రాహుల్ ప్రశ్నలు. దశాబ్దం కిందట బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగినప్పుడు మంది బలంతో రిగ్గింగ్, పోలింగ్ బూత్‌లు ఆక్రమించడం వంటి ఆరోపణలు ఉండేవి. వాటిలో ఏ మాత్రం లోపం జరిగిందని భావించినా ఎన్నికల అధికా రులు రీపోలింగ్‌కు ఆదేశించి, ఎన్నికలు సజావుగా జరిపించామని అనిపిస్తుంటారు. ఎప్పుడైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టం వచ్చిందో అప్పటి నుంచి ఎన్నికలపై ఎన్నో సందేహాలు ఉన్నాయి. వాటిని సందేహించడంలో ఎవరూ తక్కువ వారు కాదు. వారెవరికీ మినహాయింపులు లేవు. గెలిచిన వారు ప్రజాస్వామ్యం గెలిచిందని సంబరపడితే, ఓడిన వారు ఇవి ఎంలలో లోపమని ఆరోపణలు చేయడం సర్వసాధారణమే. ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక సందర్భంలో అన్ని పార్టీల వారూ ఇలాంటి మీమాంసలకు అర్థం తెలుసుకోవాలనుకుంటుంటారు. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమం (ఎస్ఐ ఆర్) ప్రక్రియపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని ఎన్నికల కమిషన్‌ను సున్నితంగా మందలించింది. దాదాపు 65 లక్షల ఓటర్లు అక్కడ లేరని వారి కార్డులు తీసేయడాన్ని ఇప్పటికీ విపక్షాలు దుయ్యబడుతున్నాయి. బెంగళూరులో నోరెత్తగానే ఎన్నికల సంఘం రాహుల్ గాంధీ ఆరోపణల్లో నిజాయితీ ఉంటే తాను చేసే వాదనలను ధృవీకరించే అధికార ప్రకటనపై రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ రూల్స్ 20(బి)ప్రకారం ప్రమాణ పత్రాలపై సంతకం చేయాలని రాహుల్‌కు సవాల్ విసరారు. ఇలాంటి ఆరోపణలపై ఈసి ఈ విధంగా స్పందించడం ఇదే మొదటిసారి కాకపోవచ్చు. కాని మహదేవ్‌పూర్‌లో నకిలీ ఓట్లు, నకిలీ చిరునామాలు, ఒకే చిరునామపై వందలకొద్దీ ఓటర్ల నమోదు వంటి అంశాలపై రాహుల్ గాంధీ పూర్తి ఆధారాలతో ఎన్నికల సంఘానికి వివరాలిచ్చినా సింపుల్‌గా కాదంటూ చాలా పెద్ద మొత్తంలో దొంగ ఓటర్లను తేల్చి చెప్పారు. వీటన్నిటినీ తగు ఆధారాలతో చూపెట్టినా ఎన్నికల సంఘం పెద్దగా పట్టించు కోవడం లేదు. ఇంతేగాక ఇసి విచిత్రమైన వాదనలు చేస్తోంది. గల్లంతైన ఓటర్ల జాబితా ప్రచురించాలనే నిబంధన ఏదీ లేదని ఎన్నికల సంఘం వాదిస్తోంది. తమ ఓట్ల తొలగింపు జరిగినా ఓటరుకు ఎలాంటి హక్కు లు ఉండవన్న రీతిలో ఎన్నికల సంఘం అడ్డగోలుగా వాదిస్తోంది. ఏది సహేతుకమో, ఏది అహేతుకమో తేల్చా ల్సింది సుప్రీంకోర్టులోనే. ఆందోళనలు ఓ హెచ్చరిక మాత్రమే.

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయ విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.



స్వామి వివేకానంద

చదువులో ఆనందాన్ని పొందితే, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటావు.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



### నియమావళి అతిక్రమిస్తే శిక్షే

భారత ప్రధానమంత్రి మన జాతీయ జెండాకు ప్రాధాన్యత కల్పించటానికి 'హర్‌ఘర్ తిరంగా' నినాదంతో పౌరులను చైతన్య పరచటానికి 2022వ సంవత్సరంలో జాతీయ పతాక నియమావళి నిబంధనలను సరళీకృతం చేసి పౌరులందరూ ఎల్లవేళలా తమ తమ ఇళ్లపై జెండా ఎగరేసుకోవటానికి అవకాశం కల్పించారు. అనేకమంది పతాక నియమావళిని అతిక్రమిస్తున్నారు. నేడు చాలా మందిఇళ్లపై పీలికలు అయిపోయిన,వెలిసిపోయిన, మాసిపోయిన, మట్టికొట్టుకుపోయిన జెండాలు దర్శనం ఇస్తున్నాయి.పౌరులు జాతీయ పతాకానికి ఇవ్వవలసిన గౌరవంఇవ్వక బాధ్యతమరచి ప్రవర్తిస్తున్నారు.జాతీయ పతాక నియమావళి అతిక్రమిస్తే అపరాధ రుసుముతోపాటు మూడేళ్ల కారగార శిక్ష విధించే అవకాశం ఉంది.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### తారు రోడ్లు వేయాలి

భారత ప్రభుత్వం ప్రతి వీధికి, ప్రతి నగరానికి ముఖ్యంగా ప్రతి మారుమూల గ్రామానికి తారు రోడ్లు వేయాలి. ప్రస్తుతం మారుమూల గ్రామాలకు రోడ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేక డోలిలో ఎంతో చెమటోడ్చి పట్టణాలకు వెళ్లే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ నగర వీధుల్లో , గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేస్తున్నారు. కానీ సిమెంటు రోడ్లను మంచినీరు కనెక్షన్‌కోసం పైప్‌లైన్ కోసం సిమెంట్ రోడ్లు తొవ్వుతున్నారు. పైగా సిమెంట్ రోడ్ వేయడానికి ఖర్చు అవుతుంది. కొత్తగా తారు రోడ్ వేయాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### ముందస్తు హెచ్చరిక వ్యవస్థ లేకపోవడం..

ప్రతి సంవత్సరం వర్షాకాలంలో భారత్‌లోపలు రాష్ట్రాలు భారీ వరదలకు గురవుతున్నాయి. ఇటీవలి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోసంభవించిన ఘోరమైన వరదలు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు తీవ్ర నష్టం కలిగించాయి. వరదల తీవ్రత, తరచుగా సంభవించే విపత్తులు పెరుగుతున్న నేపథ్యంలో, దేశానికి సమగ్రం, కఠినం,శాస్త్రీయ వరద నిర్వహణ వ్యవస్థ అత్యవసరమైంది. ఇప్పుడు పట్టణప్రాంతాలలో అనియంత్రిత నిర్మాణాలు,నదుల సహజప్రవాహానికి అవరోధాలు, వంటి కారణాలతో వరదలు మరింత విధ్వంసకరంగా మారుతున్నాయి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### రాహుల్ గాంధీ ఆరోపణలు ఆలోచించాల్సిందే?

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం నాటి మీడియా సమావేశంలో, దేశంలో భారీగా ఓటింగ్ మోసం జరుగుతోందని, ఎన్నికలను తప్పుదారి పట్టించడానికి ఎన్నికల సంఘం (ఈసీ)బీజేపీతో చేతులు కలిపిందని సంచలన ఆరోపణలు చేశారు. 'డెమొక్రసీ డిస్ట్రాయ్డ్' అనే శీర్షికతో రాహుల్ గాంధీ ఇచ్చిన ప్రెజెంటేషన్‌లో బూత్ స్థాయిలో ఎన్నికల ఫ్రాడ్ ఎలా జరిగిందో వివరించారు. రాహుల్ వెల్లడించిన వివరాలను పరిశీలిస్తే కర్ణాటకరాష్ట్రం బెంగుళూరులోని 'మహదేవ్ పుర' నియోజకవర్గంలో జరిగిన వ్యవహారాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఓటర్ల జాబితాలో 40,900 బూటకపు చిరునామాలు ఉన్నాయని రాహుల్ రుజువులతో సహా నిరూపించారు. నెలలు తరబడి డేటా అనలైజ్ చేసిన తర్వాతే తాము ఈ ఆధారాలు చూపిస్తున్నామన్నారు.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### అసెస్మెంట్ బుక్స్ వల్ల ఇబ్బందులున్నాయి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తమ పరీక్షలను అసెస్మెంట్‌బుక్స్‌లో నిర్వహించాలని నిర్ణయించి పుస్తకాలను సిద్ధం చేసి పాఠశాలలకు చేర్చింది. సంవత్సరం పాటు జరిగే పరీక్షలు అన్నీ ఆ పుస్తకాల్లోనే రాయవలసి ఉంటుంది. అయితే అస్సెస్మెంట్ బుక్స్‌లోరాస్తే అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. 2025-2026 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఈ నెల 11వ తేదీ నుండి నిర్వహించే ఫార్మేటివ్ అసెస్మెంట్ 1, తదుపరి పరీక్షలకు సంబంధించి నూతనంగా విద్యాశాఖ ప్రవేశపెట్టిన అస్సెస్మెంట్ బుక్స్‌లోరాయాల్సి ఉంటుంది. ఒకే బుక్‌లో ఎఫ్.ఏ 1, ఎఫ్.ఏ 2 పరీక్షల ప్రశ్నలకు సంబంధించిన జవాబులుంటాయి. ఇవే ప్రశ్నలు తిరిగి ఎస్.ఏ 1 కి వస్తాయి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ప్రపంచీకరణలో పలుచబడుతున్న ట్రంప్

అమెరికా అధ్యక్షుడు ఒక చపల చిత్తుడు క్షణానికి ఒక మాట మాట్లాడతాడు. విచిత్ర ప్రవర్తన,ఎప్పుడు ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదు.ఆయన ఆకారం, చేష్టలు చూస్తుంటే వానరమే నయమనిపిస్తుంటుంది. పటిష్టమైన భారత ఆర్థిక వ్యవస్థను చూసి,అరగంటలోపే ఆపరేషన్‌సిందూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రమూకలను మట్టి కరిపించిన భారత రక్షణశక్తినిచూసి, సర్పం' లా తయారౌతాడు ట్రంపు.

-డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జీవ ఇంధన విప్లవంతో దేశానికి కొత్త దిశ!

*జీవ ఇంధనాల రంగంలో భారత దేశం సాధించిన పురోగతి ఆశాజనకంగా ఉంది. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చడంలో జీవ ఇంధనాలు ఒక ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వ దృఢమైన విధానాలు, ఇథనాల్ మిశ్రమాన్ని పెంచాలనే లక్ష్యం, వ్యవసాయ వ్యర్థాల వినియోగంపై దృష్టి పెట్టడంవంటి చర్యలు భారతదేశాన్ని ఒక జీవఇంధన కేంద్రంగా మారుస్తున్నాయి. సవాళ్లను అధిగమించడానికి నిరంతర సాంకేతిక ఆవిష్కరణలు, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాలు, దీర్ఘకాలిక వ్యూహాలు అవసరం.జీవ ఇంధనా లను కేవలం ఒక ప్రత్యామ్నాయ ఇంధన వనరుగాకాకుండా భారతదేశ స్థిరమైన, పర్యావరణ అనుకూల భవిష్యత్తుకు పునాదిగా భావించవచ్చు. ఈ విధానాల కొనసాగింపుతో భారతదేశం తన జీవ ఇంధన విప్లవం ద్వారా ప్రపంచానికి ఒక మార్గదర్శిగా నిలబడుతుందనడంలో సందేహం లేదు.*

డి. జె. మోహన రావు

ప్రపంచం ప్రస్తుతం రెండు ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటోంది. అవి వాతావరణ మార్పు, ఇంధన భద్రత. శిలాజ ఇంధనాల వినియోగం వల్ల పెరిగే కర్బన ఉద్గారాలు పర్యావరణానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుండగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల అస్థిరత ఆర్థిక వ్యవస్థలకు సవాలుగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో, భారతదేశం జీవ ఇంధనాల వినియోగాన్ని ఒక వ్యూహాత్మక పరిష్కారంగా చూస్తోంది. జీవ ఇంధనాల ద్వారా స్వయం సమృద్ధిని సాధించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వంటి బహుళ లక్ష్యాలను సాధించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశం తన ఇంధన అవసరాల కోసం దాదాపు 85 ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారాన్ని మోపడంతో పాటు, అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల హెచ్చుతగ్గులకు భారత దేశాన్ని ప్రభావితం చేస్తుంది. జీవ ఇంధనాల వినియోగాన్ని పెంచడం ద్వారా శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం సాధ్యమవుతుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇవ్వడమే కాకుండా ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించడానికి దోహదపడుతుంది. ఇది భారతదేశ జాతీయ భద్రతకు కూడా చాలా కీలకం. ఎందుకంటేఇంధన సరఫరాలో విఘాతం కలిగినప్పుడు తలెత్తే సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతుంది. భారత ప్రభుత్వం జీవ ఇంధన రంగ అభివృద్ధికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. 2018లో విడుదల చేసిన జాతీయ జీవ ఇంధన విధానం ఈ రంగంలో ఒక ముఖ్యమైన మలుపు. ఈ విధానం ప్రధాన లక్ష్యాలను చూస్తే పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం చేసే కార్యక్రమాన్ని 2025 నాటికి 20కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో 2030గా ఉన్న ఈ లక్ష్యాన్ని జీవ ఇంధనాల ప్రాముఖ్యతను గుర్తించి,ప్రభుత్వం ముందుకు జరిపింది. 2014 నాటికి కేవలం 1.5 ఉన్న ఇథనాల్ మిశ్రమం ప్రస్తుతం 12కు పైగా చేరుకుంది. జీవ ఇంధనాల ఉత్పత్తికి ఆహారేతర పంటలు, పాడైపోయిన ఆహార ధాన్యాలు, మిగులు ధాన్యం, చెరకు పిప్పి, ఉపయోగించిన వంట నూనె వంటి వాటిని ఉపయోగించడానికి ఈ విధానం అనుమతినిచ్చింది. ఈ విధానం ఆహార భద్రతకు భంగం కలగకుండా చూస్తుంది. వ్యవసాయ వ్యర్థాలైన వరి గడ్డి, గోధుమ గడ్డి, చెరకు పిప్పి వంటి వాటి నుండి రెండో తరం ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి భారీ పెట్టుబడులు, ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోంది. ఇది రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటువ్యవసాయ వ్యర్థాల కాల్చివేత వల్ల కలిగే వాయు కాలుష్యాన్ని కూడా నివారిస్తుంది. ఉపయోగించిన వంట నూనె నుండి బయోడీజిల్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఎస్ఎటిఎటి (సరసమైన రవాణా వైపు స్థిరమైన ప్రత్యామ్నాయం) పథకాన్ని ప్రవేశ



పెట్టింది. దీని ద్వారా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు బయో డీజిల్‌ను సేకరించి రవాణా రంగంలో వినియోగిస్తున్నాయి. భారతదేశం జీవ ఇంధన రంగంలో గణనీయమైన ప్రగతిని సాధించింది. ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగింది. ఈ పురోగతి అనేక సానుకూల ఫలితాలను ఇస్తోంది. పర్యావరణ ప్రయోజనాలను చూస్తే పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం చేయడం ద్వారా కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోకార్బన్ వంటి కాలుష్య కారకాల ఉద్గారాలు తగ్గుతాయి. ఇది వాయు కాలుష్యాన్ని తగ్గించి ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇంకా రైతులకు కొత్త మార్కెట్లు సృష్టించాయి. ఎలా అంటే ఇథనాల్ ఉత్పత్తి కోసం మిగులు చెరకు, మొక్కజొన్న, పాడైపోయిన ధాన్యాలను ఉపయోగించడం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఇది వ్యవసాయ రంగానికి కొత్త ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. అంతేకాక విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇథనాల్ మిశ్రమం ద్వారా సుమారు రూ. 22,600 కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అయింది. ఇథనాల్ మిశ్రమం పెరిగే కొద్దీ ఈ ఆదా మరింత పెరుగుతుంది. వ్యర్థాల నుంచి సంపద సృష్టి కూడా సాధ్యం అవుతుంది. వ్యవసాయ వ్యర్థాలు, పురపాలక వ్యర్థాలు, పశువుల పేడ నుండి జీవ ఇంధనాలను ఉత్పత్తి చేయడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సమస్యకు ఒక సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుంది. జీవ ఇంధన రంగంలో గణనీయమైన పురోగతి ఉన్నప్పటికీ కొన్ని సవాళ్లు ఉన్నాయి. వాటిని అధిగమించడం భవిష్యత్తు వృద్ధికి కీలకం. ఇథనాల్ ఉత్పత్తికి అవసరమైన ముడిపదార్థాల సరఫరాను స్థిరంగా కొనసాగించడం ఒక సవాలు. ఆహార పంటలకు, ఇంధన పంటలకు మధ్య సమతుల్యతను పాటించడం అవసరం. దీనికి పరిష్కారంగా రెండవ, మూడవ తరం జీవ ఇంధనాల ఉత్పత్తిని పెంచడంపై దృష్టి పెట్టాలి. ఈ జీవ ఇంధనాల ఉత్పత్తికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన అభివృద్ధికి భారీ పెట్టుబడులు అవసరం. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు రంగం నుంచి కూడా పెట్టుబడులను ఆకర్షించాల్సిన అవసరం ఉంది. జీవ ఇంధన పంటలైన చెరకు, మొక్కజొన్న సాగుకు అధిక నీటి వనరులు అవసరం. దేశంలో ఇప్పటికే ఉన్న నీటికొరత సమస్యను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలపై దృష్టి సారించాలి. జీవ ఇంధనాల రంగంలో భారత దేశం సాధించిన పురోగతి ఆశాజనకంగా ఉంది. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చడంలో జీవ ఇంధనాలు ఒక ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వ దృఢమైన విధానాలు, ఇథనాల్ మిశ్రమాన్ని పెంచాలనే లక్ష్యం, వ్యవసాయ వ్యర్థాల వినియోగంపై దృష్టి పెట్టడంవంటి చర్యలు భారతదేశాన్ని ఒక జీవఇంధన కేంద్రంగా మారుస్తున్నాయి. సవాళ్లను అధిగమించడానికి నిరంతర సాంకేతిక ఆవిష్కరణలు, ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యాలు, దీర్ఘకాలిక వ్యూహాలు అవసరం.జీవ ఇంధనాలను కేవలం ఒక ప్రత్యామ్నాయ ఇంధన వనరుగాకాకుండా భారతదేశ స్థిరమైన, పర్యావరణ అనుకూల భవిష్యత్తుకు పునాదిగా భావించవచ్చు.ఈ విధానాల కొనసాగింపుతో భారతదేశం తన జీవ ఇంధన విప్లవం ద్వారా ప్రపంచానికి ఒక మార్గదర్శిగా నిలబడుతుందనడంలో సందేహం లేదు. ●

# పార్టీ ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి తలవంపులు

జి. అజయ్ కుమార్

పదవులు కోసం సిద్ధాంతాలను తాకట్టు పెట్టి ప్రజల విశ్వాసాన్ని వంచించే రాజకీయ సంస్కృతి, ప్రజాస్వామ్యంలో కేవలం ఎన్నికల్లో గెలుపు మాత్రమే కాదు గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కూడా చాలా ముఖ్యం. ప్రజాస్వామ్యం అనేది ప్రజల నమ్మకం మీద నిలిచే వ్యవస్థ. ఒక అభ్యర్థి ఏ పార్టీకి చెందినవాడో చూసి, అతని సిద్ధాంతాలను విశ్వసించి ఓటు వేస్తారు. కానీ ఎన్నికల తర్వాత ఆ ఎమ్మెల్యే లేదా ఎంపీ ఒక్కసారిగా మరో పార్టీకి మారిపోతే ఆ ఓటరు విశ్వాసం సన్నగిల్లుతుంది. ఇటీవల తెలంగాణలో ఈ ఫిరాయింపుల పర్వం పతకాస్థాయికి చేరింది. పార్టీ పిరాయింపులు కొత్తవి ఏమి కావు, త్రేతాయుగంలో విభీషణుడు రావణుని విడిచి శ్రీరాముని వద్దకు చేరాడు. ద్వాపరయుగంలో కర్ణుడిని శ్రీకృష్ణుడు పక్షం మార్చమని కోరినా, కర్ణుడు స్నేహబంధం కోసం తిరస్కరించాడు. అలా పురాతన కాలం నుంచే ఈ ఫిరాయింపుల పర్వం కొనసాగుతుంది. ఆధునిక కాలంలో 1967లో హర్యానాలో గయాలాల్ అనే రాజకీయ నాయకుడు ఒకే ఏడాదిలో మూడు సార్లు పార్టీ మార్చడంతో "ఆయా రామ్, గయా రామ్" అనే పదం పుట్టింది. ఇలాంటివి అడ్డుకోవడానికి 1985లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం తీసుకువచ్చింది. ఒక ఎమ్మెల్యే లేదా ఎంపీ తన పార్టీని విడిచిపెట్టి మరో పార్టీలో చేరితే అనర్హత వేటు తప్పదు. కానీ 2/3 వంతు గుంపుగా మారితే చట్టరీత్యా సరైనదే అనే విషయాన్ని ఈ చట్టం చెబుతుంది.ఇదే కొన్ని రాజకీయ పార్టీలకు బ్రహ్మాస్త్రంగా మారింది. ఈ నిబంధన వలన గుంపుగా ఫిరాయింపులు పెరిగిపోయాయి. ప్రభుత్వాలు అస్థిత్వాన్ని కోల్పోయే పరిస్థితులు కూడా కొన్ని సార్లు ఏర్పడ్డాయి. అసోసియేషన్



ఆఫ్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ నివేదిక ప్రకారం 2016 నుంచి 2021 సంవత్సరాల మధ్య కాలంలోసుమారు 443 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు. వీరిలో అధిక శాతం అధికార పార్టీలలో చేరారు. కర్ణాటక, మధ్యప్రదేశ్,మహారాష్ట్ర, గోవా, మణిపూర్‌లలో ప్రభుత్వాలు కూలిపోయాయి. ఈగణాంకాలు ప్రజాస్వామ్యాన్ని, ఓటరును అపహాస్యం చేసేలా ఉన్నాయి. ఇది ప్రజాస్వామ్య ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా వుంది. ఇటీవల బిఆర్ఎస్ పార్టీ నేతలు పార్టీ మారారు. ఈ సందర్భంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఫిరాయింపులను నిలువరించలేకపోతే ప్రజాస్వామ్యానికి నష్టం కలుగుతుందని వ్యాఖ్యానించారు. అలాగే స్పీకర్‌ను 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల విశ్వాసం దెబ్బతింటుంది. ఎన్నికల్లో ఇచ్చిన తీర్పు వక్రీకరించబడుతుంది. ప్రజాస్వామ్యం వ్యక్తిగత ప్రయోజనాలకు బానిసఅవుతుంది. అభివృద్ధి మరుగున పడుతుంది. చట్టాన్ని కఠినతరం చేయాలి. పార్టీ మారిన వారిని వెంటనే అనర్హులను చేయాలి. అలాగే తప్పనిసరిగా ఉపఎన్నికలు నిర్వహించి ఫిరాయించిన నేత మళ్లీ ప్రజల తీర్పు పొందేలాచేయాలి. ఓటర్లు ఇలాంటి నేతలకు బలమైన గుణపాఠం చెప్పాలి.వ్యక్తుల కన్నా సిద్ధాంతాలకు విలువ ఇవ్వాలి. అలా అయితే ప్రజాస్వామ్యం బలపడుతుంది మంచి పరిపాలన అందించబడుతుంది. ప్రజాస్వామ్యానికి నిజమైన బలం ఓటు పవిత్రలో ఉంది. ఫిరాయింపులు ఈపవిత్రతను కలుషితం చేస్తున్నాయి. ఓటరును అపహాస్యం చేస్తున్నాయి. అలాంటి వాటిని చట్టపరమైన చర్యలతో పాటు విచక్షణతో కూడిన ఓటరు తీర్పు మాత్రమే ఆపగలదు. స్వార్థంకోసం పార్టీలు మారే రాజకీయ నాయకులను భవిష్యత్‌లో ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటిస్తేనే ఇలాంటి వాటికి శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. నమ్మకంతో ఓటు వేసిన ప్రజలను వంచించడం ప్రజాస్వామ్యానికే పెనుప్రమాదం. ●

# బ్లూ ఎకానమీతో దేశ సుస్థిరాభివృద్ధి!


డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

రెండువేల ముప్పై నాటికి భారత భవ్య వెలుగులకు ముఖ్యమైన 6వ అంశంగా బ్లూ ఎకానమీ (నీలి ఆర్థిక వ్యవస్థ) దోహదపడాలని భారత ప్రభుత్వ సైన్స్, టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వశాఖ లక్ష్యంగా నిర్ణయించుకోవడం ముదావహం. 2010లో గుంటర్ పౌలీ రచించిన ది బ్లూ ఎకానమీ 10 ఇయర్స్, 100 ఇన్నొవేషన్స్, 100 మిలియన్ జాబ్స్ అనే పుస్తకం ద్వారా బ్లూ ఎకానమీ గూర్చి ప్రస్తావన చేశారు. ప్రపంచవ్యాప్తంగా సముద్ర జలాలు సాలీనా 5 ట్రిలియన్ల అమెరికన్ డాలర్ల వ్యాపారం చేయడం జరుగుతున్నదని, 2032 నాటికి 10 ట్రిలియన్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. విశ్వవ్యాప్తంగా 350 మిలియన్ల ప్రజలు మత్స్య పరిశ్రమతో జీవనోపాధి పొందుతున్నారు. 2025 నాటికి 34 శాతం ముడి చమురు తీర ప్రాంతాల ద్వారా లభిస్తుంతుందని అంచనా. ఆక్వాకల్చర్ పరిశ్రమ ద్వారా 50శాతం సముద్ర ఆహారం దొరుకుతున్నదని విశ్లేషిస్తున్నారు. మత్స్య పరిశ్రమ ఉత్పత్తులు పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలను 'నీలి విప్లవం లేదా బ్లూ రెవల్యూషన్'గా పిలుస్తారు. దేశ ఆర్థికాభివృద్ధి పెరుగుదల, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఉద్యోగ ఉపాధుల కల్పన, ఆరోగ్యకర సముద్ర జీవ వ్యవస్థలు వంటి లక్ష్యాలను అధిగమించడానికి సముద్ర వనరులను సుస్థిరాభివృద్ధికి వినియోగించడాన్నినీలి ఆర్థిక వ్యవస్థ లేదా బ్లూ ఎకానమీ అని నిర్వచిస్తారు. సముద్రాల ఆరోగ్యాన్ని రక్షించుకుంటూనే మహా సాగరాల వనరులను మానవాళి సుస్థిరాభివృద్ధికి, ఉత్పత్తులను పెంచకపోవడానికి బ్లూ ఎకానమీ దోహదపడుతుంది. సమాజాభివృద్ధికి సుస్థిర సముద్ర శక్తిని వినియోగించడం, మత్స్యపరిశ్రమ ఉత్పత్తులను పెంచుకోవడం, సముద్ర ఉపరితల రవాణాను సమర్థవంతంగా వాడుకోవడం, సముద్ర తీరాలను పర్యాటక పరిశ్రమలుగా వాడుకోవడం, కార్బన్ ఉద్గారాలను సముద్ర జలాలు శోషణం చేసుకోవడం, వ్యర్థ జలాల నిర్వహణ లాంటి అంశాలు బ్లూ ఎకానమీ పరిధిలోకి వస్తాయి. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగేలా సముద్రాలను, తీరప్రాంతాలను సమర్థవంతంగా, నవ్య ఆవిష్కరణలతో పర్యావరణ హితంగా వినియోగించుకోవడమే బ్లూ ఎకానమీ అని అర్థం చేసుకోవాలి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వ అంశంగా 'సుస్థిరాభివృద్ధిలో సముద్ర వనరులు అనబడే విషయాన్ని తీసుకున్నారు. భూగోళ ఉపరితలంలో 75 శాతం జలాలతో ఆక్రమించబడి, 97 శాతం జలం సముద్రాల రూపంలోనే ఉండడం మనకు తెలుసు. ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతున్న కార్బన్ డై ఆక్సైడ్‌లో 30 శాతం వరకు సముద్రాలు శోషణం చేసుకుంటూ జీవ వ్యవస్థను కాపాడుతూ భూతాపాన్ని తగ్గిస్తున్నాయి. ప్రపంచ జిడిపిలో 35 శాతం సముద్ర వనరుల నుంచే రావడం జరుగుతున్నది. ఆదాయ వనరులుగా, ఉద్యోగ ఉపాధులను కల్పిస్తూ మానవాళి జీవన ప్రమాణాలు పెరగడానికి సముద్రాలు సహకరిస్తున్నాయి. ఆహార భద్రతకు, తరగని శక్తి ఉత్పత్తులకు, నూతన ఔషధాల తయారీకి, ప్రోటీన్ ఆహారం అందించడానికి, సముద్ర గర్భం లోంచి ఖనిజ లవణాలను పొందడానికి, దేశ భద్రతకు సముద్ర వనరులు ఉపకరిస్తున్నాయి. రాబోయే రోజుల్లో సముద్రాలను సన్‌రైజ్ సెక్టార్‌గా కూడా పరిగణించడం జరుగుతుందని ఆశిస్తున్నారు. చమురు అక్రమ రవాణా, ప్రమాదకర ఆయుధాల రవాణా, సముద్రాలు ఉగ్రవాద



కేంద్రాలుగా మారడం, మానవ అక్రమ రవాణా, స్మగ్లింగ్ లాంటి అంశాలు సముద్ర జలాలతో ముడిపడి ఉంటాయి. ప్రతి ఏటా సునామీలు, తుఫాన్లు, హరికేన్లు, టైకూన్స్ లాంటి ప్రకృతి విపత్తులతో లక్షలాది మంది మానవాళి ఉపాధిని కోల్పోతున్నారు. మానవ ప్రేరేపిత చమురు లీకేజ్, వాతావరణ మార్పులతో సముద్ర ఆరోగ్యం దెబ్బతింటున్నది. వాతావరణ ప్రతికూల మార్పులతో సముద్ర ఉష్ణోగ్రతలు, ఆమ్ల గుణం, జల ప్రాణుల మనుగడ సమస్యలు లాంటివి పెరగడం నిరంతరం జరుగుతూనే ఉందని మరువరాదు. మురికి నీరు, వ్యవసాయ వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాలతో కలిసి తీవ్ర కాలుష్యానికి కారణం అవుతున్నాయి. సముద్ర వనరులను స్వార్థ ప్రయోజనాలకు దుర్వినియోగం చేయడంతో మహా సముద్రాల సహజ ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారుతున్నట్లు గమనిస్తున్నాం. భారత ప్రభుత్వం నీలి విప్లవం లేదా బ్లూ రెవల్యూషన్ పేరుతో సముద్ర ఆహారం, ఆక్వాకల్చర్ పరిశ్రమలను పెంచడానికి నీలి కాంతి మిషన్‌ను 7వ పంచవర్ష ప్రణాళికలో (1985-90) ప్రవేశ పట్టడం జరిగింది. మత్స్య పరిశ్రమను ప్రోత్సహిస్తూ మత్స్యకార వర్గాన్ని కాపాడే ప్రయత్నాన్ని నీలి విప్లవం పేరుతో తీసుకోవడం జరిగింది. ఇండియాలో ఆక్వాకల్చర్ పరిశ్రమ ప్రతి ఏటా గణనీయంగా పెరగడం గమనించబడుతున్నది. పర్యావరణ పరిరక్షణ, జీవ వ్యవస్థ భద్రత, సుస్థిరాభివృద్ధి దిశగా నీలి విప్లవ అడుగులు పడడం హర్షదాయకం. నీలి విప్లవ ఫలితంగా మత్స్య, ఆక్వాకల్చర్ పరిశ్రమలు విస్తరించడం జరుగుతూ పేదరిక నిర్మూలనకు దారులు పడుతున్నాయి. నేడు ఇండియాలో 4.7మిలియన్ టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతూ, ప్రతి ఏటా 14.8 శాతం వృద్ధిని రికార్డు చేస్తున్నది. ప్రపంచ దేశాల్లో మత్స్య పరిశ్రమలో ఇండియా 2వ స్థానంలో నిలుస్తూ 47,000కోట్ల రూపాయల ఎగుమతులను నమోదు చేస్తున్నది. సముద్రవనరులు భారత జిడిపీలో 4 శాతం వాటాను కలిగి ఉన్నాయి. భారత ఉప ఖండానికి 9 రాష్ట్రాల్లో 7,516 కిమీ సముద్ర తీరప్రాంతం ఉండగా, 12 భారీ పోర్టులు, 200లకు పైగా మైనర్ పోర్టులు ఉన్నాయి.భారత దేశానికి 80శాతం చమురు సముద్రఉపరితల రవాణాద్వారా మాత్రమే జరగడం గమనార్హం. సాగర వనరుల వినియోగ వ్యాపారంలో పెట్టిన పెట్టుబడిలో 5రెట్ల లాభాలు వస్తాయని పరిశోధన ఫలితాలు వివరిస్తున్నాయి. లైఫ్ బిలో వాటర్ అనే 14వ అంశాన్ని ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా తీసుకోవడం జరిగింది. సముద్రతీరాల్లో పవన శక్తిఉత్పత్తి, అలల శక్తి ఉత్పత్తి లాంటి పునరుత్పత్తి చేయగల శక్తి కేంద్రాలుగా మహా సముద్రాలు మానవాళికి సహజంగానే అందుబాటులో ఉన్నాయి.భారతంలో సముద్ర జలవనరులతో లక్షల కుటుంబాలు జీవనోపాధి పొందుతూ జీవన ప్రమాణాలను పెంచుకుంటున్నారు.పేదరిక నిర్మూలనలో సముద్రవనరులుప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి. డీప్ సీమిషన్‌ద్వారా సముద్ర వనరుల సులభ వినియోగానికి నూతన టెక్నాలజీలను రూపొందించడం జరుగుతున్నది. 2020 నుంచి నార్వేతో కలిసిన భారతం సుస్థిర బ్లూ ఎకానమీకి బాటలు వేస్తున్నది. సాగర్మలా ప్రాజెక్ట్ 2015 వేదికగా పోర్టుల టెక్నా లజీలో ఆధునిక మార్పులను చేయడం జరుగుతున్నది. సముద్ర వనరుల వినియోగానికి ఓ స్మార్ట్‌అనే పథకాన్ని ప్రవేశపెట్టారు. సముద్ర తీర జనాభా జీవన ప్రమాణాలు పెంచడానికి తీర ప్రాంతాలతో పాటు సముద్రాలను ఇంటిగ్రేటెడ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ స్థాపించడం జరిగింది. బ్లూగ్రోత్ ఇనిషియేట్స్‌లో భాగంగానేషనల్ ఫిషరీస్ పాలసీ తేవడం తెలుసు.2025నాటికి భారతంలో 10 మిలియన్ల ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా వేస్తూ వడివడిగా అడుగులు పడుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు లోబడి సముద్రాలను, తీరప్రాంతాలను మానవాళి సంక్షేమానికి వాడుకోవడం, సముద్ర వనరుల వినియోగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను వాడడం, దేశ భద్రతకు సముద్రాలను వాడుకోవడం, దేశ ఆర్థికాభివృద్ధిలో సముద్ర వనరులను భాగం చేయడం,ఉపరితల రవాణా రంగాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు సముద్రజలాల కాలుష్యాన్ని కట్టడి చేయడం భవిష్యత్తులో వేగంగా జరగాలి. ●

# కొత్త ఐటి బిల్లుకు లోక్‌సభ ఆమోదం



## మూజువాణి ఓటుతో చర్చలేకుండానే బిల్లు ఓకే..

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదంతెలిపింది. బైజయంత్ పాండా నేతృత్వంలోని 31 మంది సభ్యులతో కూడిన సెలక్షన్‌కమిటీచేసిన సిఫారసులమేరకు నవీకరించిన బిల్లును ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బిల్లుప్రవేశపెట్టిన కొన్ని గంటల్లోనే ఎలాంటిచర్చ జరగకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదం పొందింది. బీహార్ ఓటర్ల సమగ్ర సవరణపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తుండటంతో దీనిపై చర్చకు తావులేకుండా పోయింది. బిల్లు పాస్ అయిన తర్వాత సభ మంగళ వారానికి వాయిదావేసారు. ఆరుదశాబ్దాలుగా అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో ఈఏడాది ఫిబ్రవరిలోనే కేంద్రం లోక్‌సభలో ఆదాయపుపన్ను బిల్లు 2025ను ప్రవేశపెట్టింది. విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాన్ని సెలక్ట్‌కమిటీకి పంపించింది. కమిటీ ప్రతిపాదనలు పరిగణనలోనికి తీసుకున్న అనంతరం ఆదాయపు పన్ను (నం.2) బిల్లు 2025ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గత శుక్రవారమే పాతబిల్లును ఉపసంహరించారు. సెలక్ట్ కమిటీ సిఫారసులన్నింటినీసుమారుగా ఆమోదించినట్లు మంత్రి తెలిపారు. 1961లో రూపొందించిన ఐటిచట్టానికి 66 బడ్జెట్‌లలో ఎన్నో సవరణలుజరిగాయి. దీనితో సంక్లిష్టంగా తయారయింది. ఈచట్టాన్ని సమీక్షించి సరళీకృతం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లోప్రభుత్వం తెలిపింది. ఆమేరకు కొత్త బిల్లును రూపొందించారు. లోక్‌సభ ఆమోదం తర్వాత ఆబిల్లు రాజ్యసభకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదంతో కొత్తచట్టంగా మారుతుంది. 2026 ఏప్రిల్ ఒకటినుంచి అమలులోకి వస్తుంది. పాత ఆదాయపు పన్ను చట్టంలో గత ఏడాది అసెస్‌మెంట్ ఇయర్ అనేపదాలు వాడుకలో ఉన్నాయి. కొత్తబిల్లులో వీటిస్థానంలోపన్ను సంవత్సరం అనేపదంవినియోగంలోకి వస్తుంది. 2025 ఆదాయపు పన్ను బిల్లు కొత్తపన్నులేమీ విధించదు. ప్రస్తుతంఉన్న పన్నుశ్లాబులు రేట్లను మార్చదు. అలాగే ఐటిఆర్ ఫైలింగ్ గడువు తేదీలు ఆదాయపు పన్ను శ్లాబులు మూలధన లాభాల్లో ఎటువంటి మార్పులు ఉండవు. వేతనాలనుంచి డిడక్షన్ల పరంగాచూస్తే ప్రామాణిక తగ్గింపు, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితరాలు వేరువేరుసెక్షన్ల నిబంధనలకింద ఉన్నాయి. వీటిని ఒకేదగ్గరకు తీసుకొచ్చి పట్టిక రూపంలో కనిపించేటట్లుచేసారు.



# కర్ణాటకలో లక్ష నకిలీ ఓట్లున్నా ఇసి మౌనమేనా?

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తీవ్ర నిరసన

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కోసం ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నాయని, స్పష్టమైన ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నానని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అన్నారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజకవర్గంలో సర్వే నిర్వహించగా దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలాయన్నారు. ఈనిజం దేశంముందున్నా ఎన్నికల సంఘంమాత్రం దీనిపై మౌనం వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో విపక్ష ఎంపిలు 'పార్లమెంట్ టు ఇసి' ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపిలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తంచేశారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపిలను అదుపులోకి అక్కడి నుంచిబస్సులో తరలించారు. ఇది రాజకీయ పోరాటం కాదు, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నామని ఆయన తెలిపారు. 'ఒక మనిషి, ఒక ఓటు' కోసం ఈ పోరాటం చేస్తున్నామన్నారు. స్పష్టమైన ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు.



## తుర్కియేలో భూకంపం: రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రత యువతి మృతి, 29 మందికి గాయాలు

**అంకారా, ఆగస్టు 11:** తుర్కియేలోని బలికెసిర్ ప్రావిన్సులో 6.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. భూకంపం ధాటికి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇస్తాంబుల్‌లోనూ భూమి కంపించిందని అధికారులు వెల్లడించారు. సిందిర్గి పట్టణంలో భూకంప కేంద్రం ఉందని, ఆ పట్టణంలో 16 భవనాలు నేలమట్టమయ్యాయని పేర్కొన్నారు. భవన శిథిలాల కింద చిక్కుకొని ఓ యువతి మృతిచెందిందగా, మరో 29 మందికి గాయాలయ్యాయని అధికారులు వెల్లడించారు. భవన శిథిలాలను తొలగించేందుకు రెస్క్యూ బృందాలు కృషి చేస్తున్నాయి. మరోవైపు, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ ఆకాంక్షించారు. భూకంప ప్రభావిత ప్రాంతాలలో జరుగుతున్న సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నానని ఎక్స్‌లో పోస్టు చేశారు. 2023లో 7.8 తీవ్రతతో సంభవించిన భూకంపం తుర్కియోలో మారణహోమాన్ని సృష్టించింది. భూకంప ధాటికి 53వేలకుపైగా ప్రజలు మృతిచెందగా, వందల్లో భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రమాద తీవ్రత గురించి టర్కిష్ మంత్రి అలీ యెర్లికాయ విలేకర్లతో మాట్లాడారు. ఇస్తాంబుల్, పర్యటక కేంద్రమైన ఇజ్మీర్‌తో సహా దేశంలో పశ్చిమాన ఉన్న అనేక నగరాల్లో భూకంపం సంభవించిదని పేర్కొన్నారు. ప్రమాద స్థలానికి వెంటనే విపత్తు దళాలు చేరుకొని సహాయ చర్యలు ప్రారంభించాయని చెప్పారు. భూకంప ధాటికి 16 భవనాలు కూలిపోయాయన్నారు. మూడు అంతస్తుల భవనం కూలిన ఘటనలో అందులో ఉన్న ఆరుగురు నివాసితులు ఉన్నారని, వారిని రెస్క్యూటీం క్షేమంగా బయటకు తీశారని ఆయన తెలిపారు. అయితే ఓ 80 యేళ్ల వృద్ధుడు శిథిలాల నుంచి వెలికి తీసిన కొద్ది సేపటికే మరణించారని చెప్పారు.

# రాహుల్‌కు నోటీసులివ్వడానికి వాళ్లెవరు?

## ఇసిపై కర్ణాటక డిప్యూటి సిఎం ఫైర్



**బెంగళూరు, ఆగస్టు 11:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేయడంపై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీకి నోటీసులు ఇచ్చే అధికారం ఎన్నికల సంఘానికి లేదని ఆయన సోమవారం స్పష్టం చేశారు. అవసరమైతే తామే ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ, "రాహుల్ గాంధీకి నోటీసులు ఇవ్వడానికి వాళ్లెవరు? వాళ్లను నోటీసులు ఇవ్వమనండి. నోటీసులు ఇచ్చే అధికారం మాకుంది, మేమే వాళ్లకు నోటీసులు పంపిస్తామని డికె శివకుమార్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య బద్ధంగా తాము ఎన్నికల్లో గెలిచామని, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే హక్కు మాత్రమే ఇసికి ఉందని, తమకు నోటీసులు జారీ చేసే హక్కు లేదని ఆయన అన్నారు. ఇసి నోటీసులపై చట్టపరంగా స్పందిస్తామని తెలిపారు. ఎన్నికల్లో మోసం జరిగిందంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) వి. అన్బుకుమార్ రాహుల్‌కు నోటీసులు జారీ చేశారు. ఈనెల7న ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో షకున్ రాణి అనే మహిళ రెండుసార్లు ఓటు వేశారని రాహుల్ ఆరోపించారు. పోలింగ్ అధికారి రికార్డుల ప్రకారమే తాను ఈ విషయం చెబుతున్నానని, అందుకు సంబంధించిన పత్రాన్ని కూడా ప్రదర్శించారు. అయితే, రాహుల్ చూపించిన పత్రం అధికారికమైనది కాదని సిఇఒ తన నోటీసులో పేర్కొన్నారు. తాము జరిపిన ప్రాథమిక విచారణలో షకున్ రాణి ఒక్కసారే ఓటు వేసినట్లు తేలిందని వివరించారు. ఈ నేపథ్యంలో, షకున్ రాణి గానీ, మరెవరైనా గానీ రెండుసార్లు ఓటు వేశారని నిర్ధారణకు రావడానికి మీ వద్ద ఉన్న ఆధారాలను, సంబంధిత పత్రాలను సమర్పించాలని రాహుల్ గాంధీని ఆ నోటీసులో కోరారు. దీని ఆధారంగా తాము పూర్తిస్థాయి విచారణ చేపడతామని తెలిపారు. ఈ నెల 8న జరిగిన ఓ ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, గత 10 ఏళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వీడియో రికార్డింగ్‌లను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే, ఇసిఐ నేరాన్ని దాచిపెడుతున్నట్లేనని ఆయన ఆరోపించారు.



# ప్రధాని ఎస్పీజీలో మహిళా అధికారి

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** దేశంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత పొందే ఏకైక వ్యక్తి ప్రధాని మోడీ. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ ఆయన్ను అనుక్షణం కంటికిరెప్పలా కాపాడుతుంది. ఇటీవల మోడీ బ్రిటన్ పర్యటనలో భాగంగా ఓ ఫొటో వైరలైంది. ప్రధాని వెనుకాల ఉన్న మహిళా ఎవరనే విషయం ఆసక్తిగా మారింది. ఆమె పేరు అదాసో కపేసా. ఎస్పిజిలో తొలి మహిళా ఆఫీసర్‌గా ఘనత సాధించారు. మణిపుర్ సేనాపతి జిల్లాలోని కైబీగ్రామం అదాసో కపేసా స్వస్థలం. సశస్త్ర సీమా బల్‌లక్ష చేరిన ఆమె ఉత్తరాఖండ్ పిథోడ్‌గఢ్‌లోని 55వ బెటాలియన్‌లో సేవలందించేవారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిణి అయిన ఆమె ఎస్పిజిలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులోకి ప్రవేశించడం ఆషామాషీ వ్యవహారం కాదు. యుద్ధ మెలకువలు, వ్యూహాత్మక నిఘా, హైసెక్యూరిటీ ప్రొటోకాల్ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే తీరు అంశాల్లో కచ్చితత్వం కనబర్చిన కపేసా ఇందులో అడుగుపెట్టారు. కఠినమైన ప్రమాణాలతో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన భద్రతా దళాల్లో ఒకటిగా పేరుపొందిన ఎస్పిజి బృందంలో కపేసా ప్రవేశించడం వ్యూహాత్మకం, చరిత్రాత్మకంగాను భావిస్తున్నారు. ముఖ్యంగా భద్రతా బలగాల్లో స్త్రీ, పురుష భేదం లేదని నిరూపించే ప్రయత్నంచేశారు. 1985లో ఎస్పిజి ఏర్పాటైనప్పటి నుంచి ఓ మహిళా అధికారిణి ఇందులో విధులు నిర్వర్తించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రధాని బ్రిటన్ పర్యటనలో కపేసా విధుల్లో ఉండటంతో ఆమెపై సోషల్ మీడియాలో ప్రశంసలుకురిశాయి. ఆమె సరికొత్త ఘనత సాధించారని, శక్తిక ప్రతిరూపంగా, ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారంటూ నెటిజన్లు స్పందించారు.

# డాలరుతో బలపడిన రూపాయి

## 87.53వద్ద కరెన్సీ ట్రేడింగ్ ముగింపు



**ముంబయి, ఆగస్టు 11:** అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాల నేపథ్యంలో, అమెరికా సుంకాల విధింపుపై ఆందోళనలు కొనసాగుతున్న ప్పటికీ సోమవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలపడింది. ఉదయం మార్కెట్ ప్రారంభమైనప్పుడు, రూపాయి 13 పైసలు లాభపడి 87.53వద్ద ట్రేడ్ అయింది. శుక్రవారం ముగింపు ధర 87.66గా ఉన్న సంగతి తెలిసిందే. ఈ వారం జరగనున్న అమెరికారష్యా చర్చల పట్ల మార్కెట్లో ఆశావాహ దృక్పథం నెలకొంది. ఈనెల 15న జరగనున్న ఈ చర్చల ఫలితంగా రష్యాఉక్రెయిన్ యుద్ధం ముగింపుదశకు చేరుకుంటుందన్న అంచనాలు బలపడ్డాయి. ఈ ఆశావాదమే రూపాయి బలపడటానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనికి తోడు, అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు తగ్గడం కూడా రూపాయికి కలిసొచ్చింది. సోమవారం ఉదయం బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 66.25 డాలర్లకు పడిపో యింది. మరోవైపు అమెరికా నుంచి సుంకాల ముప్పు పొంచి ఉంది.

భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 25 శాతం అదనపు సుంకాలను విధించాలని అమెరికా ప్రతిపాదించింది. ఈ కొత్త సుంకాలు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. ఒకవేళ ఈ సుంకాలు అమలైతే, దేశీయంగా టెక్స్‌టైల్స్, లెదర్, సీఫుడ్ వంటి రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇది ఎగుమతి రాబడులను తగ్గించి రూపాయిపై ఒత్తిడి పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటు న్నందుకు గాను చైనా, టర్కీ వంటి దేశాలతో పోలిస్తే భారత్‌పైనే కఠినమైన సుంకాలను ప్రతిపాదించడాన్ని భారత ప్రభుత్వం అన్యాయం, నిర్హేతుకం" అని విమర్శించింది. ఈ వారంలో దేశీయ, అంతర్జాతీయ ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడను న్నాయి. ఈ నెల 12న దేశీయ సిపిఐ, 14న డబ్ల్యూపిఐ గణాంకాలు విడుదల కాను న్నాయి. దీంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) అమ్మకాలు కొనసాగిస్తుండగా, దేశీయ సంస్థాగత మదుపరులు (డిఐఐ) కొనుగోళ్లతో మార్కెట్‌కు మద్దతు నిస్తున్నారు.

## ఢిల్లీ వాషింగ్టన్ విమాన సర్వీసులు నిలిపివేత

### ఎయిరిండియా తాజా నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** టాటా గ్రూప్ యాజమాన్యం లోని ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ నుంచి అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీకి నేరుగా నడిచే విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ నిర్ణయం 2025 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. నిర్వహణాపరమైన కారణాలతోనే ఈ చర్యలు చేపడుతున్నట్లు సంస్థ ఒకప్రకటనలో పేర్కొంది. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ఎయిర్ ఇండియా తన ఫ్లీట్‌లోని 26 బోయింగ్ 7878 విమానాలకు రెట్రోఫిటింగ్ పనులను గతనెలలో ప్రారంభించింది. ఈ ఆధునికీకరణ ప్రక్రియ 2026 చివరి వరకు కొనసాగనుంది. ఈ సమయంలో పలు విమానాలు సేవలకు అందుబాటులో ఉండవు. దీనివల్ల ఏర్పడే విమానాల కొరత, అలాగే పాకిస్థాన్ గగనతలం ఇంకా మూసివేసి ఉండటంతోసుదూర ప్రయాణాలకు ఎక్కువ సమయం పట్టడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈనిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్ ఇండియా వివరించింది. ఇప్పటికే సెప్టెంబర్ 1 తర్వాత వాషింగ్టన్ డీసీకి టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులను సంప్రదించి, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తామని ఎయిర్ ఇండియా హామీఇచ్చింది. ప్రయాణికుల ఇష్టప్రకారం ఇతర విమానాల్లో సీట్లు కేటాయించడం లేదా టికెట్ డబ్బును పూర్తిగా వాపసు చేయడం వంటి ఆప్షన్లు అందిస్తామని పేర్కొంది. అయితే, ఈ డైరెక్ట్ ఫ్లైట్ రద్దయినా ప్రయాణికులు తమ భాగస్వామ్య విమానయాన సంస్థలైన అలస్కా ఎయిర్‌లైన్స్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్, డెల్టా ఎయిర్‌లైన్స్ ద్వారా న్యూయార్క్ (జేఎఫ్‌కే), నెవార్క్ (ఈడబ్ల్యూఆర్), చికాగో, శాన్ ఫ్రాన్సిస్కోల మీదుగా వాషింగ్టన్ డీసీకి వన్‌స్టాప్ విమాన సేవలు యథావిధిగా అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది.

# భార్య మృతదేహం బైక్‌కు కట్టి తీసుకు వెళ్లిన భర్త

## సాయం కోసం ఆర్తనాదాలు..

**నాగ్‌పూర్, ఆగస్టు 11:** నాగ్‌పూర్‌లో మానవత్వాన్ని ప్రశ్నించే అత్యంత విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో కళ్లెదుటే భార్య ప్రాణాలు కోల్పోగా, సహాయం కోసం భర్త చేసిన ఆర్తనాదాలు అరణ్యరోదనలయ్యాయి. గంటల తరబడి వేచి చూసినా ఎవరూ కనీసం స్పందించకపోవడంతో, చివరకు భార్య మృతదేహాన్ని తన బైక్‌కు కట్టుకుని సొంతూరుకు బయలుదేరాడు. ఈ హృదయ విదారక దృశ్యం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అందరినీ కంటతడి పెట్టిస్తోంది. మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాకు చెందిన అమిత్ యాదవ్ (35), గ్యార్సి దంపతులు ఉపాధి కోసం నాగ్‌పూర్‌లోని లోనారా ప్రాంతంలో నివసిస్తున్నారు. ఈనెల 9న రాఖీ పండుగ సందర్భంగా వీరు బైక్‌పై నాగ్‌పూర్ నుంచి మధ్యప్రదేశ్‌లోని తమ స్వగ్రామం కరన్‌పూర్‌కు బయలుదేరారు. నాగ్‌పూర్ జబల్‌పూర్ జాతీయ రహదారిపై మోర్ఫాటా సమీపంలోకి రాగానే, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రక్కు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గ్యార్సి కిందపడిపోగా, ట్రక్కు ఆమెపై నుంచి దూసుకెళ్లింది. డ్రైవర్ ట్రక్కును ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో గ్యార్సి అక్కడికక్కడే మృతి చెందింది. భార్య మరణంతో కుప్పకూలిపోయిన అమిత్ యాదవ్, సహాయం కోసం అటుగా వెళ్తున్న వాహనదారులను వేడుకున్నాడు. కానీ, ఎవరూ ఆగలేదు. ఏం చేయాలో పాలుపోని నిస్సహాయ స్థితిలో, భార్య మృతదేహాన్ని తన బైక్‌కు కట్టుకుని సొంతూరుకు తీసుకెళ్లేందుకు సిద్ధపడ్డాడు. కొంత దూరం ప్రయాణించిన తర్వాత, పోలీసులకు ఈ విషయం తెలిసింది. వెంటనే వారు వెళ్లి అమిత్ యాదవ్‌ను ఆపారు. అనంతరం మృతదేహాన్ని నాగ్‌పూర్‌లోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ఘటన మానవ సంబంధాలు, సామాజిక బాధ్యతపై తీవ్ర చర్చకు దారితీసింది.

# లోయలో పడిపోయిన పికప్ ట్రక్

## ఏడుగురు మహిళలు దుర్మరణం, పలువురికి గాయాలు

**పూణె,ఆగస్టు 11:** మహారాష్ట్రలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భక్తులతో వెళ్తున్న ఒక పికప్ ట్రక్కు అదుపుతప్పి లోయలో పడటంతో ఏడుగురు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో చిన్నారులతో సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పుణె జిల్లాలోని ఖేడ్ తాలూకా పరిధిలో ఉన్న పాపల్‌వాడి గ్రామానికి చెందిన పలువురు భక్తులు కుందేశ్వర్ శివాలయంలో దర్శనం కోసం పికప్ ట్రక్కులో బయలుదేరారు. ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా వాహనం అకస్మాత్తుగా అదుపుతప్పి బోల్తా పడింది. అనంతరం దాదాపు 25 నుంచి 30 అడుగుల లోతైన లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు మహిళా భక్తులు దుర్మరణం పాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సేవల బృందాలు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను పైత్‌లోని గ్రామీణ ఆసుపత్రితో పాటు సమీపంలోని ఇతర వైద్యశాలలకు తరలించాయి.

ఈ ప్రమాదంలో సుమారు 25 నుంచి 35 మంది వరకు గాయపడినట్లు పింప్రిచించ్‌వాడ్ డిసిపి శివాజీ పవార్ తెలిపారు. గాయపడిన వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారని, కొందరి పరిస్థితి విషమంగా ఉందని ఆయన వివరించారు. పుణె ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం (పీఎంఒ) ఒక ప్రకటన విడుదల చేసింది.

ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్ గ్రేషియా అందిస్తామని ప్రకటించారు. ఈ ఘటనపై ఖేడ్ పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## 1971 యుద్ధ వీరుడు పారుల్కర్ కన్నుమూత



**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య 1971లో జరిగిన యుద్ధంలో పాక్‌కు బందీగా చిక్కి ఆ దేశంలో చాలాకాలం పాటు కారాగారవాసంలో వుండి తప్పించుకుని ఇండియాకు వచ్చిన యుద్ధ వీరుడు డికె ఫారుల్కర్ (82) ఆదివారంనాడు పూణేలో గుండె పోటుతో కన్ను మూశారు. డికె పారుల్కర్ పూర్తి పేరు దిలీప్ కమలాకర్ పారుల్కర్. అప్పట్లో భారత వాయుసేనలో గ్రూప్ కెప్టెన్‌గా పనిచేసిన పారుల్కర్ వింగ్ కమాండర్‌గా వున్న సమయంలో 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం సంభవించింది. ఈ సందర్భంగా పాక్ భూభాగంలో ఫైటర్ జెట్ విమానంతో బాంబులు వేసిన ఆయన విమానం కూలిపోగా పాక్ సైనికులకు బందీగా చిక్కారు. ఆ తరువాత ఆయన చాలా కాలం పాటు పాక్ జైల్లో వున్నారు. అయితే తనతో పాటు పాక్ చెరలో వున్న ఇద్దరు భారత సైనికులతో కలిసి జైలు నుంచి పారుల్కర్ సాహోసపేతంగా తప్పించుకున్నారు. పారుల్కర్‌తో పాటు మరో ఇద్దరు ఖైదీలు తప్పించుకున్న విషయం రెండు రోజుల తరువాత కానీ పాక్‌కు తెలియలేదంటే ఆయన ఎంత పక్కాగా పథకం రచించారో ఊహించుకోవచ్చు.


## భారత్‌కు పాక్ సైన్యాధిపతి అణు బెదరింపులు..

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్తాన్ సైన్యాధిపతి అసీం మునీర్ అక్కడి నుంచే భారత్‌పై అణు బెదిరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఉన్మాద దేశమని దుయ్యబట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోందని మండిపడింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది. అణ్వాయుధాల వినియోగంపై బెదిరింపులు పాక్‌కు అలవాటే. ఇలాంటి వ్యాఖ్యలతో ఆ దేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకోవాలి. పాక్ అణ్వాయుధాలపై ఎవరి నియంత్రణ ఉందో దీన్ని బట్టి స్పష్టమవుతోంది.

## ఇసిని రిగ్గింగ్ యంత్రంగా మార్చిన బిజెపి: స్టాలిన్

**చెన్నై, ఆగస్టు 11:** బిజెపి ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇటీవల చేసిన ఆరోపణలకు తమిళనాడు సిఎం, డిఎంకె చీఫ్ ఎంకె స్టాలిన్ మద్దతు తెలిపారు. ఎన్నికల సంఘాన్ని బిజెపి 'పోలింగ్ రిగ్గింగ్ యంత్రం'గా మార్చిందంటూ ఆరోపణలు గుప్పించారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ డిఎంకె కలిసి నిలబడుతుందన్నారు. బిజెపి ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే అపహాస్యం చేస్తుంటే మౌనంగా ఉండలేం అని వ్యాఖ్యానించారు. ప్రతి రాష్ట్రానికి పూర్తి మెషిన్ రీడబుల్ ఓటరు జాబితా విడుదల చేయాలని ఈ సందర్భంగా స్టాలిన్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్వతంత్ర్య దర్యాప్తు జరపాలని కోరారు. మరోవైపు, ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కోసం ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నాయని, స్పష్టమైన ఓటర్ల జాబితాను ఇసి విడుదల చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజకవర్గంలో సర్వే నిర్వహించగా దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలిన విషయాన్ని గుర్తు చేశారు.

## కాల్పుల్లో కొలంబియా సెనెటర్ మృతి



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** కొలంబియా సెనేటర్, అధ్యక్ష అభ్యర్థి మిగ్యుల్ ఉరిబ్ టర్బే మరణించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ప్రాణాలు కోల్పోయారు. జూన్‌లో మిగ్యుల్ బహిరంగ ప్రదేశంలో నిర్వహించిన ఓ ప్రచార కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా ఓ దుండగుడు ఆయన వెనుక నుంచి తలపై పలుమార్లు కాల్పులు జరిపాడు. వెంటనే అప్రమత్తమై అధికారులు ఆయనను ఆసుపత్రికి తరలించారు. బొగోటా మేయర్ కార్లోస్ గాలన్ ఈ విషయాన్ని ధృవీకరించారు. అనంతరం 15 ఏళ్ల నిందితుడు సహా ఈ కేసులో అయిదుగురు అనుమానితులను కొలంబియా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనను మిగ్యుల్ పార్టీ కన్జర్వేటివ్ డెమోక్రసీ తీవ్రంగా ఖండించింది. ఈ హత్యాయత్నంలో రాజకీయ కోణం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేసింది. నాటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతను సోమవారం కన్నుమూశారు. కాగా వచ్చే యేడాది కొలంబియాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష కన్జర్వేటివ్ డెమోక్రటిక్ పార్టీ నుంచి మిగ్యుల్ పోటీకి దిగారు.

## ఓపెన్ ప్లాట్ల వేలంకు అనూహ్య స్పందన
# రాజీవ్ స్వగృహాకు రూ.105 కోట్ల ఆదాయం

**హైదరాబాద్,ఆగస్టు 11 ప్రభాతవార్త:** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్వహించిన ఓపెన్ ప్లాట్ల వేలానికి విశేష స్పందన లభించింది. హైదరాబాద్ శివారు ప్రాంతమైన తొర్రూరులో నిర్వహించిన వేలంలో 100 ప్లాట్లను వేలం వేయగా చదరపు గజం రూ.65,700 వరకు పలికింది. ఈ వేలం ద్వారా కార్పొరేషన్‌కు రూ.105 కోట్ల ఆదాయం వచ్చింది.గతంలో బహదూర్‌పల్లిలో నిర్వహించిన వేలంలో కూడా మంచి స్పందన వచ్చింది. హైదరాబాద్‌లో సొంతింటి కలను సాకారం చేసుకోవాలనుకునేవారు ప్లాట్ల కోసం పోటీ పడుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని తొర్రూర్ ప్రాంతంలో వేలం నిర్వహించగా పలువురు ప్లాట్ల కోసం పోటీ పడ్డారు. ఒక్కో ప్లాట్ 300 నుంచి 450 చదరపు గజాల విస్తీర్ణం చొప్పున మొత్తం 100 ఓపెన్ ప్లాట్లు వేలానికి వచ్చాయి. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ చదరపు గజానికి రూ.25,000 కనీస ధరను నిర్ణయించింది. ఈ వేలంలో ప్లాట్లకు అంచనా వేసిన దానికంటే ఎక్కువ ధరలు వచ్చాయి.ముఖ్యంగా కార్నర్ ప్లాట్లకు అత్యధిక ధర పలికింది. తొర్రూరు ప్లాట్లలో అత్యధికంగా ఒక చదరపు గజం ధర రూ.65,700 పలికింది. మొత్తం 24 కార్నర్ ప్లాట్లలో ఒక్కో గజం రూ.67,500 వరకు పలికింది. 100 ప్లాట్ల సగటు ధర గజానికి రూ.33,000గా పలికినట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం ప్రక్రియలో 240 మంది బిడ్డర్లు పాల్గొన్నారని తెలిపారు. ఇటీవల మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బహదూర్‌పల్లి ప్రాంతంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఓపెన్ ప్లాట్లకు వేలం నిర్వహించింది. 68 ప్లాట్లలో 50 ప్లాట్లను వేలంలో విక్రయించారు. కార్నర్ ప్లాట్లకు చదరపు గజానికి రూ.30 వేలు, ఇతర ప్లాట్లకు రూ.27 వేలు కనీస ధరగా నిర్ణయించారు. వేలంలో గరిష్ఠంగా చదరపు గజానికి రూ.46,500 ధర పలికింది. ఈ వేలం ద్వారా దాదాపు రూ.100కోట్ల ఆదాయం వచ్చింది. నాగోల్ సమీపంలోని బండ్లగూడలో 159 ఫ్లాట్లు, పోచారం సమీపంలోని 601 ఫ్లాట్లు వేలం ద్వారా విక్రయించారు. ఈ వేలం ద్వారా మొత్తం రూ.78 కోట్ల ఆదాయం వచ్చింది.

# క్రాప్ లోన్లకు సిబిల్ స్కోర్

## 650 పాయింట్లకే పంట రుణం
## మూడేళ్ల రికవరీ ట్రాక్ తప్పనిసరి
## రైతులకు మంజూరు కాని లోన్లు

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతోంది. పంటల పెట్టుబడులకు అవసరమైన రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. నిబంధనల పేరుతో కొర్రి వేసి రుణాలు ఇవ్వకుండా బ్యాంకులను రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పంట రుణాలను మంజూరు చేయాలంటే సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇండియా లిమిటెడ్ (సిఐబిఐఎల్) స్కోరు తప్పని సరిగా ఉండాలని స్పష్టం చేస్తున్నాయి. అందులో మంచి పాయింట్లు ఉంటేనే పంట రుణాలు ఇస్తామని పలు బ్యాంకులు రైతాంగాన్ని ఇబ్బం దులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్త తున్నాయి. ఆర్‌బీఐ నిబంధన పేరుతో పంట రుణాలకు సైతం సిబిల్ స్కోర్‌ను బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటున్నాయి. సిబిల్ స్కోర్ కనీసం 650 నుండి 700 పాయింట్లు ఉంటేనే రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకు అధికా రులు చెబుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ సిబిల్ స్కోర్‌తో ప్రధానంగా చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులు పంట రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా రుణాల రికవరీలో మూడేళ్ల ట్రాక్ రికార్డ్ చూస్తు న్నామని, ఆ రికార్డు సరిగా ఉంటే రైతులకు సిబిల్ స్కోర్ తక్కువఉన్నా రుణాలు ఇస్తున్నామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. గత రుణాల చెల్లింపుల్లో ఒకటి, రెండు నెలల వ్యత్యాసం ఉన్నా రుణాలు మంజూరు చేస్తున్నామని పేర్కొంటున్నారు. అయితే చిన్న, సన్నకారు రైతులు చాలా మందికి ట్రాక్ రికార్డు ఉండడం లేదు. 2014లో రాష్ట్రవిభజన తర్వాత రాష్ట్రంలో రుణమాఫీ పథకం దశలవారీగా అమలు చేయడంతో పంటరుణాలు పొందిన రైతులందరికీ రుణాల మాఫీకి ఐదేళ్ల సమయం పట్టింది. అదేవిధంగా వడ్డీల భారమూ ఎక్కువైంది.

దీంతో పలువురు చిన్న, సన్నకారు రైతులు వడ్డీలు చెల్లించలేక, రుణాలు రెన్యువల్ కూడా చేయించుకోలేకపోయారు. దీంతో ఫెనాల్టీలు కలుపుతూ వచ్చిన బ్యాంకర్లు ఆ రైతుల ఖాతాలను డీఫాల్టర్ కింద, నిరర్థక ఆస్తుల కింద ప్రకటించారు. దీంతో ఇటీవల జరిగిన రుణమాఫీ పథకంలో సైతం ఈ రైతులపేర్లను జాబితాల్లో చేర్చకపోవడంతో వారంతా రుణమాఫీ పథకానికి దూరమయ్యారు. అదే విధంగా ఈఏడాది అమలైన రుణమాఫీ పథకం సైతం విడతల వారీగా కొనసాగడంతో రైతులంతా సకాలంలో వడ్డీగానీ,అసలుగానీ చెల్లించలేదు. దీంతో రుణఖాతాల రెన్యూవల్ నిలిచిపోయింది. గత ఏడాది వరకు ఏటా రుణాలు చెల్లించిన రైతులు సైతం రుణమాఫీ జమయ్యాక బ్యాలెన్స్ ఉంటే చెల్లిద్దామనే ఆలోచనతో వేచి ఉండడంతో వారందరి సిబిల్ స్కోర్ పడి పోయింది.

దీంతో లక్ష లాదిమందిచిన్న,సన్నకారు రైతులు పంటరుణాలు పొందడానికి అనర్హులుగాతేలారు. బంగారం తాక ట్టుపెట్టి తీసుకునే పంట రుణాలకు సైతం సిబిల్ స్కోర్‌పరిగణనలోకి తీసుకుంటుండడంతో రైతుల్లో కలవరం మొదలైంది.

# తెలంగాణలో బిజెపిని ఎవరు పట్టించుకుంటారు?

## ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, ఆగస్టు11,ప్రభాతవార్త:** బిజెపిది పైకి జాతీయవాదం లోపల అంతా మతతత్వం, అధికారతత్వమని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం సిఎల్‌పి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన చరిత్ర రాహుల్ గాంధీ కుటుంబానిదని ఈ దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన ఒక్క బిజెపి నాయకుడిని చూపించాలని ఆయన సవాల్ విసిరారు.ఈ దేశ రక్షణ కోసం మూడుసార్లు యుద్ధం చేసిన గెలిచిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలదని ఆయన గుర్తుచేశారు. అమెరికాను కూడా ఉక్కు మహిళ ఇందిరాగాంధీ లెక్క చేయలేదని వివరిం చారు. దేశమంతా యుద్ధం చేయండని మీ వెంట మేం ఉంటామంటే చేతులెత్తిసిన చరిత్ర మోడీదని అపహాస్యం చేశారు. ట్రంప్ చెప్పాడని యుద్ధం ఆపేసి దేశ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని దుయ్యబట్టారు. తెలంగాణ బిసిలకు ఓ న్యాయం, బిహార్ బిసిలకు ఓ న్యాయమా, ఎందుకు గవర్నర్ న్యాయసమీక్షకు పంపారు రామచంద్రరావు ముందు తెలంగాణ బిసిలకు సమాధానం చెప్పు అని ఆయన ప్రశ్నించారు. రామచంద్రరావు ఎంత హడావిడి చేసినా తెలంగాణ ప్రజలు బిజెపి నమ్మరని ఆయన అన్నారు. కేంద్రంలో 400 సీట్లు గెలుస్తామని చివరకు 240 సీట్లకు పరిమిత మయ్యారని ఆయన విమర్శించారు. బిజెపి పని కేంద్రంలోనే అయిపోయింది ఇక తెలంగాణలో ఎవరు పట్టించుకోరని ఆయన అన్నారు.

# ప్రజాస్వామ్యానికి బ్యూరోక్రసీ కీలకం

## సివిల్స్‌లో తెలంగాణ నుంచి అత్యధిక అభ్యర్థులు: డిప్యూటీ సీఎం విక్రమార్క

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సివిల్స్ లో తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపికవ్వాలనీ సూచించారు. హైదరాబాద్‌లో సోమవారం సింగరేణి ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన 178 మందికి లక్ష రూపాయలు చొప్పున అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ వనరులు అతి ముఖ్యమైనవి, వాటిని సానబట్టి వజ్రాలుగా తయారు చేస్తే సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతారన్నారు. సివిల్స్ సిద్ధమవుతున్న అభ్యర్థులకు అన్ని విధాలుగా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అభ్యర్థులకు మనోధైర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. అలాగే సివిల్స్ ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా లక్ష ఆర్థిక సాయంతో పాటు, ఢిల్లీలో వసతులు కల్పిస్తాం అని హామీ ఇచ్చారు. మొదటి



సంవత్సరం 148 మందికి ఆర్థిక సహాయం అందించగా, వీరిలో 10 మంది సివిల్ సర్వీస్ కి ఎంపికయ్యారన్నారు. ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి సివిల్ సర్వీసెస్ ద్వారా అవకాశముంటుందని తెలిపారు. నిబద్ధత సేవలందిస్తే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరవేస్తేనే ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయి అన్నారు. అధికారుల్లో చిత్తశుద్ధి లోపిస్తే ప్రభుత్వ లక్ష్యాలు ఎంత గొప్పగా ఉన్నా ఫలితం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, సింగరేణి సిఎండి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫసల్ బీమాకు రూ.3,200 కోట్లు విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద నిధులను కేంద్రం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివారజ్ చౌహాన్ దీనికి సంబంధించిన నిధులను సోమవారం విడుదల చేశారు. ఈ సారి మొత్తం రూ.3,200 కోట్లు 30 లక్షల మంది రైతులకు జమ చేస్తోంది. ఈపథకంలో అతిపెద్ద లబ్ధిదారులు మధ్యప్రదేశ్ రైతులే ఉన్నారు. వారికీ రూ.1,156 కోట్లు జమ చేసింది. అలాగే రాజస్థాన్ రైతులకు రూ.1,121 కోట్లు, ఛత్తీస్‌గఢ్ రైతులకు రూ.150 కోట్ల నిధులు విడుదలయ్యాయి. మిగతా రాష్ట్రాల రైతులకు కలిపి రూ.773 కోట్లు విడుదల చేసింది. కాగా వర్షాభావం, వరదలు, తుఫానులు, కరువు, తెగుళ్ల వంటి కారణాలతో పంటలు నష్టపోయినప్పుడు ఈ బీమా వర్తిస్తుంది. అంతేకాదు, పంట కోయగానే పొలంలో ఆరబెడుతున్న సమయంలో జరిగిన నష్టానికి కూడా ఈ పథకం రక్షణ ఇస్తుంది. అధికారులు నష్టాన్ని అంచనా వేసి, 15 రోజులలోపే క్లెయిమ్ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ఇక 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను ప్రారంభించింది. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు వంటి కారణాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులను ఆదుకోవడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. ఈ పథకంలో రైతులు చెల్లించాల్సిన ప్రీమియం చాలా తక్కువగా ఉంటుంది. ఖరీఫ్ పంటలకు కేవలం రూ.2, రబీ పంటలకు రూ.1.5 , వాణిజ్య పంటలకు రూ.5 మాత్రమే. మిగతా ప్రీమియం మొత్తాన్ని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం సమానంగా భరిస్తాయి. దీని వల్ల రైతులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుంది.

# రేవంత్‌రెడ్డిపై కేసు దాఖలు చేసిన పిటిషనర్‌కు సుప్రీం అక్షింతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు11:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దాఖలు చేసిన పిటిషనర్ పెద్దిరాజుపై సుప్రీంకోర్టు సీరియస్ అయి అక్షింతలు వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు అఫిడవిట్ రూపంలో క్షమాపణలు చెప్పాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పిటీషనర్ పెద్దిరాజును ఆదేశించింది. రేవంత్‌రెడ్డిపై పెద్దిరాజు దాఖలు చేసిన కేసును గతంలో తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఆ కేసును నాగ్‌పూర్ బెంచ్‌కి బదిలీ చేయాలని సుప్రీంలో పెద్దిరాజు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో హైకోర్టు న్యాయమూర్తిపైనా పిటీషనర్ పెద్దిరాజు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. కాగా సోమవారం విచారణ సందర్భంగా పిటీషన్ డ్రాఫ్ట్ చేసిన ఏఓఆర్, పెద్దిరాజులపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ధర్మాసనం తెలిపింది. క్షమాపణ చెపుతూ దాఖలు చేసే అఫిడవిట్‌పై నిర్ణయాన్ని జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వదిలేసింది. వారం రోజుల్లో అఫిడవిట్ దాఖలుచేయాలని పెద్దిరాజుకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణ 4వారాలకు వాయిదా వేసింది.




సోమవారం ధర్నాచౌక్‌వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న వివిధ బ్యాంకుల పెన్షనర్లు

# పెన్షన్ అప్‌డేషన్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

## ఆల్ ఇండియా బ్యాంక్ పెన్షనర్స్ అండ్ రిటైరీస్ కాన్‌ఫెడరేషన్ నాయకులు డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 11, ప్రభాతవార్త:** గత 30 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ అప్‌డేషన్‌ను తక్షణమే పూర్తి చేయాలని ఆల్ ఇండియా బ్యాంక్ పెన్షనర్ అండ్ రిటైరీస్ కాన్‌ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆల్ ఇండియా బ్యాంక్ పెన్షనర్స్ అండ్ రిటైరీస్ కాన్‌ఫెడరేషన్ ఏ.పీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్‌బీఐ నుండి ఏ.రమేష్‌బాబు, సిండికేట్ బ్యాంకు నుంచి కే.సురేష్‌బాబు, ఇండియన్ బ్యాంకు నుంచి కే.సూర్యనారాయణమూర్తి, ఎస్‌బీహెచ్‌కు చెందిన ఎం.చక్రపాణి, రోహిణిరావు, ఉప్పు సుధాకర్, కెనరా బ్యాంక్ నుంచి సీఎస్‌ఆర్ ఆంజనేయులు, ఫెడరల్ బ్యాంకు నుంచి టివి సుబ్బారావు, సెంట్రల్ బ్యాంక్ నుంచి కే.మధుసూదన్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ రిటైరయిన వారి కోసం 4.5 లక్షల కార్పస్ ఫండ్ అందుబాటులో ఉంది కాబట్టి, పెన్షన్ రెగ్యులేషన్ 35(1)లో పేర్కొన్న విధంగా పెన్షన్ అప్‌డేషన్ చేసినందువల్ల బ్యాంకులపై కానీ, ప్రభుత్వం పైన కానీ ఎటువంటి ఆర్థిక భారం పడదని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుననుసరించి, స్పెషల్ అలవెన్స్‌ను మూల వేతనంగా పరిగణించాలని, పదవీ విరమణ చేసిన వారి ఆరోగ్య భీమా ప్రీమియం మొత్తం బ్యాంకులే భరించాలని డిమాండ్ చేశారు.

# ఫీజు బకాయిలుచెల్లించలేని స్థితిలో ప్రభుత్వం:ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (మెహదీపట్నం), ఆగస్టు 11 ప్రభాత వార్త :** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు బకాయలు కూడా చెల్లించలేని అసమర్థ పాలన కొనసాగుతుందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఘాటుగా విమర్శించారు. ఇలాంటి అసమర్థ పాలన ఉన్నా ఒకటే, పోయినా ఒకటే అన్నారు. సోమవారం బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రైవేటు యూనివర్సిటీలలో బిసి,ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోయింది. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణలో 14.లక్షల మంది కళాశాల విద్యార్థుల ఫీజు బకాయిలు ఏకంగా రూ.6.వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పేద



విద్యార్థులకు చదువుకునేందుకు ఉపయోగపడే ఈ స్కాలర్‌షిప్ విధానంను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. విద్య రాజ్యాంగబద్ధమైన హక్కు అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు లక్షల కోట్ల అప్పులు చేస్తూ, విద్యార్థుల ఉన్నత చదువుల కోసం స్కాలర్‌షిప్ బకాయిల కోసం ఎందుకు అప్పులు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20.నెలలవుతున్నా 20 రూపాయలు కూడా స్కాలర్‌షిప్‌ల కోసం విడుదల చేయలే దన్నారు. బడ్జెట్‌లో రూ.5.వేల కోట్లు కేటాయించి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోతే లక్షలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవు తారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సర్కారు స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను మంజూరు చేయాలని, లేనిఎడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ముట్టడిలో విద్యార్థి సంఘం నాయకులు నందగోపాల్, మణికంఠ, శివ, ప్రీతం, నిఖిల్, ధనూష్‌తో పాటు వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# 14 నుండి ఖనిజ బ్లాకుల వేలం

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** తెలంగాణలో ఖనిజాల బ్లాక్‌ల క్వారీ రీజుల మంజూరుకు రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ రెండో విడత వేలానికి ఏర్పాట్లు చేస్తోంది. రెండో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 34 చిన్న తరహా ఖనిజాల బ్లాక్‌ల లీజుకు వేలం జరగనుంది. ఈ నెల 14 నుండి 22వ తేదీ వరకూ ఈ రెండో విడత వేలం జరగనున్నాయి. వేలం ప్రక్రియ ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తవుతుందని గనులు, భూగర్భ శాఖ ప్రకటించింది. దీనికి సంబంధించి ఇప్పటికే గత నెల 17వ తేదీన నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. కాగా ఈ ఏడాది జరిగిన తొలివిడ వేలంలో దాదాపు 187.5 ఎకరాల విస్తీర్ణంలోని 256 ఖనిజాల బ్లాక్‌లను వేలం వేసింది. ఇందులో 19 బ్లాక్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 56 కోట్ల రూపాయల మేర ఆదాయం సమకూరింది.

# కెసిఆర్ కుటుంబం ఏ క్షుద్రపూజలు చేసిందో ఎస్ఎల్‌బిసి కూలింది

## ఆంధ్రప్రదేశ్ తరహాలో తెలంగాణలో అరెస్టులు ఉంటాయనుకోవద్దు: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 11,ప్రభాతవార్త:** కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చుని క్షుద్రపూజలు చేసినట్టున్నాడని అందుకే ఎస్.ఎల్.బి.సి కూలిపోయిందని రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి ఆవేదన చెందారు. సోమవారం సచివాలయంలో విలేఖరులతో చిట్‌చాట్‌లో వెంకటరెడ్డి మాట్లాడుతూ మా జిల్లా మాజీ మంత్రికి షాబాద్‌లో 80 ఎకరాల ఫామ్ హౌస్ ఉందని ఆరోపించారు. బిఆర్ఎస్ అగ్రనేతల బినామీలు ఫోన్ ఎత్తడంలేదని అన్నారు. బిఆర్ఎస్‌లో వాళ్లకు వాళ్లే కొట్టుకుంటున్నారని ఆయన అన్నారు. నేను ఏడుసార్లు ఎన్నికల్లో పోటీచేసి ఆరుసార్లు గెలిచా అని ఆయన వివరించారు. నా అఫిడవిట్ లో ఎలాంటి తప్పులు లేవు. ఆంధ్రప్రదేశ్ రాజకీయం వేరు తెలంగాణలో రాజకీయం వేరు అని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను చూసి తెలంగాణలో అరెస్టులు ఉంటాయని అనుకోవద్దు అని ఆయన చెప్పారు. చింతల్ టూ హాయత్ నగర్ డబుల్ డెక్కర్ రోడ్డు మంజూరు చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి 96శాతం భూసేకరణ పూర్తిచేశాముఒక్క రీజినల్ రింగ్ రోడ్డుపైన 20నుంచి 30 మీటింగ్స్ పెట్టామని చెప్పారు.కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు.ఏ పార్టీ వారు అయినా అపాయింట్మెంట్ అడగ్గానే గడ్కరీ ఇస్తున్నారు. గతంలో ఆర్ అండ్ బి మంత్రి ప్రశాంత్ రెడ్డికి ఢిల్లీ ఎక్కడ ఉందో తెలియదు. ప్రశాంత్ రెడ్డికి అధికారులు తెలియదు ఎవరూ తెలియదుసెక్రటేరియట్ కట్టి రూ.350 కోట్లు బకాయిలు మా మీద పెట్టారు.32 జిల్లాల్లో కలెక్టర్ ఆఫీసులు కట్టామని బిఆర్ఎస్ గొప్పలు చెప్తుంది.

32 కలెక్టర్ ఆఫీసుల నిర్మాణానికి చేసిన అప్పులు ఇప్పుడు క్లియర్ చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ ను విశ్వనగరం చేశామని కెటిఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారుకానీ ఉప్పల్ నుంచి నారపల్లి రోడ్డు 8కిలోమీటర్లు 2017 నుంచి ఇప్పటివరకు పూర్తికాలేదని అపహాస్యం చేశారు.

# ఐడీబీఐ బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు ఎల్ఐసీ ఉద్యోగుల మద్దతు

**హైదరాబాద్ (ముషీరాబాద్),ఆగస్ట్ 11, ప్రభాతవార్త:** ఐడీబీఐ బ్యాంకు ఉద్యోగుల సమ్మెలకు ఎల్ఐసీ ఉద్యోగులు మద్దతు ప్రకటించారు. ఈమేరకు సోమవారం ఎల్ఐసీ, సికింద్రాబాద్ డివిజన్, ఐసీఈయూ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఐడీబీఐ ఉద్యోగుల ఒక్కరోజు సమ్మెకు సంఘీభావంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో కేంద్ర ప్రభుత్వ విధానంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐసీఈయూ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.రఘు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న ఐడీబీఐ బ్యాంకును ప్రైవేట్ పరం చేసే విధానాన్ని అన్ని ఉద్యోగ సంస్థలు ఖండిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసియూ అధ్యక్షులు ఎస్. గుణశేఖర్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్.సి. అనూరాధ, చంద్రశేకర్, ప్రభాకర్, కౌశిక్, జావేద్, హిమబిందు పాల్గొన్నారు.


# ఐటిపి సేవలను ప్రారంభించిన పోస్టల్ శాఖ

**హైదరాబాద్,ఆగస్టు 11 ప్రభాతవార్త:** ఇండియన్ పోస్టల్ డిపార్టుమెంట్ సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తోంది. ఇందులో భాగంగా ఐటిపి (ఇంటర్నేషనల్ ట్రాక్ ప్యాక్డ్ సర్వీసెస్) పేరుతో కొత్త సేవలను ప్రారంభించింది.ఈ సేవలతో ప్రపంచవ్యాప్తంగా 45 దేశాల్లో ఉండే భారతీయులతో పాటు ఆయా దేశాల్లో ఉండే వారికి వేగంగా సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది.ఈ సేవలతో ఇకామర్స్ ఎగుమతిదారుల అవసరాలకు అనుగుణంగా, సరిహద్దు లావాదేవీల కోసం రూపొందించబడిన ఒక ప్రత్యేక పరిష్కారంమని అదే సమయంలో వ్యక్తిగత కస్టమర్లకు కూడా సమానంగా తమ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. మొదటి దశలో చైనా, హాకాంగ్,జపాన్, మలేసియా, సింగపూర్,కెనడా,జర్మని, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో పాటు యుఎస్ఏ,గ్రేట్‌బ్రిటన్ వంటి అగ్రదేశాలకు కూడా ఐటిపి సేవలు అందించవచ్చని తెలిపింది.ఈ సేవల్లో వెయిట్ లిమిట్ ఉటుందని, 2 కేజీల నుంచి 5కేజీల వరకు బరువుకు సంబంధించిన పార్సిల్స్ మాత్రమే అంగీకరించనున్నట్లు పేర్కొంది. తమ పార్సిల్స్‌లను ఎక్కడిక్కడే ట్రాక్ చేసుకునే సుదపాయం కూడా ఉంటుందని తెలిపింది. పార్సిల్ సర్వీసులను వేగవంగా అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, తెలిపింది.ఈ సేవలను వినియోగించుకునేందుకు 18 శాతం జిఎస్టీ కూడా వసూలు చేస్తున్నట్లు సంస్థ ఒక పత్రకటనలో పేర్కొంది.

# బియ్యం సేకరణకు ఒప్పుకోని ఎఫ్‌సిఐ

## గోదాములు ఖాళీగాలేవన్న సాకుతో తిప్పిపంపుతున్న సిఎంఆర్ బియ్యం

**హైదరాబాద్, ఆగస్టు 11,ప్రభాతవార్త:** భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) తెలంగాణలో బియ్యం సేకరణకు మోకాలడ్డుపెడుతోంది. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన కస్టం మిల్లింగ్ రైస్ దిగుమతికి గోదాములు ఖాళీలేవని అధికారులు నిరాకరిస్తున్నారు.ప్రభుత్వానికి మిల్లర్లు ఇవ్వాల్సిన సిఎంఆర్ బియ్యం ఇచ్చేందుకు దిగుమతి కావటం లేదు. మిల్లుల ఆవరణలో ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటే నాణ్యత తగ్గుతుంది. నిల్వలు వెనక్కి తీసుకోవాలని అధికారులపై మిల్లర్లు ఇప్పుడు ఒత్తిడి పెంచుతున్నారు. లేదా వెంటనే బియ్యం దిగుమతి చేసుకోవాలి. ఎఫ్‌సిఐ తెలంగాణలో తన సొంత గోదాములతోపాటు ఎస్‌డబ్ల్యుసి,సెంట్రల్ వేర్‌హౌజ్‌గిడ్డంగులు ఇతర ప్రైవేటు అద్దెగిడ్డంగుల్లో సుమారు ఇప్పటికే 22లక్షలమెట్రిక్‌టన్నుల ధాన్యం నిల్వ చేశామని ఇక తెలంగాణలో మిల్లర్ల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేమని చేతులు ఎత్తేయడంతో రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్లు, రాష్ట్రప్రభుత్వం గగ్గోలు పడుతోన్నది. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న రైస్‌మిల్లుల్లో, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పౌరసరఫరాల సంస్థ గోదాములు బియ్యం బస్తాలతో పూర్తిగా నిండిపోయాయి. ఎఫ్‌సిఐ తెలంగాణ బాయిల్డ్ రైస్‌ను సేకరించకుండా ఉండటానికే ఇక్కడి గోదాముల్లో నిండిన స్టాక్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడంలేదని కొంత మంది రైస్‌మిల్లర్లు ఆరోపిస్తున్నారు. కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఎఫ్‌సిఐ సిఎంఆర్ బియ్యం సేకరణ చేయకుండా ఉండేందుకు మే31తో ముగి సిన గడువును ఉద్దేశ్యపూర్వకంగా పెంచడంలేదని తెలుస్తోంది. గత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి గడచిన మే 31వ తేదీతో సిఎంఆర్ బియ్యం అప్పగించే గడువు ముగి సింది. ఇంకా మిల్లర్లు రాష్ట్రవ్యాప్తంగా 43 శాతం ఖరీఫ్ బియ్యం అప్పగించాలి. కేంద్రం ఇప్పటివరకు గడువు పొడిగించలేదు. దీంతో గత ఖరీఫ్ సీజన్ కు సంబం ధించిన బియ్యం దిగుమతి చేసుకునే అవకాశం లేదు. ఇక రబీకి సంబంధించిన బియ్యం అప్పగించేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నా గోదాములు ఖాళీ లేవు. ఎఫ్‌సిఐకి తెలంగాణ వ్యాప్తంగా ఆరు నుంచి ఏడు లక్షల మె.ట ఆహార ఉత్పత్తులను నిల్వచేసే సామర్థ్యం కలిగిన సొంత గిడ్డంగులు పరిమితమైన స్థాయిలోనే ఉన్నాయి. నిజామా బాద్



జిల్లా డిచ్‌పల్లిలో పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గిడ్డంగి ఉంది. మిర్యాలగూడలో 90వేల మె.టన్నులు, నల్లగొడలలో 60వేల మె.ట. చర్లపల్లిలో లక్షా 25వేలమె.ట. నసత్‌నగర్‌లో 65వేలమె.ట, వరంగల్‌లో 1,10,000 మె.ట, జమ్మికుంటలో 62వేలమె.ట, పెద్దపల్లిలో 16వేలమె.ట. మంచిర్యాలలో 30వేల మె.ట సామర్థ్యం కలిగిన సొంత గిడ్డంగులు ఉన్నాయి. సొంతగిడ్డంగులతో పాటు అద్దెగిడ్డంగులలో రాష్ట్రవాప్తంగా సరుకు నింపి ఉంచారు. ఆ సరుకు ఉండగా మేం వేరే సరుకు తీసుకోమని ఎఫ్‌సిఐ అధికారులు పంపుతున్నారు. మిల్లర్లు మాత్రం ఎఫ్‌సిఐ ప్రతి నిల్వలను లాట్లుగా చేసి నిల్వచేస్తారని ఒక్కోలాటులో రెండు నుంచి మూడు ఎస్‌కెల బియ్యం ఖాళీలు ఉన్నప్పటికి లాట్లు అన్ని నిండి ఉన్నాయని చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. ఆరు ఎస్‌కెల బియ్యం నిల్వ చేస్తే ఒక లాటుగా చూపుతారు. ఎస్‌కెకు 290మె.ట బియ్యం ఉంటాయి. బాయిల్డ్ రైస్‌ను తెలంగాణ నుంచి సేకరణ చేయవద్దనే ఇక్కడి సరుకు పొరుగు రాష్ట్రాలకు పంపడంలేదని తెలుస్తోంది. అదే విధంగా మహారాష్ట్ర,కర్ణాటక, చత్తీస్‌గడ్‌లో తమిళనాడు,కేరళలో వరిపంట దిగుబడి పెరడంతో తెలంగాణ బాయిల్డ్‌రైస్‌కు దేశంలో డిమాండ్ తగ్గింది. దీనితో సిఎంఆర్ బియ్యం సేకరణ గడువు ముగిసినా మళ్లీ పెంచకుండా బియ్యం తీసుకోకుండా మోకాలడ్డు పెడుతున్నారని వ్యాపారులు అంటున్నారు.

# పట్టణ అభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం

## అచ్చంపేటలో నూతన మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభించిన మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకట్ స్వామి అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, పట్టణాలు గ్రామాల అభివృద్ధికి బాటలు వేసేలా కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో రూ.3 కోట్ల నిధులతో అత్యధిక అంగులతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నాగర్‌కర్నూల్ శాసన సభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణలు, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లతో కలిసి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖల మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలోని అత్యంత సుందరమైన భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఇలాంటి మున్సిపాలిటీ భవనాన్ని ఎక్కడ చూడలేదని మంత్రి తెలిపారు. ఇంతటి గొప్ప భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ నిర్మాణానికి ప్రత్యేక కృషి చేయడంతోనే భవనం సుందరంగా రూపుదిద్దుకుందని మంత్రి ఎమ్మెల్యేను అభినందించారు. మున్సిపాలిటీ పరిధిలో చెత్త సకాలంలో తొలగింపు, కాలువల శుభ్రత, తాగునీటి సరఫరాలో వ్యత్యాసాలు లేకుండా చూసేలా సంబంధిత శాఖల అధికారులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి నివాసానికి శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువలు, డ్రైనేజీలు క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, ఇబ్బందులు ఎదురవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిత్య పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన మున్సిపల్ కౌన్సిలర్లకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, కార్మికులు, తదితర వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకొని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఇవి సామాజిక, ఆర్థిక ప్రగతికి తోడ్పడుతున్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వము ఇచ్చిన 6 గ్యారెంటీలను తప్పక అమలు చేస్తామని, ఇందులో భాగంగా ఒక్కొక్కటిగా నిరంతరంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఇచ్చిన వాగ్దానంతో అర్హులైన అందరికీ పథకాలు అందిస్తూ ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ కార్యక్రమాలు చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థను మెరుపరుస్తూన్నామన్నారు. ప్రతి ఒక్కరికి కడుపునిండా తిండి పెట్టాలనే ఉద్దేశంతో ఆహార భద్రత చట్టం తీసుకురావడం జరిగిందని, గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వల్ల నిరుపేదలు కడుపునిండా తిండి తినలేక పోవడానికి గ్రహించి నేటి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారని అన్నారు. మన రాష్ట్రంలో పండించిన సన్న వడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వడమే కాకుండా ఇక్కడ పండించిన సన్న బియ్యాన్ని ధనవంతుడు తింటున్న విధంగానే పేదలు తినాలన్న ఉద్దేశంతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని వివరించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా పేదలకు 5 లక్షలతో ఒక్కో ఇంటిని నిర్మిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున పేద ప్రజల సొంత ఇంటి కలను రాష్ట్ర ప్రభుత్వం సహకారం చేస్తుందని మంత్రి తెలిపారు. రైతులకు రైతు భరోసా,రుణమాఫీ చేశామని తెలిపారు. గృహ జ్యోతి పథకం, గ్యాస్ పథకం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఎక్కడ కూడా రాజీ పడకుండా అర్హులను గుర్తించి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

గతంలో ఎన్నడు లేని విధంగా మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చతతో ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఇన్‌చార్జి ఎస్పీ రావుల గిరిధర్, మున్సిపల్ చైర్మన్ జి.శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మురళి, స్థానిక ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమించలేదని నడిరోడ్డుపై విద్యార్థినిని కాల్చి చంపిన టీచర్

**పాట్నా, ఆగస్టు 11:** బీహార్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ పాఠశాల టీచర్ తనను ప్రేమించేందుకు నిరాకరించిందన్న అక్కసుతో 19 ఏళ్ల విద్యార్థినిని తుపాకీతో కాల్చి చంపాడు. ఈ కిరాతక ఘటన బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజాగ్రహం కట్టలు తెంచుకోవడంతో స్థానికులు ఓ ప్రైవేట్ పాఠశాలకు నిప్పు పెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పర్సా పంచాయతీకి చెందిన వినయ్ కుమార్ కుమార్తె గుడియా కుమారి (19), బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) పరీక్షలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో సోమవారం బహేరి బ్లాక్‌లోని కోచింగ్ సెంటర్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా శివాజీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొథియాన్ గ్రామం వద్ద ఈ దారుణం జరిగింది. నలందా జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ టీచర్, గుడియాను కొంతకాలంగా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. ఆమె దీనికి అంగీకరించకపోవడంతో పథకం ప్రకారం దాడికి పాల్పడ్డాడు. కోచింగ్ నుంచి వస్తున్న గుడియాను అడ్డగించి, తుపాకీతో కాల్చడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. నేరం చేసిన వెంటనే నిందితుడు ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. నిందితుడు పనిచేస్తున్న ప్రైవేట్ పాఠశాలకు నిప్పు పెట్టారు. అనంతరం సింఘియాబహేరిదర్భంగా ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేయాలని, ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. గతంలోనే నిందితుడు తమ కుమార్తెను బెదిరించాడని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని వారు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న రోసెరా డీఎస్పీ, ఇతర పోలీసు అధికారులు ఆందోళనకారులను శాంతింపజేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించాం. మృతురాలి కుటుంబం నుంచి ఫిర్యాదు అందగానే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం. ప్రాథమిక విచారణలో ఇది ఏకపక్ష ప్రేమ వ్యవహారమేనని తేలింది. పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాం. త్వరలోనే అతడిని పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని రోసెరా రేంజ్ ఎస్డీపీఓ తెలిపారు.

# ఈసిం పేరిట సైబర్ నేరగాళ్ల నయా మోసం

## సిం కార్డు బ్లాక్ అవుతుందని బెదిరించి, ఈసింలోకి మార్పించి ఖాతాలు ఖాళీ చేస్తున్న కేటుగాళ్లు

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు రోజుకో తరహాలో నేరాలకు పాల్పడుతుండడం పోలీసులకు సైతం అంతు చిక్కడం లేదు. ఇప్పటి వరకు బహుమతులు, మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ లతో పాటు డిజిటల్ అరెస్టుల వరకు అమాయకులను బెదిరించి వారి ఖాతాలను ఖాళీ చేసి న ఈ నేరగాళ్లు తాజాగా ఈసిం మోసాలకు తెరలేపారు.

కొన్ని నిమిషాల పాటు సిం కార్డులను బ్లాక్ చేయ డం ద్వారా తాము ఎంచుకున్న వ్యక్తుల ఖాతాలను ఖాళీ చేయడం సైబర్ నేరగాళ్ల కొత్త తరహా నేరం గా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు. ఇంతకు ఈ తరహా మోసం ఎలా జరుగు తుందంటే సైబర్ నేరగాళ్లు మొదట తమను తాము కస్టమర్ కేర్ ప్రతినిధులుగా చెప్పుకుంటారు. మీ సిం కార్డు సరిగ్గా పనిచేయడం లేద ని, దీనిని 24 గంటల్లో బ్లాక్ చేస్తామని మెసేజ్‌లు పంపుతారు. అనం తరం వెంటనే మీ సిం కార్డును ఈ సింలోకి మార్చుకోండి అంటూ కొన్ని సూచనలు చేస్తూ ఓటిపిలు అడుగడం లేదా కోడ్‌ను షేర్ చేసి దీనికి టిక్ చేయమని చెబుతారు. ఇంకొన్నిసార్లు మీకు ఒక లింక్ లేదా ఎపికె ఫైల్‌ను పంపి, దానిని డౌన్‌లోడ్ చేయమని కోరుతారు. దీనిని వెంటనే ఇన్‌స్టాల్ చేస్తే వి నియోగదారుల ఫోన్లలో వున్న ముఖ్యమైన డేటా, బ్యాంకుల ఖాతా ల వివరాలు, పాస్‌వర్డ్‌లు అన్నీ సైబర్ నేరగాళ్లకు తెలిసిపోతాయి. దీని తరువాత సెల్‌ఫోన్ వినియోగదారుల మొబైల్ నంబర్‌లోని ఈ సిం యాక్టివేట్ చేసి, అసలు సింను పని చేయకుండా చేస్తారు. ఈ విషయాలు తెలియని సెల్‌ఫోన్ వినియోగదారులు సైబర్ నేరగాళ్ల చెప్పినట్లు చేయగానే క్షణాల్లో బ్యాంకుల్లోని ఖాతాలో గల డబ్బులు ఖాళీ అవుతున్నాయి. ఈ తరహా నేరాలు దేశ వ్యాప్తంగా 50 వరకు జరగగా హైదరాబాద్‌లో ఐదు చోట్ల జరిగి నట్లు పిర్యాదులు అందాయి. ఈ తరహా నేరాల్లో సైబర్ నేరగాళ్ల మొదట సెల్‌ఫోన్ విని యోగదారుల ఫోన్‌లను తమ నియంత్రణలోకి తీసుకుంటా రు. దీని తరువాత వారి బ్యాంకు ఖాతాలలోని డబ్బులను కాజేసేందుకు ఓటిపిలను వాడతారు.

కాగా ఈ తరహా మోసాలను నివారించేందుకు సెల్ ఫోన్ వినియోగదారులు ఈసిం పేరిట వచ్చే కాల్స్ కు స్పందించవద్దని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు. నిజంగానే సిం కార్డుల్లో సమస్యలు వుంటే నేరుగా నెట్ వర్క్ ప్రొవైడర్ నిర్వాహకులతో మాట్లాడలని, సెల్‌ఫోన్‌లకు అపరిచితుల నుంచి వచ్చే ఓటిపిలకు స్పందించవద్దని సైబ ర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కోరుతున్నారు. ఇక టెలికాం సంస్థలు తమ ఖాతాదారులను ఇలాంటి ప్రశ్నలు వేయదని, మెసేజ్‌లు, యాప్‌లు ప ంపి డౌన్‌లోడ్ చేసుకోమని కోరదని వారంటు న్నారు.

ఒకవేళ నిజంగానే సిం కార్డులు పనిచేయకుంటే సంబంధిత కంపెనీల అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిం చుకోవాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు. ఎక్కడైనా అనుమానం వచ్చినా మోసం జరిగినట్లు అనిపిం చినా వెంటనే సంబంధిత కంపెనీ ప్రొవైడ ర్లకు ఫిర్యాదు చేయాలని లేదా సంచార్ సాథీ పోర్టల్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు చెబుతు న్నారు. దీంతో పాటు 1930కు కూడా ఫిర్యాదు చేయవచ్చని వారు తెలిపారు.

# సగం ప్రపంచాన్ని తీసుకుపోతాం

## పాక్ ఆర్మీచీఫ్ ఆసిమ్‌మునీర్ ప్రేలాపనలు

### అణుబెదిరింపులు దాయాదికి మామూలే: భారత్ విదేశాంగశాఖ



**ఫ్లోరిడా, ఆగస్టు 11:** ఆపరేషన్ సిందూర్‌తో భారత్ చేత చావుదెబ్బ తిన్నప్పటికీ దాయాది పాకిస్థాన్ తీరులో ఎలాంటి మార్పు లేదు. తాజాగా పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన భారత్‌పై నోరు పారేసుకున్నారు. తమది అణ్వాయుధ దేశమని, అవసరమైతే అణుయుద్ధానికి దిగుతామంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగారు. తాము నాశనమైతే తమతోపాటు సగం ప్రపంచాన్ని తీసుకెళ్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫ్లోరిడాలోని టాంపాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మునీర్ ప్రసం గించారు. ఈ సందర్భంగా సింధునది వివాదాన్ని ప్రస్తావిస్తూ.. భారత్‌పై నోరుపారేసుకున్నారు. సింధు నది భారతీయుల ఆస్తిఏమీ కాదంటూ వ్యాఖ్యానించారు. ఆ నదిపై భారత్ డ్యామ్‌లు నిర్మించే వరకు ఎదురు చూస్తామని చెప్పారు. తమ వద్ద క్షిపణులకు ఎలాంటి కొదవ లేదని, ఆ డ్యామ్‌లను పది క్షిపణులతో పేల్చేస్తామని హెచ్చరించారు. భారత్ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఏర్పడితే, తాము నాశనం అవుతూనే సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కాగా, అసిం మునీర్ యూఎస్ సందర్శనకు వెళ్లడం రెండు నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈఏడాది జూన్‌లో అసిం మునీర్ అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రంప్ వైట్ హౌస్‌లో మునీర్‌కు ప్రత్యేకంగా విందు కూడా ఇచ్చారు. ప్రతీకార సుంకాల నేపథ్యంలో భారత్‌అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో వాషింగ్టన్‌తో పాకిస్థాన్ సంబంధాలు బలపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది . ఇదిలా ఉంటే ఆసిమ్‌మునీర్ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఆదేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జాతీయ సమాజం అర్థంచేసుకోవాలని తకోరింది. పాక్ అణ్వాయుధాలపై ఎవరి నియంత్రణ ఉందో దీన్నిబట్టి స్పష్టం అవుతున్నదని, అక్కడ సైన్యం, ఉగ్రముఠాలతో చేతులు కలిపిందని, అమెరికా గడ్డపై మునీర్ ఈ వ్యాఖ్యలుచేయడం శోచనీయమని ఖండించింది. ఇలాంటి అణుబెదిరిం పులకు భారత్ భయపడదని దేశభద్రతకోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడేది లేదని భారత విదేశాంగశాఖప్రకటించింది.

# ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు భారత్ కట్టుబడి ఉంది

## జెలెన్‌స్కీతో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు భారత్ కట్టుబడి ఉందని ఆ దేశాధ్యక్షుడు జెలెన్ స్కీకి ప్రధాని నరేంద్ర మోడీ పునరుద్ఘాటించారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతియుత పరిష్కారానికి భారత్ తన వంతు మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అలాగే భారత్ అందిస్తున్న సహకారం కొనసాగుతోందని ఈ సందర్భంగా జెలెన్‌స్కీకి ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. సోమవారం ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు జెలెన్ స్కీకి ప్రధాని మోడీఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వీరిద్దరు పలు కీలక అంశాలపై చర్చించారు. ఆ క్రమంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యంపై వీరు సమీక్షించారు. పరస్పర ప్రయోజనాల సహకారం పెంపు మార్గాలపై ఈ సందర్భంగా వారు చర్చించారు. భవిష్యత్తులో సైతం సంప్రదింపులు కొనసాగించాలని వీరిద్దరు నిర్ణయించారు. ఉక్రెయిన్ లక్ష్యంగా రష్యా జరుపుతున్న దాడులను ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఆ దేశాధ్యక్షుడు వివరించారు. జాపోరిజ్జియా బస్టాండ్‌పై రష్యా బీకర బాంబుల దాడికి తెగ బడిందని తెలిపారు. ఈ దాడిలో పదుల సంఖ్యలో ప్రజలు తీవ్రంగా గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరుదేశాల మధ్య శాంతి కోసం దౌత్యపరమైన అవకాశాలు కొనసాగుతాయని చెప్పారు. అయితే రష్యా దురాక్రమణతోపాటు అక్రమణలు కొనసాగుతోన్నాయని మండిపడ్డారు. దీంతో కాల్పుల విరమణకు అంగీకరించేది లేదని ప్రధాని మోదీకి ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు జెలెన్ స్కీ కుండబద్దలు కొట్టారు. ఉక్రెయిన్‌కు మద్దతు తెలపడం పట్ల ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితిలో సాధారణ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరయ్యే క్రమంలో ఇరువురు వ్యక్తిగతంగా భేటీ కావాలని వారు నిర్ణయించారు. ఈ భేటీలో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలను మెరుగు పరుచుకునేందుకు ఉపయోగపడతాయని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. అంతేకాకుండా.. ఈ సమావేశం ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక చర్చలు, శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటాయని వీరు పేర్కొన్నారు.

# వీధికుక్కలను వెంటనే షెల్టర్లకు తరలించండి

## ఢిల్లీలో వీధికుక్కల బెడదపై సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** దేశరాజధాని ఢిల్లీలో వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోని నివాస ప్రాంతాల నుంచి వీధి కుక్కలన్నింటినీ వెంటనే పట్టుకుని, ప్రత్యేక షెల్టర్లకు తరలించాలని సోమవారం స్పష్టం చేసింది. ఈ ప్రక్రియకు ఎవరైనా అడ్డుతగిలితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని, కోర్టు ధిక్కరణగా పరిగణిస్తామని హెచ్చరించింది. పెరిగిపోతున్న కుక్కకాటు ఘటనలు, రేబిస్ మరణాలపై వచ్చిన వార్తలను సుమోటోగా స్వీకరించిన జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. ఇది ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విషయం. ఇందులో ఎలాంటి భావోద్వేగాలకు తావులేదు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వీధి కుక్కల సమస్యపై కేవలం కేంద్ర ప్రభుత్వం వాదనలు మాత్రమే వింటామని, జంతు ప్రేమికులు లేదా ఇతర సంస్థల పిటిషన్లను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని మున్సిపల్ అధికారులు తక్షణమే ప్రత్యేక డాగ్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. కుక్కలను పట్టుకోవడం, స్టెరిలైజేషన్, టీకాలు వేయడంలో శిక్షణ పొందిన సిబ్బందిని నియమించాలని సూచించింది. షెల్టర్ల నుంచి కుక్కలు తప్పించుకోకుండా సీసీటీవీలు ఏర్పాటు చేయాలని, కుక్కకాటు ఘటనలపై ఫిర్యాదుల కోసం వెంటనే హెల్ప్‌లైన్ ప్రారంభించాలని స్పష్టం చేసింది. అవసరమైతే ఈ పని కోసం ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది. గతంలో కుక్కల తరలింపు కోసం ఒక స్థలాన్ని గుర్తించగా, జంతు హక్కుల కార్యకర్తలు స్టే ఆర్డర్ తెచ్చారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. కొంతమంది జంతు ప్రేమికుల కోసం మన పిల్లలను బలివ్వలేమని వ్యాఖ్యానించింది. తరలింపును అడ్డుకునే ఉద్దేశంతో వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి కూడా అనుమతించేది లేదని తేల్చి చెప్పింది. షెల్టర్లకు తరలించిన ఏ ఒక్క కుక్కను కూడా తిరిగి వీధుల్లోకి వదలకూడదని, ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కోర్టు హెచ్చరించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య ఢిల్లీలో 49 రేబిస్ కేసులు, 35,198 కుక్కకాటు ఘటనలు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. పరిస్థితి తీవ్రంగా ఉందని, తక్షణ చర్యలు అత్యవసరమని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ఎంపిలకోసం 184 బహుళ అంతస్తుల ఫ్లాట్‌లు ప్రారంభించిన మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** పార్లమెంటు సభ్యుల కోసం ఢిల్లీలోని బాబా ఖరక్‌సింగ్ మార్గ్‌లో కొత్తగా నిర్మించిన 184 టైప్–8 బహుళ అంతస్తుల ఫ్లాట్‌లను ప్రధాని మోడీ సోమవారం ప్రారంభించారు. ఎంపిలకు గృహాల కొరతను తీర్చడం, వారికిఆధునిక పర్యావరణ అనుకూల నివాసాలను అందించడమే లక్ష్యంగా టైప్–8 బహుళ అంతస్తుల ఫ్లాట్‌లను నిర్మించారు. ప్రారంభోత్స వంలో భాగంగా ఆగృహాలప్రాంగణంలో ప్రధానిమోడీ సిందూరపువ్వు మొక్కను నాటారు. నిర్మాణంలో పాల్గొన్న శ్రమజీవులతో మాట్లాడారు. ఎంపిలకు, ఇటు అధికారిక అవసరాలకు ఉపయోగపడేవిధంగా ఆధునిక వసతులతో నిర్మించారు. రాజధానిలో పరిమిత స్థాయిలో భూమి లభ్యతకా రణంగా ఈ టైప్–8 తరహా గృహాలను నిర్మించారు. దీర్ఘకాలిక నిర్వహణ ఖర్చులు తగ్గించేందుకు భూ వినియోగాన్ని గరిష్టస్థాయికి పెంచేందుకు ఈ విధానంలో గృహాలునిర్మించారు. ప్రతిఫ్లాట్‌షుమారు ఐదువేల చదరపు అడు గుల విస్తీర్ణంలో ఉంది. కార్యాలయాలు, సిబ్బంది వసతి, నివాస ప్రయోజ నాలకోసం ప్రత్యేక విభాగాలు ఉఅన్నాయి. కొత్తఫ్లాట్‌లు ప్రభుత్వ గృహాల అగ్రకేటగిరీలోకి వచ్చే టైప్–8 బంగ్లాలకంటే మరింత విశాలంగా ఉన్నాయి. ఈ భవన ప్రాంగణంలోనే ఒక కమ్యూనిటీసెంటర్‌కూడా ఉంది. ఎంపిల ఇళ్లల్లోజరిగే వేడుకలకు కేంద్రంగా ఈ సెంటర్‌ను వినియోగించు కోవచ్చు. పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, ప్రభావవంతమైన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ తదితర సదుపాయాలు ఈభవన సముదాయంలో ఉన్నా యి. ఈ బహుళ అంతస్తులభవనాలు అల్యూమినియం షట్టరింగ్‌తో ఏకశిలా కాంక్రీ టును ఉపయోగించి నిర్మించారు. అన్ని భవనాలు ఆధునిక నిర్మాణ నిబంధ నలకు అనుగుణంగా ఉన్నాయి. భూకంప నిరోధకతను కలిగి ఉండేలా నిర్మిం చారు. ఎంపీల భద్రతకోసం బలమైన భద్రతా వ్యవస్థను కూడా ఏర్పాటుచేసారు.


# జైళ్లు రాహుల్ సంకల్పాన్ని అణచివేయలేవు

## అరెస్ట్‌ను ఖండించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు11:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఓట్ల జాబితా సవరణకు నిరసనగా ఓటు చోరి నినాదంతో కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో విపక్ష పార్టీల నేతలు చేపట్టిన మార్చ్ టెన్షన్ వాతావరణాన్ని క్రియేట్ చేసింది. ఢిల్లీ పోలీసులు రాహుల్ గాంధీ,ప్రియాంకగాంధీ,ఇతర ఎంపీలను అరెస్ట్ చేసి ప్రత్యేక బస్సులో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలోనే వారి అరెస్ట్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. ఓట్ల చోరీని అడ్డుకోవాలని పోరాటం చేస్తున్న కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, విపక్ష ఎంపీలను ఢిల్లీలో పోలీసులు అదుపులోనికి తీసుకోవ డాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యయుతంగా ఈసీఆఫీసుకు ర్యాలీ చేస్తున్న నేతలను అమానవీయంగా అడ్డుకోవటం దుర్మార్గమైన చర్య అని ముఖ్యమంత్రి మండిపడ్డారు.జైళ్లు రాహుల్ గాంధీ సంకల్పాన్ని అణచివేయలేవని, విపక్ష సభ్యులను నోళ్లను మూయించలేవని ట్వీట్ చేశారు.

# మస్తుంగ్‌జిల్లాలో పట్టాలు తప్పిన జాఫర్ ఎక్స్‌ప్రెస్

## ప్రయాణీకులను క్వెట్టాకు తరలించిన అధికారులు



**క్వెట్టా, ఆగస్టు 11:** పాకిస్థాన్ బలూచిస్తాన్ లోని మస్తుంగ్ జిల్లాలో జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఆరు బోగీలు పట్టాలు తప్పాయి.రైల్వే ట్రాక్‌పై బాంబు పేలుడు కారణంగా ఈ ఘటన జరిగింది.అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్‌కు అమర్చిన బాంబు పేలడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కి చెందిన ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. కానీ ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని పాకిస్తాన్ రైల్వేస్ క్వెట్టా డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి మహ్మద్ కాషిఫ్ చెప్పారు. రైలులో 350 మంది ప్రయాణికులున్నారు. మస్తుంగ్ జిల్లా దష్ట్ తహసీల్‌లోని స్పెజాండ్ స్టేషన్ సమీపంలో ఈ ఘటన జరిగింది.క్వెట్టా నుంచి పేషావర్ సిటీ స్టేషన్ వైపు వెళ్తున్న రైలులో 350 మంది ప్రయాణికులు ఉన్నారు. ఘటన గురించి సమాచారం అందిన వెంటనే భద్రతా బలగాలు, రక్షణ బృందాలు అక్కడికి చేరుకుని, ప్రాంతాన్ని ముట్టడి చేసి శోధన చర్యలు ప్రారంభించాయని కాషిఫ్ వివరించారు. అలాగే జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కి చెందిన నాలుగు బోగీలు తిరిగి పట్టాలపై అమర్చాం. మిగతా రెండు బోగీలను కూడా పునరుద్ధరించడానికి పనులు కొనసాగుతున్నాయన్నారు. 350మంది ప్రయాణికులను క్వెట్టాకు తిరిగి తరలించారు. ఈఘటన తరువాత పాకిస్తాన్ రైల్వేస్ ఒక సహాయ రైలు నడిపి అందరినీ క్వెట్టాకు తీసుకువచ్చింది. ట్రాక్‌పై ఇరుక్కుపోయిన బోగీలను కూడా నగరానికి తిరిగి తీసుకువస్తామని,అందరికీ టికెట్ డబ్బులు తిరిగి ఇస్తామని కాషిఫ్ మరో ప్రకటనలో చెప్పారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్,బోలాన్ మెయిల్ రైళ్ల సేవలను ఆగస్టు 14వరకు రద్దు చేస్తున్నట్లు పాకిస్తాన్ రైల్వేస్ ప్రకటించింది. బోలాన్ మెయిల్ రైలు ఆగస్టు 16న కరాచీ నుండి బయలుదేరి, మరుసటి రోజు క్వెట్టాకు చేరుకుంటుందని తెలిపారు. ఈఘటనకు మూడురోజుల క్రితం కూడా బలూచిస్తాన్‌లోని సిబి ప్రాంతంలో క్వెట్టా వైపు వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కి పెద్ద ప్రమాదం తప్పింది. రైల్వే ట్రాక్ పక్కన అమర్చిన బాంబు,రైలు దాటిన క్షణాలకే పేలిపోయిందని పాక్ పత్రికలు ప్రచురించాయి.

# ఎర్రవల్లిలో కెసిఆర్ కీలక సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు11:** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్ర వల్లి గ్రామంలోని మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో సోమవారం బీసీ సభపై కీలక సమావేశం జరి గింది. ఈ సమావేశానికి కెటిఆర్, హరీశ్‌రావు, బిఆర్ఎస్ సీనియర్ నేత వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఈనెల 14న జరగబోయే బీసీ సభ ఏర్పాట్లపై, సభ విజయవంతం కావడానికి చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. తాజా రాజకీయ పరిణామాలు,.స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షించినట్లు సమాచారం.

# త్వరలో కొత్త ఫిల్మ్ పాలసీ

## ఈ యేడాది నంది అవార్డులు ఇస్తాం, నిర్మాతలతో భేటీలో ఎపి మంత్రి దుర్గేష్ వెల్లడి

**విజయవాడ,ఆగస్టు11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, త్వరలోనే సమగ్రమైన నూతన ఫిల్మ్ పాలసీని తెస్తామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. సోమవారం వెలగపూడి సెక్రటేరియట్‌లోని రెండవ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ మేరకు మంత్రి కందుల దుర్గేష్‌తో సినీ నిర్మాతలు భేటీ అయ్యారు. సినిమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలతో రూపొందించిన డాక్యుమెంట్‌ని నిర్మాతలు మంత్రి కందుల దుర్గేష్‌కు అందించారు. సినిమా పరిశ్రమ సమస్యలు, 24 విభాగాల అభి వృద్ధిపై సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లతో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి దుర్గేష్‌ను నిర్మాతలు అభ్య ర్థించారు. ఈ సందర్భంగా సినిమా షూటింగ్‌లు, కొత్త సినిమా విడుదల, నూతన ఫిల్మ్ పాలసీ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సెప్టెం బర్ మొదటి లేదా రెండోవారంలో సిఎం, డిప్యూటీ సిఎంలతో సమావేశం ఏర్పాటు చేయిస్తా నని హామీఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తర ఫున ఏ సహకారం కావాలని కోరుకుంటున్నారు, చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అధ్యయనం చేసి సరైన ప్రతిపాదనలతో రావాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారం, చేస్తున్న కృషిని సినీ నిర్మాతలు అభినందించిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించామన్నారు. రాష్ట్రంలో స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్ థియేటర్లు, రీ రికార్డింగ్ థియేటర్లు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటు అంశంలో ముందుకు వస్తే ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. ఈ అంశంపై త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటుచేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. నిర్మాతలు సూచించిన సలహాలు, సూచనలు సిఎం, డిప్యూటీ సిఎంల దృష్టికి తీసుకెళ్లడానికి ఈ సమావేశం తొలి మెట్టుగా భావిస్తున్నామన్నారు. నంది అవార్డులు, నంది నాటకోత్సవాల విషయంలో సిఎం చంద్రబాబునాయుడు స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పష్టమైన సూచనలు చేశారన్నారు.

# మంత్రిపదవినుంచి తప్పకున్న రాజన్న

## సీఎంకు హైకమాండ్‌ఫోన్‌తో రాజీనామా

**బెంగళూరు, ఆగస్టు 11:** కర్ణాటక సహకార మంత్రి, ముఖ్యమంత్రి మద్దతుదారుడైన కేఎన్ రాజన్న తన పదవినుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఓటర్ల జాబితా సవరణలపై సొంతపార్టీపైనే ఆయన చేసిన విమర్శలకుగాను పార్టీ సీరియస్ అయింది. ఎఐసిసి సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి కెసి వేణుగోపాల్ సీఎం సిద్ధరామయ్యతో మాట్లాడిన వెనువెంటనే మంత్రిపదవి నుంచి రాజన్నను తప్పించారు. అయితే రాజన్న మాత్రం రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సమర్పించానని ప్రకటించారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మద్దదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో ఆయన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఓట్ల చోరీ అంశంపై సొంత పార్టీపై ఆయన విమర్శలు గుప్పించడంతో పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. గతవారంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ బెంగళూరులో ర్యాలీ నిర్వహించిన విషయం తెలిసిందే.ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాతంతో వ్యవహరిస్తోందని.. బెంగళూరు సెంట్రల్ వంటి కీలక నియోజకవర్గాల్లో పార్టీ ఓటమికి ఓట్ల చోరీయే కారణమని ఆరోపించారు. అయితే, ఈ వ్యాఖ్యలపై రాజన్న కీలక వ్యాఖ్యలు చేశారు. మన సొంత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓటర్ల జాబితాలను సవరించారని గుర్తుంచుకోవాలని ఆ సమయంలో పార్టీ ఎందుకు కళ్లు మూసుకుందని ఆయన ప్రశ్నించారు.

# 'వార్ 2'తో అభిమానులు కాలర్ ఎత్తుకునేట్లుచేస్తా : ఎన్‌టిఆర్



'వార్ 2 తో మళ్లీ అభిమానుల్ని రెండు కాలర్స్ ఎత్తుకునేలా చేస్తాను.. బొమ్మ అదిరిపోయింది. పండుగ చేసుకోండి. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ తారక్ మీకు (అభిమానులు) అన్న నాకు తమ్ముడు.. మనమంతా ఓ కుటుంబం.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హృతిక్ రోషన్ఇండియన్ ఐకానిక్ స్టార్స్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ కాంబోలో (యశ్ రాజ్ ఫిల్మ్స్) బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మాతగా అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వార్ 2. ఈ మూవీలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను ఆగస్ట్ 14న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మూవీని తెలుగులోకి సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద నాగవంశీ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పాటలు, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా అభిమానుల్లో అంచనాలు పెంచేశాయి. చిత్రం విడుదల తేదీ దగ్గర పడుతున్న క్రమంలో) నాడు భారీ ఎత్తున ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో..మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ మాట్లాడుతూ,అభిమానులతో ఇలా కలిసి సెలెబ్రేట్ చేసుకునేలా చేసిన మా వంశీకి థాంక్స్. బాద్ షా ఫంక్షన్‌లో వరంగల్‌కు చెందిన అభిమాని చనిపోయారు. అప్పటి నుంచి ఇలా పబ్లిక్ ఫంక్షన్‌లకు కాస్త దూరంగా ఉంటూ వచ్చాను. నా 25 ఏళ్ల సినీ జర్నీని సెలెబ్రేట్ చేయాలని నన్ను ఫోర్స్ చేసిన వంశీకి, వంశీని ఫోర్స్ చేసిన అభిమానులకు ధన్యవాదాలు. 'వార్ 2 చేయడానికి ప్రధానం కారణం ఆదిత్య చోప్రా. 'వార్ 2 చేయాల్సిందే అని నన్ను వెంటపడిన ఆదిత్య చోప్రాకి,అభిమానులు గర్వపడేలా చేస్తాను ఆదిత్య చోప్రా నాకు భరోసానిచ్చారు. నన్ను ఇందులో భాగం చేసిన యశ్ రాజ్ ఫిల్మ్స్ టీంకు థాంక్స్. . మళ్లీ టీంతో పని చేయాలనిఅనుకుంటున్నాను.'బ్రహ్మాస్త్ర'ఈవెంట్‌కు నేను రావాల్సింది. కానీ అప్పుడు కుదరలేదు. కానీ ఇప్పుడు ఆయన దర్శకుడిగా, నేను హీరోగా ఇక్కడకు వచ్చాం.'వార్ 2 అయాన్ మాత్రమే తెరకెక్కించగలడు అని ఆగస్ట్ 14న అందరికీ తెలుస్తుంది. విశ్వ విఖ్యాత నట సార్వ భౌమ, నటరత్న, పద్మశ్రీ డా. నందమూరి తారక రామారావు ఆశీస్సులు నా మీద ఉన్నంత కాలం నన్ను ఎవ్వరూ ఆపలేరు. అభిమానులకు ఎంత చేసినా, ఏం చేసినా రుణం తీర్చుకోలేను. కొడుకుగా మా నాన్న జన్మను ఇచ్చినా.. నా ఈ జన్మ మాత్రం అభిమానులకే అంకితం. అభిమానుల ప్రేమే నాకు చాలు. అభిమానుల్ని గర్వపడేలా చేసేందుకే ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాను. ఈ 25 ఏళ్ల ప్రయాణంలో నా వెన్నంటే ఉన్న అభిమానులకు శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తున్నా. దేవుడి ఆశీస్సులతో ఇంకొన్నేళ్లు మనం ఇలానే కలిసి ముందుకు వెళ్దాం.'వార్ 2తో మళ్లీ అభిమానుల్ని రెండు కాలర్స్ ఎత్తుకునేలా చేస్తాను'వార్ 2 లో డ్యాన్సులు, ఫైట్స్ అదిరిపోయాయి. కావాల్సిన అన్ని అంశాలుంటాయి.'వార్ 2 హిందీ సినిమా మాత్రమే కాదు.. తెలుగు సినిమా కూడా. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ మాట్లాడుతూ, తారక్ మీకు,అన్న.. నాకు తమ్ముడు.. మనమంతా ఓ కుటుంబం. అభిమానుల్ని ఇలా ఇక్కడ చూస్తుండటం ఆనందంగా ఉంది. క్రిష్ మూవీని ఇక్కడ షూట్ చేశాం. తెలుగు వాళ్లు నా మీద ఎంతో ప్రేమను చూపిస్తుంటారు.'వార్ 2 రావడానికి ఇంకా నాలుగు రోజుల సమయం ఉంది. యుద్దానికి రెడీగా ఉన్నారా?.. తారక్, నేను సహ నటులుగా జర్నీని స్టార్ట్ చేశాం.. ఈ పాత్రను పోషించడం నాకు ఆనందంగా, గర్వంగా ఉంది. ఈ సారి మరింత ఇంటెన్స్, డ్రామా ఉంటుంది. తారక్ ఈ ప్రాజెక్ట్‌లోకి రావడంతో మరింత స్పెషల్‌గా మారింది,ఆయన్నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. సెట్‌కు, షాట్‌కు వంద శాతం కాన్ఫిడెన్స్‌తో వెళ్లేవారు. ఆయన ఎప్పుడూ కూడా షాట్‌ను చెక్ చేయలేదు. నేను ఆయన నుంచి అది నేర్చుకున్నాను. తారక్ అద్భుతంగా వంట చేస్తారు. . లైఫ్ లాంగ్ ఆయన చేసిన బిర్యానీని తింటూనే ఉంటాను. మా 'వార్ 2 చిత్రం రాబోతోంది. చూసి ఎంజాయ్ చేయండిఅని అన్నారు. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ,నందమూరి తారక రామారావుతో నాది 25 ఏళ్ల ప్రయాణం. హృతిక్ నటించిన 'కహోనా ప్యార్ హై మూవీని చూసి థియేటర్లో చప్పట్లు కొట్టాను. అయాన్ తీసిన'యే దివానీ హై జవానీమూవీని డజను సార్లు చూశాను. నాగవంశీ నా కుటుంబ సభ్యుడు. ఇలాంటి వారందరినీ ఇలా కలుసుకోవడం ఆనందంగా ఉంది. ఈవెంట్లో ఇది దేవర నామ సంవత్సరం అని చెప్పాను. ఇప్పుడు హృతిక్ రామారావు నామ సంవత్సరంగా ప్రకటిద్దాం. ఇద్దరూ కలిసి డ్యాన్స్ చేస్తుంటే చూడటానికి రెండు కళ్లు చాల్లేదు. అలాంటి ఇద్దరిని పెట్టి సినిమా తీసిన అయాన్‌కు హ్యాట్సాఫ్. ట్రైలర్ చూస్తేనే మూవీ ఎలా ఉండబోతోందో అర్థం అవుతోంది. వినాయక చవితి పండుగ కంటే వారం ముందే 'వార్ 2 రాబోతోంది. మా వంశీ, అయాన్, యశ్ రాజ్ ఫిల్మ్స్‌కి పెద్ద విజయం దక్కాలి. వార్ 2 ని అందరూ చూడండి అని అన్నారు.నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ,ప్రపంచ వ్యాప్తంగా ఎన్టీఆర్ పేరు వినిపిస్తోంది. హృతిక్ సర్‌కి టాలీవుడ్‌లోకి వెల్కమ్. అయాన్ హ్యాట్రిక్ హిట్ ఇవ్వబోతోన్నారు. అక్షయ్ తీసిన'సయారా'బ్లాక్ బస్టర్ అయింది. తారక్, హృతిక్ చేసిన పాట సరైన టైంలో వస్తుంది. అభిమానులు పేపర్లు రెడీ చేసుకుని పెట్టుకోండి. ఆగస్ట్ 14 కోసం మేమంతా ఎదురుచూస్తున్నాం అని అన్నారు.నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ,'వార్ 2 ని చూస్తుంటే తారక్ అన్నని హిందీలోకి కాకుండా.. హృతిక్ ని తెలుగులోకి తీసుకు వస్తున్నట్టుగా ఉంది.'వార్ 2లో తారక్ అన్నని చూసిన తరువాత ఏ తెలుగు డైరెక్టర్ కూడా ఇంత బాగా చూపించలేదే అని అభిమానులు అనుకుంటారు.'వార్ 2 కంటే పదింతలు ఎక్కువ ఓపెనింగ్స్‌ను అభిమానులు ఇవ్వాలి.

హిందీలో డే వన్ నెట్ కంటే మనం ఎక్కువ ఇవ్వాలి. 'వార్ 2 సినిమా అద్భుతంగా వచ్చింది. ఏ ఒక్కరూ నిరాశ చెందరు. చిత్ర దర్శకుడు అయాన్ ముఖర్జీ మాట్లాడుతూ,హృతిక్ సర్, ఎన్టీఆర్ సర్‌లతో పని చేయడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇది నాకు దక్కిన గౌరవం. 'వార్ 2 జర్నీలో భాగం అవ్వడం నా అదృష్టం.'వార్ 2ని చూసిన తరువాత అందరూ సర్ ప్రైజ్ అవుతారు. మేం హృతిక్ సర్, ఎన్టీఆర్ సర్‌లను తెరపై అద్భుతంగా చూపించాలని ఈ రెండేళ్లు మేం చాలా కష్టపడ్డాం. 'వార్ 2'వార్ 2 మధ్య ఉన్న తేడా ఆగస్ట్ 14న మీకు తెలుస్తుంది. ఇద్దరి హీరోల్ని అద్భుతంగా చూపించాం. ఎన్టీఆర్ వర్సెస్ హృతిక్, హృతిక్ వర్సెస్ ఎన్టీఆర్ అన్నట్టుగా ఉంటుంది. ఈ చిత్రం కోసం మేం అంతా కూడా ఎంతో కష్టపడ్డాం. మా సినిమా చూసి ఆడియెన్స్ అంతా సర్ ప్రైజ్ అవుతారు అని అన్నారు.

# రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర్ణ



'మాస్ జాతర' టీజర్ మాస్ అంశాలు, వినోదం మేళ వింపుతో ఆకట్టుకుంటున్న 'మాస్‌జాతర్ణ టీజర్‌ఆగస్టు 27న థియేటర్లలో మాస్‌పండుగ మాస్ మహారాజారవితేజకథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం మాస్ జాతర. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్‌సినిమాస్‌పతాకాలపైసూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ఆగస్టు 27న విడుదలకానున్నమాస్ జాతరకోసంఅందరూ ఎంతగానో ఎదురు చూస్తున్నారు.ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు ఆకటుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్ విడుదలైంది.మాస్ మహారాజా రవితేజ అభిమానులు ఆశించే అన్ని అంశాలు 'మాస్ జాతర్ణ టీజర్ లో ఉన్నాయి. నిజానికి అభిమానులు ఆశించిన దానికంటే ఎక్కువే ఉన్నాయి. రవితేజ శైలి యాక్షన్, వింటేజ్ ఎనర్జీతో నిండిన ఫుల్ మీల్స్ మాస్ ఎంటర్టైనర్ ను చూడబోతున్నామనే హామీని టీజర్ ఇస్తోంది.మాస్ ప్రేక్షకులు మెచ్చే అంశాలతో పాటు వినోదాన్ని మేళవిస్తూ టీజర్ ను మలిచిన తీరు ఆకట్టుకుంది. అభిమానులు కోరుకునే అసలుసిసలైన మాస్ రాజా తెరపై ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. రవితేజ తనదైన చురుకుదనం, కామెడీ టైమింగ్ తో కట్టిపడేశారు. శ్రీలీల మరోసారి బలమైన పాత్రలో మెరిసిపోయారు. రవితేజ, శ్రీలీల ఎప్పుడు తెరను పంచుకున్నా అది స్వచ్ఛమైన మాయాజాలానికి హామీ ఇస్తుంది. 'మాస్ జాతర్ణ టీజర్‌లో ఈ జోడి మరోసారి మాయ చేసింది. దర్శకుడు భాను భోగవరపు మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా అసలైన పండుగ సినిమాలా మాస్ జాతరను మలుస్తున్నారు. వినాయక చవితి కానుకగా విడుదలవుతున్న ఈ చిత్రం పండుగ ఉత్సాహాన్ని మరింత పెంచనుంది. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మరోసారి రవితేజ కోసం తన అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చారు. టీజర్ లో నేపథ్య సంగీతం చాలా బాగుంది. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు కూడా అద్భుతమైన స్పందన లభించింది. ఛాయాగ్రాహకుడు విధు అయ్యన్న కెమెరా పనితనం ఆకట్టుకుంది. ఎడిటర్ నవీన్ నూలి ఎప్పటిలాగే సినిమాకి ప్రధాన బలంగా నిలుస్తున్నారు.వరుసగా ప్రేక్షకులను మెప్పించే చిత్రాలను అందించడంలో ప్రసిద్ధి చెందిన సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై'మాస్ జాతర్ణ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ నిర్మాతలు సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఎక్కడా రాజీ పడకుండా భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఆగస్టు 27న థియేటర్లలో మాస్ జాతర'మాస్ జాతర్ణ సినిమాపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. వినాయక చవితి కానుకగా ఆగస్టు 27న థియేటర్లలో అడుగు పెట్టనున్న ఈ చిత్రం.. అభిమానుల ఈలలు, గోలలతో మాస్ పండుగను తీసుకురాబోతుంది. అప్పటి వరకు ఈ టీజర్ మాస్ మహారాజా తిరిగి వచ్చాడని అందరికీ గుర్తు చేస్తుంది.

# 'స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్ణ గ్లింప్స్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల, సుధాకర్ చెరుకూరి, ఎస్ఎల్‌వి సినిమాస్ గ్లోబల్ యాక్షనర్ 'ది ప్యారడైజ్' నుంచి నాని ఫెరోషియస్ అవతార్‌లో స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్ రిలీజ్ నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ గ్లోబల్ యాక్షనర్ 'ది ప్యారడైజ్' లో ఇంతకు ముందు ఎన్నడూ చేయని ఇంటెన్స్ క్యారెక్టర్ చేస్తున్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్ పై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. రా స్టేట్మెంట్, రెండు పవర్



ఫుల్ ఫస్ట్‌లుక్ పోస్టర్లతో ఈ చిత్రం ఇప్పటికే సంచలనం సృష్టించింది. తాజాగా బిహైండ్ ది సీన్స్ 'స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్' గ్లింప్స్ ని రిలీజ్ చేశారు మేకర్స్.జైల్ బ్యాక్ డ్రాప్ లో సాగే స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్ వీడియోలో, రామోజీ ఫిలిం సిటీలో 15 రోజుల పాటు షూట్ చేసిన పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌కి ఎక్సైటింగ్ గ్లింప్స్ కనిపించాయి. కత్తులు పట్టుకున్న ఖైదీలు చుట్టుముట్టినప్పటికీ, నాని పాత్ర ఒంటరిగా, చేతిలో ఆయుధం లేకుండా, ఏమాత్రం భయపడకుండా, సీట్లో కూర్చొని ధైర్యంగా వారిని సవాలు చేస్తూ కనిపించడం అదిరిపోయింది. రెండు జడలు, ముఖం మీద గాట్లు, రఫ్ టఫ్ లుక్‌తో నాని పవర్ ఫుల్ గా కనిపించారు. చుట్టూ గందరగోళం జరుగుతున్నా, సీట్లో కూర్చొని, కత్తులు పట్టుకున్న గుంపుని కూల్‌గా గమనిండం ఫెరోషియస్‌గా వుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల బోల్డ్ విజన్‌ని ఈ వీడియో ప్రజెంట్ చేస్తోంది. క్యారెక్టర్ డిజైన్ నుంచి ప్రతి ఫ్రేమ్ వరకూ తన బ్రిలియన్స్‌ని చూపించారు. సుధాకర్ చెరుకూరి ప్రొడక్షన్ వ్యాల్యూస్ అద్భుతంగా వున్నాయి.సినిమాకి రా, రియలిస్టిక్ టోన్‌ని రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్తుంది. ప్రతి ఫ్రేమ్‌కి థ్రిల్‌ని జోడించి, పల్స్ పెంచే మ్యూజిక్ అందించారు. రాఘవ్ జుయల్ కీలక పాత్రలో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నాడు. బలమైన క్యారెక్టర్స్‌తో కూడిన కథ ప్రేక్షకులకు విజువల్ స్పెక్టకిల్‌తో పాటు స్ట్రాంగ్ కంటెంట్ అందించడానికి రెడీ అవుతోంది.'ది ప్యారడైజ్'2026 మార్చి 26న థియేటర్లలోకి రానుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ మొత్తం ఎనిమిది భాషల్లో రిలీజ్ అవుతూ ఇండియన్ సినిమాలో మోస్ట్‌అవైటెడ్ యాక్షన్ డ్రామాలలో ఒకటిగా నిలుస్తోంది.

# 'కన్యాకుమార్ణి 27న విడుదల



మధుశాలిని ప్రెజెంట్స్ రాడికల్ పిక్చర్స్ "కన్యా కుమారి" ఆగస్టు 27న థియేటర్లలో రిలీజ్ ప్రముఖనటి మధు శాలిని ప్రెజెంటర్‌గా రూరల్ లవ్ స్టోరీ "కన్యాకుమారి" చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు. రాడికల్ పిక్చర్స్ బ్యానర్‌పై సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు.ఈ చిత్రాన్ని ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా గ్రాండ్‌థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో శ్రీచరణ్ గీత్ సైనీని ప్రేమగా ఎత్తుకుంటూ, ఆమెచేతులకు సీతాకోకచిలుక రెక్కలు అలంకరించి నట్టుగా డిజైన్ చేయడం ఆకట్టుకుంది "అన్‌ఆర్గానిక్‌ప్రేమకథ" అన్న ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా టీజర్ ఇప్పటికే ప్రేక్ష కుల్లో క్యూరియాసిటీ పెంచింది. రిలీజ్ దగ్గరపడటంతో టీమ్ మరింత జోరుగా ప్రమోషన్స్‌కి సిద్ధమవుతోంది. శ్రీకాకుళం బ్యాక్ డ్రాప్ లోసహజవాతా వరణ ంలో నడిచే ఈలైఫ్ ఫీల్ కథ సినిమాటిక్ టచ్‌తో ఒక కొత్త ఫీల్ ని అందించనుంది. రవి నిలమర్తి అందించిన ఆకట్టుకునే సంగీతం, శివ గాజుల, హరి చరణ్ కె అద్భుతమైన సినిమాటోగ్రఫీ, నరేష్ అడుపా ఎడిటింగ్ ఇవన్నీ ఈ ప్రేమకథను మరింత అందంగా మలిచాయి. పల్లె అందాలు, ఆకట్టుకునే ప్రేమకథ, పండుగ వాతావరణంతో కన్యా కుమారి ఈ సీజన్‌లో మనసులను కట్టిపడేయడానికి సిద్ధంగా ఉంది. తారాగణం: గీత్ సైనీ, శ్రీచరణ్ రాచకొండ సాంకేతిక సిబ్బంది: ప్రొడక్షన్ రాడికల్ పిక్చర్స్ సమర్పణ మధు షాలిని రచన, దర్శకత్వం నిర్మాత : సృజన్ అట్టాడ, డిఓపి :శివగాజుల,హరి చరణ్ కె, సంగీతం : రవి నిడమర్తి,ఎడిటింగ్: నరేష్ అడుప,సహ నిర్మాతలు – సతీష్ రెడ్డి చింత, వరేనియా మామిడి, అప్పల నాయుడు అట్టాడ, సిద్ధార్థ్ ఎ.సౌండ్ డిజైనర్ నాగార్జున తాళ్లపల్లి సౌండ్ మిక్సింగ్ వంశీప్రియ రాసినేని (సౌండ్‌రూఫ్ స్టూడియోస్ )

# యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025




ఘనంగా యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 బంజారాహిల్స్ హోటల్ రెసిడెన్షియల్ పార్క్ హయత్‌లో యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 యొక్కతొలిఎడిషన్‌నుఘనంగానిర్వహించారు.ఈకార్యక్రమం సౌత్ ఇండియా వినోదపరిశ్రమయొక్క ఆకర్షణీ యమైన, స్టైలిష్ వ్యక్తిత్వాలను గౌరవించడంలో కొత్తఅధ్యాయాన్ని గుర్తించిందని వరల్డ్‌వైడ్ మీడియా డైరెక్టర్, జేఈఎన్ఎల్, బిసిసెల్ టీవీ డిజిటల్ నెట్‌వర్క్ సిఇఒ రోహిత్ గోపాకుమార్‌చెప్పారు. సినిమా రంగంతో పాటు ఫ్యాషన్ రంగాలకు చెందిన ప్రతి భావంతులైన కళాకారులను గౌరవించడం లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు. దేశంలోని పలు నగరాల్లో విజయవంతమైన తర్వాత దక్షిణాదిన తొలిసారిగా ఫిలింఫేర్‌గ్లామర్‌స్టైల్ అవార్డ్స్‌సౌత్ ను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ ప్రయాణంలో యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ భాగస్వామిగా ఉండటం ఎంతో ఉపయోగంగా నిలిచిందన్నారు. ఫిలింఫేర్‌ఎడిటర్ ఇన్ చీఫ్ జితేష్ పిళ్ళై మాట్లాడుతూ, తాము ఈవెంట్‌లతో దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళాము, ఈ సమయంలో, హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా ముందుకు వెళ్ళేటప్పుడు అందరి మద్దతు కోసం ఎదురుచూస్తున్నామన్నారు. దక్షిణ భారతదేశం మాకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందని, దీని ప్రభావం తెరను మించి, ఫ్యాషన్‌లో సంభాషణలను రూపొందించడం, వ్యక్తిత్వాన్ని ప్రేరేపించడం, దేశవ్యాప్తంగా శైలి కోసం బెంచ్‌మార్క్‌లను ఏర్పాటు చేసిందన్నారు. యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ ఛైర్మన్ ప్రదీప్ సేథి, డాక్టర్ అరిక బన్సాల్ మాట్లాడుతూ, యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ వద్ద, టాము ఖచ్చితమైన, కళాత్మకత, ఆవిష్కరణల ద్వారా జుట్టు పునరుద్ధరణలో గ్లోబల్ స్టాండర్డ్స్‌ను ఏర్పాటు చేసామన్నారు. తొలి ఎడిషన్ ఫిల్మ్ ఫేర్ గ్లామర్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 యొక్క ఎడిషన్ ఆ స్ఫూర్తికి సరైన వేడుక అని, ఈ భాగస్వామ్యం మాకు ఒక మైలురాయి క్షణాన్ని సూచిస్తుంది అని చెప్పారు.అనూజ్‌చార్ వింధ్య విశాకా వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ ఫిలింఫేర్ అవార్డుల కార్యక్రమంలో ప్రముఖ హీరో చిరంజీవితో పాటు, అల్లు అర్జున్ తదితరులకు అవార్డులు ప్రధానం చేశారు. మ్యాన్ ఆఫ్ స్టైల్,

# డబుల్ సెంచరీ దాటిన 'మహావతార్ నరసింహ్ణా కలెక్షన్స్

ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర రీసెంట్‌గా రిలీజ్ అయిన డివోషనల్ యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ్ణా ప్రేక్షకులను మెప్పిస్తూ వసూళ్ల వర్షం కురిపిస్తోంది. హుంబలే ఫిల్మ్స్ బ్యానర్ నుంచి వచ్చిన ఈ సినిమాకు అన్ని భాషల ప్రేక్షకులు పట్టం కడుతున్నారు. యానిమేషన్ సినిమా అయినప్పటికీ, ఈ సినిమాలోని డివోషన్‌కు మంత్రముగ్ధులు అవుతున్నారు. ఇక ఈ సినిమాను దర్శకుడు అశ్విన్ కుమార్ డైరెక్ట్ చేయగా, ఇందులోని గ్రాఫిక్స్, కంటెంట్, డివోషనల్ డ్రామా ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. దీంతో ఈ సినిమాను చూసేందుకు జనం థియేటర్లకు క్యూ కడుతున్నారు. అటు బాక్సాఫీస్ దగ్గర మరే ఇతర సినిమా కూడా సౌండ్ చేయకపోవడంతో, ఈ సినిమాకే అందరూ ఓటేస్తున్నారు. కలెక్షన్స్ పరంగా ఈ చిత్రం కళ్లుచెదిరే వసూళ్లను రాబడుతోంది. ఇప్పటికే ఈ సినిమా రూ.210 కోట్లకు పైగా వరల్డ్‌వైడ్ గ్రాస్ మార్క్ దాటి సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది.

ఈ వారంలో రెండు బడా చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర దుమ్ము రేపేందుకు రెడీ అవుతున్నాయి. దీంతో ఈ గ్యాప్‌లో మరికొంత వసూళ్లను ఖాతాలో వేసుకునేందుకు ఈ చిత్రం రెడీ అవుతుంది. మరి టోటల్ రన్‌లో ఈ చిత్రం ఎలాంటి వసూళ్లు రాబడుతుందో చూడాలి.



# సుప్రీమ్ వారియర్స్ పూజా కార్యక్రమం



డా. మురళీ మోహన్ ప్రధాన పాత్రలో ఆది అక్షర ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్ 2గా తెరకెక్కిస్తున్న సుప్రీమ్ వారియర్ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం.. డా. మురళీ మోహన్ ప్రధాన పాత్రలో ఆది అక్షర ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్ 2గా తెరకెక్కిస్తున్న చిత్రం సుప్రీమ్ వారియర్. ఈ చిత్రానికి పెదపూడి బాబూ రావు నిర్మాతగా, హరి చందన్ దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ మూవీ సోమవారం (ఆగస్ట్ 11) నాడు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి దవళ సత్యం, బెల్లంకొండ సురేష్, దర్శకుడు వీర శంకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, శివ రాజ్ పాటిల్, మార్క్యాపురం శివ కుమార్, శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా దవళ సత్యం, డా. మురళీ మోహన్ గౌరవ దర్శకత్వం వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం.డా. మురళీ మోహన్ మాట్లాడుతూ,ఆది అక్షర ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెంబర్ 2గా సుప్రీమ్ వారియర్స్ నాడు రామా నాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. ఈ మూవీ కథను డైరెక్టర్ హరి చందన్ చెప్పినప్పుడే నాకు ఎంతో నచ్చింది. ఈ మూవీలో నటిస్తుండటం ఆనందంగా ఉంది. ఇక నిర్మాత పెదపూడి బాబూ రావు నిర్మాతగా, నటుడిగా ఈ చిత్రంలో అందరినీ ఆకట్టుకోబోతోన్నారు. ఎన్నారై అయిన బాబూ రావు సినిమాల మీద ప్యాషన్ మీద ఇండస్ట్రీలోకి వచ్చారు. ఆయన మరెన్నోవిజయవంతమైన చిత్రాల్ని అందించాలని కోరుకుంటున్నాను. ఈసుప్రీమ్‌వారియర్స్ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.ప్రముఖ దర్శక, నిర్మాత దవళ సత్యం మాట్లాడుతూ.. బాబూ రావుకి ఈ సారి పెద్ద హిట్ రావాలి. ఇక మళ్లీ అమెరికా వెళ్లకుండా ఇక్కడే వరుసగా చిత్రాలు నిర్మించాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ హరి చందన్ చెప్పిన కథ నాకు ఎంతో నచ్చింది. పూర్తి స్క్రిప్ట్ రెడీ అయ్యాకే షూటింగ్‌కు వచ్చారు. డైరెక్టర్‌కి ఎంతో డెడికేషన్ ఉంది. మంచి ఆలోచనలతో, కష్టపడి సినిమా తీస్తే తప్పకుండా విజయం దక్కుతుంది. ఈ సుప్రీమ్ వారియర్స్ చిత్రంపెద్దవిజయం సాధించాలని కోరుకుంటున్నానుఅని అన్నారు.హీరో, నిర్మాత పెదపూడి బాబూ రావు మాట్లాడుతూ,మా చిత్ర ప్రారంభోత్సవానికి వచ్చిన దవళ సత్యం కి, బెల్లంకొండ సురేష్‌కి, వీర శంకర్‌కి ధన్యవాదాలు. గత రెండున్నరేళ్ల నుంచి ఈ కథ మీద మేం పని చేస్తున్నాం.

సైఫ్, యాక్షన్ థ్రిల్లర్‌గా'సుప్రీం వారియర్స్ మూవీని నిర్మిస్తున్నాం. ఇందులో సౌత్ నుంచి నార్త్ వరకు మంచి పేరున్న హీరోల్ని తీసుకుంటున్నాం. ఇందులో నేను ఓ లీడ్ పాత్రలో కనిపిస్తాను. మురళీ మోహన్ మరో పాత్రను పోషిస్తున్నారు. మా ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి. మురళీ మోహన్ అతడు చిత్రంతో నాకు నటుడిగా జన్మను ఇచ్చారు. అందరినీ ఆశ్చర్యపరిచేలా, ఆకట్టుకునేలామా సినిమా ఉంటుంది. త్వరలోనే నటీనటుల వివరాల్ని ప్రకటిస్తామని అన్నారు.దర్శకుడు హరి చందన్ మాట్లాడుతూ,కరోనా టైంలో ఈ కథను అనుకున్నాం. తైవాన్ మీద జరిగిన దాడి తరువాత ఈ కథను రాయడం మొదలు పెట్టాను. 8 పాత్రల చుట్టూ జరిగే ఈ కథలో మురళీ మోహన్ గారు ఇది వరకు ఎన్నడూ కనిపించనటు వంటి కారెక్టర్‌ను పోషిస్తున్నారు. నిర్మాత బాబూ రావు గారు కూడా మంచి పాత్రను పోషిస్తున్నారు. మిగిలిన పాత్రల కోసం కొంత మంది హీరోల్ని సంప్రదించాం. త్వరలోనే వాటి వివరాల్ని ప్రకటిస్తాం. సైఫై, యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతోన్న ఈ చిత్రంలో మిలటరీ, ఆర్మీ కుటుంబాల ఎమోషన్స్ ఎక్కువగా చూపిస్తాం. మేం దాదాపు 800 మంది ఆర్మీ కుటుంబాలను ప్రత్యక్షంగా కలిశాం. రెండున్నరేళ్లుగా ఈ స్క్రిప్ట్ మీద పని చేస్తూనే ఉన్నాం. అందరినీ ఆకట్టుకునేలా మాసుప్రీమ్ వారియర్స్‌ను ఆడియెన్స్ ముందుకు తీసుకు వస్తామని అన్నారు.

# అందరం బాగుండాలనే ధోరణిలో యూనియన్స్ వ్యవహరించాలి



టాలీవుడ్ లో ప్రస్తుతం నెలకొన్న సమ్మె పరిస్థితుల నేపథ్యంలో రైజింగ్ ప్రొడ్యూసర్స్ చిత్ర నిర్మాణం లోతాము ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రెస్ మీట్ ద్వారా తెలియజేశారు.

హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగిన ఈ ప్రెస్ మీట్ లో నిర్మాతలు ఎస్ కేఎన్, ధీరజ్, రాజేశ్ దండా, ప్రైమ్ షో చైతన్య, ఛాయ్ బిస్కట్ శరత్, అనురాగ్, మధుర శ్రీధర్, మహేశ్వర్ రెడ్డి, రాకేశ్ వర్రె, తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రెస్ మీట్ లోనిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ, చిన్న నిర్మాతలు బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుంది. ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న మా లాంటి నిర్మాతలకు 30శాతం వేతనాలు పెంచాలంటూ సినీ కార్మికులు చేస్తున్న సమ్మె మరింత ఇబ్బందిపెడుతోంది. మా సినిమా దీపాళికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేశాం. ఇప్పుడు సమ్మె వల్ల షూటింగ్ ఆపేయాల్సివచ్చింది. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, ఒకచిన్న సీన్ చేయాలనుకుని జెనరేటర్ పెట్టాలన్నా యూనియన్ పర్మిషన్ కావాలి. హీరో, ఫ్రెండ్ సీన్ కోసం మేకప్, కాస్ట్యూమ్స్, వాళ్లకు వడ్డించే ప్రొడక్షన్..ఇలా 80 మందిని పెట్టుకోవాలి. చిన్న నిర్మాతకు ఇంతమందిని పెట్టుకోవడా పెనుభారంగా మారింది. వాస్తవానికి అక్కడ పనిచేసేది ఆరుగురు మాత్రమే. మిగతా వాళ్లకు పేమెంట్స్ ఇవ్వాలి. ఇంత మందిని మా నెత్తిన రుద్దడం ఏంటనేది పెద్ద ప్రశ్నగా మారింది. అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ చిత్ర నిర్మాణం భారంగా మారుతోంది. రెండు కోట్ల రూపాయల్లో చేయాల్సిన సినిమాకు నాలుగైదు రెట్ల ఖర్చు అవుతోంది.ఒక సెట్ కోసమో, ఇంకో క్వాలిటీ కోసమే మేము పెట్టాల్సిన ఖర్చు ఇలా వృథా అవుతోంది. ఈ బంద్ ల వల్ల ఎవరికీ ఉపయోగం లేదుఅన్నారు.నిర్మాతరాకేశ్ వర్రె మాట్లాడుతూ నేను గతంలో ఒక సినిమాను లోకల్ టాలెంట్, యూనియన్ కార్మికులను కలిపి చేస్తే కోటిన్నర అయ్యింది. ఇప్పుడు మొత్తం యూనియన్ కార్మికులతో చేస్తే 8 కోట్ల రూపాయలు ఖర్చు అయ్యింది. చిన్న సినిమాకు అసలు బిజినెస్ లేదు. అలాంటి టైమ్ లో నాకు 8 కోట్ల బిజినెస్ ఎలా అవుతుంది. నష్టం నాకు వస్తుంది. ఒక ప్రొడ్యూసర్ నష్టపోతే ఆదుకునేందుకు ఎవరూ రారు. అన్నారు. మీరు డిమాండ్స్ మాత్రమే చేసి హక్కులు మర్చిపోతే ఎలా. మీరు మారకుంటే మా బడ్జెట్ లో వచ్చేవాళ్లతో సినిమాలు నిర్మించుకుంటాం. సినిమాకు మాకు కంఫర్ట్ కాదు ప్యాషన్. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా మాలాంటి చిన్న నిర్మాతలు పడుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నా. అందరూ బాగుండాలి అని అనుకోవాలి గానీ మేము మాత్రమే బాగుండాలని యూనియన్స్ వాళ్లు ఆలోచించడం సరికాదు. ఏ హీరో కూడా మాకింత ఇవ్వకుంటే షూటింగ్స్ బంద్ అనడం లేదు. పరిస్థితి అర్థం చేసుకుని సినిమాలు చేస్తున్నారు. యూనియన్స్ కూడా ఇది మన ఇండస్ట్రీ మన ప్రొడ్యూసర్స్ అనే భావనతో పనిచేయాలని అన్నారు .

# వర్షాల్లో సంరక్షణకు..



వర్షాన్ని ఆస్వాదించడమంటే ఎవరికైనా ఇష్టమే! అయితే దీని వల్ల అందం పై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు. ఎందు కంటే అప్పటికప్పుడే వర్షం పడడం, ఎండగా ఉండటం, హ్యూమిడిటీ స్థాయిలు ఎక్కువ కావడం.. ఇలా వెను వెంటనే మారే వాతా వరణం దెబ్బతీస్తాయి. అయితే కొన్ని ఫేస్ ప్యాక్‌లు వేసుకోవడం వల్ల ఈ కాలంలో చర్మాన్ని సంరక్షించుకోవచ్చంటున్నారు నిపుణులు.

**రోజ్‌వాటర్‌తో...** పావుకప్పు రోజ్వాటర్ని తీసుకొని దానికి టేబుల్స్పూన్ చందనం పొడి, పావు చెంచా పసుపుని జత చేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని అరగంట తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల, పొక్కులు.. ట్యాంక్ తొలగిపోయి ముఖం నిగారింపును సంతరించుకుంటుంది. పసుపు, చందనంలో ఉన్న గుణాలు చర్మ సంబంధిత అలర్జీలు రాకుండా చేస్తాయి.

**గ్రీన్ టీతో...** రెండు టేబుల్ స్పూన్ గ్రీన్ టీ పొడి తీసుకోవాలి. దీనికి ఒక టేబుల్ స్పూన్ పెరుగు, రెండు చుక్కల బాదం నూనె వేసి బాగా కలిసే వరకు బ్లెండర్లో వేసి బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ మిశ్రమంలో బాదం నూనెకు బదులు మీ చర్మతత్వానికి సరిపడే ఇతర అత్యవసర నూనెలను కూడా ఉపయో గించవచ్చు. ఈ ఫేస్ ప్యాక్ వేసుకోవడం వల్ల దురద, ఇతర చర్మ సంబంధిత సమస్యలు 'దరిచేరవు' అంటున్నారు నిపుణులు.

**పుదీనాతో...** గుప్పెడు పుదీనా ఆకులను తీసుకొని మెత్తగా చేసుకోవాలి. అరటిపండులో సగ భాగాన్ని తీసుకొని దాన్ని కూడా మెత్తగా చేసుకోవాలి. ఈ ఉత్పత్తులను బ్లెండర్‌లో వేసి పేస్ట్‌గా చేసుకొని ముఖానికి అప్లై చేసుకోవాలి. ఫేస్‌ప్యాక్ బాగా ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. అరటి చర్మానికి పోషణనిచ్చి తేమను కోల్పో కుండా చేస్తుంది. అలాగే చర్మం నుంచి చర్మాన్ని రక్షించే గుణాలు పుదీనాలో ఉన్నాయి.

**ముల్లంగితో..** ముల్లంగిలో సగభాగం తీసుకొని దాన్ని మెత్తని పేస్ట చేసుకోవాలి. దీనికి కొద్దిగా నిమ్మరసం జత చేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని పది నిమిషాల పాటు ఆరనివ్వాలి. తర్వాత కాసేపు మృదువుగా మర్దన చేసుకోవాలి. అనంతరం గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. దీనివల్ల ముఖ చర్మానికి రక్తప్రసరణ బాగా జరుగుతుంది.

**కోడిగుడ్డు తెల్లసొనతో...** గుడ్డులోని తెల్లసొనకు చెంచా తేనె జత చేసి బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి దట్టంగా పట్టించాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం క్లెన్సర్గా పనిచేసి ముఖాన్ని శుభ్రం చేస్తుంది. జిడ్డుదనాన్ని తగ్గిస్తుంది. □

# మహిళా సర్పంచ్‌లకు ఢిల్లీ పిలుపు !

ఢిల్లీలో భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.. దేశ సైనిక శక్తినీ, సాంస్కృతిని విశిష్టతల్నీ ప్రపంచానికి చూపే సంబరం. ఎర్రకోట వేదికగా జరిగే ఈ ఉత్సవాలకి ప్రత్యేక ఆహ్వానం అందుకుని గొప్ప గౌరవం పొందారీ మహిళలు. గ్రామ సర్పంచ్‌లుగా తమ పల్లెల్ని అభివృద్ధి పథంలో నడిపించినందుకుగాను, ఆగస్టు 15న పతీ సమేతంగా ఢిల్లీ రావాలంటూ కేంద్రం నుంచి పిలుపు అందుకున్నారు.

**సర్పంచ్ అవ్వడం నాన్న కల..** ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామం దాసరి శిల్ప సౌందర్యది. ఎమ్‌కాం చదువుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగం కూడా వచ్చింది. కానీ, 2021 సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రావడంతో ఉద్యోగం వదిలేశారామె. 'విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి.



అప్పుడే రాష్ట్రం అభివృద్ధి బాటలో నడిచేది' అని శిల్ప నాన్న రమేష్ ఎప్పుడూ చెబుతుండేవారట. ఆయన సర్పంచ్ అయ్యి గ్రామానికి సేవచేయాలనుకున్నారు. ప్రయత్నించి విఫలమ య్యారట. ఆయన కోరిక నేరవేర్చడం కోసమే ఆమె ఎన్నికల్లో జరిగింది. కానీ, 'నామినేషన్ వేయడానికి రాజకీయ, సామాజిక ఇబ్బందులు చాలానే ఎదుర్కొన్నా' అంటారామె. 'గ్రామస్థుల ప్రోత్సాహంతో గెలిచినా బెది రింపులు తగ్గలేదు. అయినా మొదట్నుంచీ అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేదాన్ని. దాని ఫలితమే... సిమెంటు అంతర్గత రోడ్లు, కాలవల నిర్మాణానికి రూ.కోటికి పైగా వెచ్చించి, పనులు చేయించాం. ఎప్పట్నుంచో ఉన్న వీధి దీపాల సమస్యను పరిష్క రించా. వర్షపు నీటి నిల్వకి ఇంకుడు గుంతలు తవ్వించా. క్యాన్సర్‌ను ఓడించిన... నటి గౌతమితో మా గ్రామంలో క్యాన్సర్ అవగాహన సదస్సు ను కలిసి నిర్వహించా' అంటారు శిల్ప.

**ఏడాదిలో రెండోసారి ....**
గుంటూరు జిల్లా తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి ఢిల్లీ నుంచి పిలుపు అందుకోవడం ఇది రెండోసారి. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్ విభాగాల వేడుకలకు ఆహ్వానం అందింది. కేంద్ర పథకాలతోపాటు ఇతర అంశాల్లో ఉత్తమ పనితీరుగానూ సర్పంచుల ఎంపిక వేడుకల్లో పురస్కారాలు అందుకున్నారు. ఇప్పుడు స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కానున్నారు. 2021లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన నాగలక్ష్మి... నిత్యం ప్రజల సమస్యలు వింటూ వాటి పరిష్కారానికి కృషి చేశారు. గ్రామంలో పలు దేవాలయాల అభివృద్ధి పనుల్లో భాగస్వాములయ్యారు. హిందూ శ్మశాన వాటికలో నిర్మాణ పనులు, కర్మల భవనం ఏర్పాటు, బస్టాప్ నిర్మాణం, ఆరు ధోబీ ఘాట్లను అందుబాటులోకి తీసుకురావడం, ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు పనులను సొంత నిధులు, మిత్రులు, దాతల సహకారంతో పూర్తి చేశారు.



క్రమం తప్పక ఉచిత ఆరోగ్య శిబిరాలు ఉన్నారు. రూ.4 కోట్ల ప్రభుత్వ నిధులతో రోడ్లు, కాలువలు నిర్మించారు. ప్రతి ఇంటికి కుళాయి ఇవ్వడంతో పాటు స్వచ్ఛతలోనూ గ్రామాన్ని ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెబుతారు నాగలక్ష్మి.

**పెద్ద కూతురిలా ఉండాలని..**
అనుకోని పరిస్థితుల్లో సర్పంచ్ పోటీ చేయవలసి వచ్చినా... తనకు దక్కినందుకు ఇక అనుకోకుండా సద్వినియోగపరచుకోవాలను కున్నారు. శ్రీసత్యసాయి జిల్లా, గొట్లూరు గ్రామ సర్పంచ్ పిట్టా



నరసమ్మ. ఉమ్మడి జిల్లాలోనే మొదటి బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామం గొట్లూరు. జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలంటే ఈ గ్రామంలోనే పంచాయతీ అధికారులకు శిక్షణ ఇస్తారు. ఆ పేరుని అలానే కొనసాగించాలను కున్నారు నరసమ్మ. 'జీ ఫర్ గొట్లూరు జీ ఫర్ గ్రీన్ జాన విలేజ్ నినాదంతో... చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ గ్రామంలోని 'చెత్త నుంచి సంపద' తోట తయారైన సేంద్రియ ఎరువుకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇదేకాదు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై బిన్‌బ్యాగ్ పద్ధతిని వివరించడంతోపాటుతో ప్రభుత్వ నిధులతో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేశారు. సుమారు రెండున్నర కోట్ల రూపాయలు ఖర్చుచేసి గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. సురక్షిత మంచినీటి సరఫరాకు రూ.20 లక్షల నిధులు, ప్రభుత్వ పాఠశాలలో రూ.3లక్షలుతో ఖర్చుచేసి వంటగదులను నిర్మించారు. 'సర్పంచ్.. అంటే అదేదో పదవిగా భావించలేదు. ఊరికి పెద్ద కూతురిలా ఉండాలనుకున్నానంతే. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నా. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారుల సహకారంతోనే ఇది సాధ్యమైంది. స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కాబోతున్నందుకు చాలా సంతోషంలా ఉంది అంటున్నారు నరసమ్మ.

**చెక్‌డ్యామ్‌తో జలపాతాన్ని సృష్టించి...**
గ్రామాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని తపించేవారు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను సర్పంచ్ సి. సుజాతమ్మ. 2013, 2021ల్లోనూ సర్పంచ్‌గా ఎన్నికైన ఈమె. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూశారు. గ్రామంలో సీసీ రోడ్లు, చెత్త నుంచి సంపద సృష్టించే



సదుపాయం, రక్షిత మంచినీటి సరఫరా, గర్భిణులు, బాలింతలు, శిశువులకు పౌష్టికాహారం... తదితర సౌకర్యాలను కల్పించారు. ఈ గ్రామ శివారులో ఉన్న కొండ మధ్యలో అర కిలోమీటరు పొడవున భారీ చీలిక ఉంది. ఆ చీలికకు అడ్డంగా 60 ఎత్తైన కాంక్రీటు గోడ నిర్మించి దాన్ని చెక్ డ్యామ్‌లో రూపొందించారు. వర్షం కురిసినప్పుడు ఆ చీలికలో భారీగా నీరు చేరుతోంది. ఆ నీరు సుమారు 150 ఎకరాల సాగుకు ఉపయోగపడుతోంది. వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు కొండలు, పచ్చని చెట్ల మధ్యన జలపాతాన్ని తలపించేలా చెక్ డ్యాం కాంక్రీటు గోడపై నీరు పడుతుండడంతో ఓ పర్యాటక ప్రాంతంగానూ మారింది. నేను అనుకున్న గ్రామాభివృద్ధి చేయగలిగాను. రెండుసార్లు సర్పంచ్ అవకాశం రావడం కూడా నాకు వరంలా మారింది. అన్ని శాఖల పరిధిలో సుమారు రూ.10కోట్ల విలువైన పనులు గ్రామంలో చేయగలిగారు. మా కృషిని ఢిల్లీ పెద్దలు గుర్తించడం గ్రామానికి దక్కిన గౌరవం అంటున్నారు సుజాతమ్మ. □

# మీ మౌత్‌వాష్ ఎలాంటిది?

మామూలుగా మనం నోటి శుభ్రత కోసం మౌత్‌వాస్ లిక్విడ్‌లు వాడుతుంటాం. అందులోనూ ఆల్కహాల్ బేస్డ్‌వి వాడే అమ్మాయిల సంఖ్యా ఎక్కువే. మీరూ ఆ జాబితాలో ఉన్నారా? అయితే, వాటి విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎందుకంటే, ఈ



లిక్విడ్‌లోని హానికర రసాయనాలు మన ఆరోగ్యానికి చేటు చేస్తాయట. దీన్ని 3 నెలలపాటు తరచూ వాడితే..చిగుళ్ల సమస్యలతోపాటు పేగు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. సాధారణంగా మన నోట్లో మంచీ, చెడూ రెండు రకాల బ్యాక్టీరియా ఉంటుంది. అయితే, ఈ లిక్విడ్ లోని హానికర రసాయనాలు జీర్ణక్రియకూ, నోటి శుభ్రతకూ ఉపయోగపడే కీలకమైన ఓరల్ మైక్రోబయోమ్‌లను నాశనం చేస్తాయట. అంతేకాదు, బిపిని నియంత్రించే యాక్టినోబ్యాక్టీరియా కూడా ఈ ఆల్కహాల్ మౌత్‌వాష్ వాడకం వల్ల తగ్గిపోతుందట. కాబట్టి, అవి కొనేముందే ఎటువంటి రకాలో చూసి కొనడం ఉత్తమం. □

# నిమ్మ తొక్కే కానీ..

రోజు వారీ వంటకాల్లో భాగంగా నిమ్మను చాలా రకాలుగా వాడేస్తుంటాం. రసం పిండి తొక్కల్ని పారేస్తాం. కానీ, ఈ సారి అలా చేయొద్దు. దీన్ని విడిగానో లేదంటే కాస్త వంటసోడా చేర్చో వినియోగిస్తే ఎన్నో లాభాలు.

నిమ్మని ఆల్‌పర్పస్ క్లీనర్‌గా వాడొచ్చు. తొక్కల్ని చిన్న చిన్న ముక్కలుగా తరిగి ఓ బాటిల్ వేసి కాసిని నీళ్లు పోయండి. రాత్రంతా ఉంచి ఉదయాన్నే కాస్త వంట సోడా చేర్చి ఈ మిశ్రమాన్ని గిన్నెలు, ఫ్లోర్ దుస్తులు.. ఇలా వేటినైనా శుభ్రం చేసేందుకు వాడొచ్చు.

◆ తెల్ల దుస్తులు ఇట్టే మురికి పట్టేస్తాయి. మరకలు ఓ పట్టాన వదలవు. అంతేకాదు ఉతుకుతూ ఉంటే కొన్నాళ్లకు రంగూ తగ్గుతాయి. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టాలంటే వాడేసిన నిమ్మచెక్కపై కాస్త సర్ఫ్ వేసి.. మచ్చపై రుద్ది, కాసేపాగి దాన్ని ఉతికితే సరి. ఇవి కొత్తవాటిలా మెరవాలంటే ఉతికే నీళ్లలో కాస్త నిమ్మ రసమూ చేర్చాలి. ◆. మొక్కల చుట్టూ ఉండే మట్టిలో ఒక్కోసారి చీమలు పడుతూ ఉంటాయి. ఇలాంటప్పుడు నిమ్మచెక్క నాలుగైదు లవంగాలు మెత్తగా నూరి మొదళ్ల చుట్టూ వేస్తే సమస్యదూరమవుతుంది.



◆ నిమ్మచెక్కపై కాస్త బేకింగ్ సోడా చల్లి బోర్డుపై గట్టిగా రుద్దితే సరి. జిడ్డు తొలగిపోతుంది.

బ్యాక్టీరియా, ఫంగస్ దరిచేరవు. □

# అరిటాకులో తిందామా..




అరటి పండ్లను ఇష్టపడే వారు సామాన్యంగా ఉండరు. అలాగే పచ్చి అరటికాయ లతో కూర, బజ్జీలు, చిప్స్.. ఇలా ఎన్నో వెరైటీలు చేస్తాం. వాటి సంగతలా ఉంచితే అరిటాకు కూడా తినదగ్గదే. అందులో అన్నం తినడం ఎంత మంచిదంటే...

అరిటాకులతో పచ్చడి, హల్వా చేస్తారు. దీన్ని తినడం వల్ల శరీరానికి విటమిన్లు, ఖనిజాలుఅందుతాయి. రోగ నిరోధక శక్తి పెరుగు తుంది. జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉం టుంది. చర్మం పొడి బారదు, ముఖానికి కాంతి వస్తుంది. ఊబ కాయం రాదు. కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఒంట్లో వేరిన మలినాలు, విషపదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. గుండెజబ్బులకు దూరంగా ఉంచుతుంది. నొప్పి, వాపు, పుండ్లను తగ్గిస్తుంది. ఒకప్పుడు అరిటాకులో అన్నం వడ్డించే వారు. పునుగుల్లాంటి తినుబండాలను ఆకులోనే చుట్టి ఇచ్చేవారు. అందులో ఉండే యాంటీబ్యాక్టీరియల్ గుణాలు సూక్ష్మక్రిములను చేరనివ్వవు. ఇప్పుడు ప్లాస్టిక్ పళ్లేలు, పాలిథిన్ కవర్లూ, కాగితా లను వాడుతున్నాం. వీటి వల్ల ఒంట్లో ప్లాస్టిక్ చేరుతుంది. శుభ్రత లోపి స్తుంది. ఇవి అనేక జబ్బులకు దారి తీస్తాయి. వాడిన తర్వాత కూడా ప్లాస్టిక్ వ్యర్థాలను పెంచినట్టవుతుంది. వాతావరనం కాలుషనయం కూడా. అరిటాకులో తినడం వల్ల ఆరోగ్యానికి మంచిది, సహజ పరిమళమూ ఉంటుంది. బదులుగా ప్లాస్టిక్ అరిటాకును వాడితే.. అనారోగ్యాలూ రావు, చుట్టూ కాలుష్యాలు చేరవు. అందు లో తినటం వల్ల అందం గానూ ఉంటుంది. మన సంప్రదాయాన్ని కాపాడి నట్టూ అవుతుంది. □

# పిల్లలు నిద్రపోవడం లేదా ?

రాత్రి 11 గంటలైనా ఎనిమిదేళ్ల కొంది మంది పిల్లలు పట్టడం లేదు అంటారు. అలాగే 15 ఏళ్ల పిల్లలు కూడా కొంత నిద్రపోవడానికి ఆసక్తి చూపారు. పగలంతా స్కూల్, హోంవర్క్ అంటూ అలసిపోతారు. అయినా నిద్రలేమికి గురవుతున్నారంటే దానికి కారణం స్క్రీన్, డిజిటల్ టెక్నాలజీ ప్రభావమే



అంటూన్నారు నిపుణులు. ఈ సమస్యను పరిష్కరించక పోతే, పిల్లలు శారీరక, మానసిక అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తు న్నారు. పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మెదడు పని తీరు మెరుగ్గా ఉండాలంటే చిన్నప్పటి నుంచి వాళ్లకు నాణ్యమైన నిద్ర అవసరమెంతో ఉంది. కంటినిండా నిద్ర వాళ్ల మెదడుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. శారీరక ఎదుగుదలకు దోహద పడుతుంది. కానీ నిద్రకు ముందు ఫోన్ వినియోగిస్తే అది పిల్లల మెదడు, మనసును ఉత్తేజ పరుస్తుంది. అలాగే ఫోన్, టాబ్లెట్, టివి నుంచి వెలువడే నీలి కాంతి మెదడులో సహజంగా విడుదలయ్యే మెలటోనిన్ స్థాయిలను నిరోధిస్తుంది. ఇది నిద్రను ప్రభావితం చేస్తుంది. స్నేహితులతో చాట్ చేయడం, గేమ్స్, రీల్స్ చూడటం వంటివన్నీ నిద్ర పోవాలనే ఆసక్తిని తగ్గిస్తాయి. అంతేకాదు, రోజులో ఎప్పుడైనా ఫోన్ లేదా టివిలో చూసిన హింసాత్మక కంటెంట్ ప్రభావమూ పిల్లల మెదడుపై పడి నిద్రను దూరం చేస్తుంది.

**నివారించడమెలా...** సాయంత్రంవేళల్లో స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి పిల్లలను ప్రోత్సహించాలి. ఉదయం లేదా సాయంత్రం తల్లిదండ్రులు పిల్లలతో సరదాగా కాసేపు నడిస్తే, నక్రమేపీ వారికి వ్యాయామం అలవడుతుంది. శారీరక శ్రమతో కండరాలు అలిసి హాయిగా నిద్రపోతారు. ఫోన్ వాడకానికి పరిమిత సమయాన్ని కేటాయించి, నిద్రవేళకు గంట ముందే డిజిటల్ వినియోగాన్ని నిలిపేసేలా అలవాటు చేయాలి. నిద్రపోయే ముందు తల్లిదండ్రులు వారికి కథలు చెప్పడం, ఆ రోజు విశేషాలను అడిగి తెలుసుకోవడం వంటివి చేయాలి. ముఖ్యంగా నిద్రపోయే ముందు ఇంటిల్లిపాది ఒకచోట ఫోన్లన్నీ భద్రపరచాలనే నియమాన్ని పెట్టుకోట్టుకోవాలి. అంతేకాదు, పడకగదిలో పెద్దవాళ్లూ కంప్యూటర్, స్మార్ట్‌వాచ్‌లను వినియోగించే అలవాటుంటే మానేయడం మంచిది. లేదంటే వాటి నుంచి వచ్చే నీలికిరణాలు పిల్లల నిద్రపై చెడు ప్రభావం చూపు తాయి. బెడ్‌రూంలో టివి వంటివి లేకుండా ఆ ప్రాంతాన్నంతా సాంకేతికతరహితంగా మార్చితేనే పిల్లలు కంటినిండా నిద్రపోతారు.సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారు. □

# కళ్లు పొడిబారకుండా !

కళ్లు మంటగా అనిపించడం, దురద పెట్టడం, ఎర్రగా మారడం, మసకబారడం, మూసుకుపోవడం, ఉబ్బడం, కన్నీళ్లు రాకపోవడం. ఇవన్నీ కళ్లు పొడిబారు తున్నాయని (డ్రై ఐ సిండ్రోమ్) తెలిపే లక్షణాలు. ఈ సమస్యను ప్రారంభంలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని కంటి వైద్య నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే దీర్ఘకాలంలో మరిన్ని కంటి సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.



**ఎందుకు వస్తుందంటే!**
కళ్లు పొడిబారడానికి చాలా కారణాలున్నాయి. విటమిన్'ఎ' లోపించడం, హార్మోన్ల అసమతుల్యత, థైడ్, కంప్యూటర్లు/మొబైల్స్/ టీవీ ముందు ఎక్కువసేపు గడపడం, వివిధ రకాల ఎలర్జీలు, వృద్ధాప్యం, దుమ్ము, దూళి తదితర కారణాల వల్ల కళ్లు పొడిబారతాయి. ఇక కంటి ఆరోగ్యంలో లాక్రిమల్ గ్రంథి ప్రధాన పాత్ర దీని నుంచి ఉత్పత్తయ్యే ద్రవాలే కళ్లను శుభ్రపరచి కాపాడుతుంటాయి. అయితే పొడి కళ్ల కారణంగా కంటి అనుకూలంగా డీహైడ్రేటెడ్గా మారుతుంది. చికాకు, దురద స్థిర ఇబ్బంది పెడతాయి. ఇక చాలామంది కళ్లకు వేసుకునే మేకప్‌ను తొలగించుకోవడంలో నిర్లక్ష్యం చూపుతారు. ఇది కూడా కళ్లు పొడిబారడానికి కారణమవుతుంది.

**ఇలా ఉపశమనం పొందచ్చు...** కంప్యూటర్లు/మొబైల్స్ ఉపయోగించినప్పుడు చాలామంది కనురెప్ప వేయకుండా కళ్లు పెద్దవి చేసి మరీ స్క్రీన్ వైపు చూస్తారు. ఇలా చేయడం వల్ల కళ్లు పొడిబారి, బాగా మంట పెడతాయి. అందుకే వీటికి దూరంగా ఉంటూనే. కంటి కుదుర వేసుకునే తారు. ల్యాప్‌టాప్స్, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌ను ఉపయోగించినప్పుడు మధ్యలో కాస్త విశ్రాంతి తీసుకోవాలి. మరీ చల్లని నీరు/వేడి నీటితో కాకుండా గోరువెచ్చని నీటితో కళ్లను శుభ్రం చేసుకుంటూ ఉండాలి. కళ్లలోని లాక్రిమల్ గ్రంథులు సమర్థంగా పనిచేయాలంటే ఎక్కువ మొత్తంలో నీళ్లు తాగాలి. అదేవిధంగా నీటి శాతం ఎక్కువగా ఉండే కీరా, పుచ్చకాయ, స్ట్రాబెర్రీ.. మొదలైన పండ్లను ఆహారంలో చేర్చుకోవాలి.

◆ పొడి కళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉండే చేపలు ఎక్కువగా తినాలి. వీటితో పాటు వాలట్స్, బాదం, అరటి పండ్లు, ఎండు ద్రాక్ష అవకాడోలను తరచుగా తీసుకోవాలి.

◆. హెయిర్ డ్రయర్స్, ఎసిలు, కూలర్లు, హీటర్ల నుంచి వచ్చే గాలులు నేరుగా కళ్లపై పడకుండా జాగ్రత్త పడాలి.

◆ వైద్యులను సంప్రదించకుండా డ్రాప్స్, మందులు ఉపయోగించకూడదు.

◆.కంప్యూటర్లు/మొబైల్స్ నుంచి వచ్చే నీలి కాంతి నుంచి రక్షణ పొందడానికి బ్లూ లైట్ ఫిల్టర్ గ్లాసెస్ వాడడం మంచిది. కంప్యూటర్‌పై ఎక్కువ సమయం పనిచేసే వారు కాంటాక్ట్ లెన్సులను ఉపయోగించకపోవడం ఉత్తమం ఎందుకంటే వాటివల్ల కళ్లు పొడిబారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

◆ కళ్లకు మేకప్ వేసుకునే అలవాటు ఉన్న వారు తప్పనిసరిగా కనురెప్పలు, కనుబొమ్మలు, కళ్ల చుట్టు పక్కల చర్మాన్ని మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి. అలాగే పడుకునే ముందు మేకప్‌ను తొలగించుకోవడం తప్పనిసరి.

◆. బయటకు వెళ్లే సమయంలో సన్‌గ్లాసెస్ ధరించడం మంచిది. దీనివల్ల దుమ్ము, దూళి, కాలుష్యం నుంచి కాకుండా సూర్యుని నుంచి వెలువడే అతినీల కిరణాల నుంచి కళ్లను కాపాడుకోవచ్చు

◆ పని చేయడానికి చీకటిగా ఉన్న, ఎసి గదులను కాకుండా గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలి. □

# నిమిషాల్లో మిర్చి పచ్చడి



అన్నంలోకి ఎన్ని కూరలున్నా.. కాస్తంత రోటిపచ్చడో, ఊరగాయో ఉంటే ఆ తృప్తే వేరు. రాజస్థాన్ వారి విందు భోజనంలో 'హరీ మిర్చి కా ఆచార్' ఉంటుంది. దీని కోసం.. పావుకిలో పచ్చిమిరప కాయలు, ముప్పావు కప్పు ఆవనూనె, అర కప్పు వైట్ వెనిగర్, పసుపుపచ్చ ఆవాలు, సోంపు 5 టేబుల్ స్పూన్ల చొప్పున, నాలుగంగుళాల అల్లం ముక్క, నల్ల జీలకర్ర, మెంతులు, పసుపు చెంచా చొప్పున, ఉప్పు రుచికి తగినంత, కాశ్మీరీ కారం, జీలకర్ర టేబుల్ స్పూన్ చొప్పున, అర చెంచా ఇంగువ తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. ఆవాలు, సోంపు, జీలకర్ర, మెంతులను డ్రైగా వేయించి.. చల్లారాక గ్రైండ్ చేయాలి. తొడిమలు తీసి, కడిగి ఆరబెట్టిన పచ్చిమిరపకాయలను ముక్కలుగా చేసి.. నూరిన అల్లం, ఉప్పు, ఆవాలు సోంపు పొడి, కారం, పసుపు, నల్ల జీలకర్ర వేసి కలపాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఇంగువ వేసి.. కొన్ని క్షణాలుంచి సెగ తీసేయాలి. చల్లారాక మిర్చి ముక్కల్లో కలిపి, తడి లేని సీసాలో భద్రం చేసుకోవాలి. అంతే.. 'హరీ మిర్చి కా అచార్' తయారై పోతుంది. □

# శ్రీ ప్రత్యంగిరా దేవి

ఆధ్యాత్మికం

శ్రీ ప్రత్యంగిరా దేవిశ్రీ ప్రత్యంగిరా దేవి పూజ అనేక విశిష్టతలు, ఆధ్యాత్మిక గాఢతను కలిగి ఉంది. ఈ దేవి ఆరాధనలో ప్రధానంగా నిర్వహించబడే అర్చనలు, హోమాలు ప్రత్యంగిరా హోమం"గా ప్రసిద్ధి చెందాయి. ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వచ్చే అమావాస్య రోజున ఈ హోమాన్ని విశేషంగా నిర్వహిస్తారు.

దీని ద్వారా పూర్వ జన్మ కర్మ ఫలాల ప్రభావం తగ్గుతుందన్న ప్రగాఢ నమ్మకం ఉంది. ప్రత్యంగిరాదేవి సర్వదుష్ట శక్తులను నిర్మూలించగల శక్తిశాలినిగా శాస్త్రాలు అభివర్ణిస్తున్నాయి. వ్యాపారం, ఉదోనయగం కుటుంబ జీవితంలో ఎదురయ్యే సంక్షోభాలను అధిగమించేందుకు భక్తులు ఆమెకు హోమాలు, జపాలు నిర్వహిస్తారు. శత్రుబంధనం, దుష్ట ప్రభావాలు మూఢనమ్మకాల వల్ల కలిగే భయాలను తొలగించేందుకు ఈ అమ్మవారి అనుగ్రహం కోర తారు. ప్రత్యంగిరా ఆలయాలలో "సులక్షణా పారాయణం", "మహా మంత్ర జపం", "తాంత్రిక హోమాలు" వంటి విశిష్ట పూజలు జరుగుతుం టాయి. అమ్మవారిని ఆరాధించా లంటే శుద్ధ జీవనం, నియమ పూర్వక ఆచరణ, భక్తి, శ్రద్ధల అవసరం ఎంతో ఉంది. ఆమెను మంత్రికా దేవతగా భావిస్తారు. ఆమె రూపాన్ని తలచిన వెంటనే హృదయంలో అగాధమైన గంభీరత, అపారమైన విక్రమం అనుభవంగా వెదజల్లుతుంది. శాస్త్రగ్రంథాల ప్రకారం, ప్రత్యంగిరాదేవి ఉపాసన దుర్విపత్తులు,శాపాలు, దుష్టశక్తుల ప్రభావాలను నిర్మూలించగలదని పేర్కొన బడింది. ఆమె ఆరాధన భక్తులలో ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, శాంతిని కలిగిస్తుంది. భయమూ, భ్రమలూ తొలగిపోయి, ఆత్మశక్తి వికసిం చేందుకు ఈ ఉపాసన దోహద పడుతుంది. ప్రత్యంగిరా ఆలయాలు నిత్యం మంత్రోచ్చారణలతో, హోమ ఘోషలతో కళకళలాడుతుండడం విశేషం. భక్తులు అమ్మవారికి క్రతువులు, దానధర్మాలు సమర్పిస్తూ ఆమె అనుగ్రహాన్ని కోరుకుంటారు. శక్తి, రక్షణ, శాంతి కోసం ఈ దేవిని ఉపాసించే వారు అన్ని వయస్సుల వారూ, అన్ని ప్రాంతాల వారూ ఉండటం ఆమె వైశాల్యాన్ని సూచిస్తుంది. ఇలా, శ్రీ ప్రత్యంగిరా దేవి ఆరాధన భక్తుల వ్యక్తిగత జీవితం మాత్రమే కాక, సమాజానికి కూడా శాంతి, సంక్షేమాన్ని అందించగల దివ్యశక్తిగా నిలుస్తుంది. ఆమె అనుగ్రహం మన జీవితాల్లో చీకట్లను తొలగించి, వెలుగు నింపగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

- సి. హెచ్. ప్రతాప్.

# జలుబుకు వంటిల్లు ఉందిగా..

ఎంత జాగ్రత్తగా ఉన్నా సరే.. ఈ కాలంలో ఒక్కోసారి వర్షంలో తడుస్తుంటాం. దాంతో జలుబూ, దగ్గుల బారిన పడుతూనే ఉంటాం. అలాంటప్పుడు వెంటనే ట్యాబ్లెట్ వేసుకోకుండా.. వంటింట్లో అందుబాటులో ఉండే పదార్థాలతోనూ తగ్గించుకోవడానికి ప్రయత్నించొచ్చు. అవేమిటంటే..

✦ వెల్లుల్లి పాయల్లో అల్లిసిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. అది జలుబూ, దగ్గు, ఫ్లూ జ్వరాల బారిన పడకుండా కాపాడుతుంది. అలాగే వాపు, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. రోగ నిరోధకశక్తినీ పెంచుతుంది. మానసిక ఒత్తిడి తగ్గించి, కణాల ఉత్పత్తి మెరుగయ్యేలా చేస్తుంది. ✦ నువ్వుల్లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. అవి రక్తపోటును నియంత్రిస్తాయి. వెంటనే శక్తి వచ్చేలా చేస్తాయి. రక్తహీనత నుంచీ కాపాడతాయి. చర్మం ముడతలు పడనీయకుండా ఆరోగ్యంగానూ ఉంచుతాయి అందుకే నువ్వులను ఏదో రూపంలో తినడం అలవాటు చేసుకుంటే అనేక అనారోగ్యాల నుంచి బయట పడొచ్చు. ✦. విటమిన్-సి ఉన్నకూరగాలూ, పండ్లూ తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇలా ఎన్నో ఇబ్బందులను వంటింటి చిట్కాలతో తగ్గించుకోవడానికి ప్రయత్నించొచ్చు. □

# ప్రపంచ క్రీడల్లో.. స్వర్ణ పోరుకు నమ్రతా

## భారత్‌కు తొలి వుషు పతకం ఖాయం




**న్యూఢిల్లీ:** ప్రపంచ క్రీడలు–2025లో మహిళల సాండా 52 కిలోల విభాగంలో భారత్‌కు చెందిన నమ్రతా బాత్రా ఫైనల్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. చైనాలోని చెంగ్డులో సోమవారం జరిగిన టోర్నీలో నమ్రత ఫిలిప్పీన్స్‌కు చెందిన క్రిజాన్ ఫెయిత్ కొల్లాడోను 2-0 తేడాతో ఓడించి, వుషు క్రీడలో భారతదేశానికి తొలి ప్రపంచ క్రీడల పతకాన్ని ఖాయం చేసింది. ఈ విజయంతో, నమ్రత కనీసం ఒక రజతం అయినా గెలుచుకుంటుంది. ఫైనల్స్‌కు చేరుకోవడంతో మంగళవారం స్వర్ణం కోసం పోరాడుతుంది. ఆమె ఫైనల్లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాకు చెందిన మెంగ్యూ చెన్‌తో తలపడనుంది. గత నెలలో జరిగిన మాస్కో స్టార్ ఇంటర్నేషనల్ వుషు ఛాంపియన్‌షిప్‌లో నమ్రతా బాత్రా స్వర్ణం సాధించింది. అంతకు ముందు పురుషుల కాంపౌండ్ ఆర్చరీ ఈవెంట్‌లో రిషబ్ యాదవ్ కాంస్యం సాధించి, ఈ క్రీడల్లో భారతదేశానికి తొలి వ్యక్తిగత పతకం సాధించాడు.

### ఆసియా రగ్బీ ఛాంపియన్‌షిప్‌లో..

# భారత్‌కు కాంస్య పతకం

## ఆరో స్థానంలో పురుషుల జట్టు

**న్యూఢిల్లీ:** అండర్20 ఆసియా రగ్బీ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళలు కాంస్య పతకం గెలుచుకున్నారు. పురుషుల విభాగం అండర్ 20లో భారత జట్టు ఆరో స్థానంలో నిలిచింది. రాజ్‌గిర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన కాంస్య పతక పోరులో భూమిక శుక్లా నేతృత్వంలోని భారత మహిళల జట్టు 12–5 తేడాతో ఉజ్బెకిస్తాన్‌ను ఓడించింది. సెమీఫైనల్లో చైనా చేతిలో 7–28 తేడాతో ఓడిపోయిన భారత్, కాంస్య పతక పోరులోకి అడుగుపెట్టింది. అంతకుముందు, భారత మహిళల జట్టు మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒక ఓటమితో పూల్ డిలో రెండవ స్థానంలో నిలిచింది. కజకిస్తాన్ (17–10), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (31–7) లను ఓడించారు. అదే సమయంలో పూల్ మ్యాచ్‌లలో హాంకాంగ్ చేతిలో 7–31 తేడాతో ఓడిపోయారు.



టోర్నమెంట్‌లో భారతదేశం తరపున స్టార్ ప్లేయర్‌గా కెప్టెన్ శుక్లా నిలిచింది. కాగా భారత పురుషుల జట్టు ఈ పోటీలో ఆరో స్థానంలో నిలిచింది. ఐదవ స్థానం కోసం జరిగిన ప్లేఆఫ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేతిలో 19–21 తేడాతో ఓడిపోయింది. అంతకుముందు ఐదవ, ఎనిమిదవ స్థానం వర్గీకరణ మ్యాచ్‌లో కజకిస్తాన్‌ను 24–19 తేడాతో ఓడించి ఐదవ స్థానం కోసం పోరాడే హక్కులను పొందారు. సుమిత్ కుమార్ రాయ్ నేతృత్వంలోని భారత పురుషుల జట్టు మూడు మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క విజయం, రెండు ఓటములతో పూల్ ఎ లో మూడవ స్థానంలో నిలిచింది. టోర్నమెంట్‌లో నాలుగు ప్రయత్నాలు చేసిన గోల్డాన్ కుమార్ భారతదేశం తరపున అత్యుత్తమ ప్రదర్శనకారుడిగా నిలిచాడు.



# రోహిత్, కోహ్లీకి బిగ్ షాక్

## వన్డే భవిష్యత్ ప్రశ్నార్థకం

## ప్రపంచకప్‌కు కండిషన్లు అప్లై

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా క్రికెట్‌దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్, టీ20 ఫార్మాట్లకు రిటైర్మెంట్ ఇచ్చినతర్వాత వారిద్దరూ వన్డేల్లో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వన్డే ప్రపంచ కప్‌లో ఆడదామని ఎదురు చూస్తున్న రోహిత్, కోహ్లీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మరో షాక్‌ఇచ్చింది. 2027 ప్రపంచకప్ ఆడాలంటే రోహిత్,కోహ్లీ తప్పకుండా దేశవాళీక్రికెట్ ఆడాలని షరతు పెట్టినట్లు తెలుస్తోంది. వన్డే జట్టులో తామిద్దరూ ఆడాలంటే తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్ ఆడాలంటూ సెలక్టర్లు సూచించినట్లు సమాచారం. 2025 డిసెంబర్‌లో ప్రారంభం కానున్న విజయ్ హజారే ట్రోఫీ(దేశవాళీవన్డేటోర్నీ)లో కోహ్లీ, రోహిత్ తప్పకపాల్గొనాలి. ఈటోర్నీలో ఆడకపోతే టీమ్‌ఇండియాలోకి రావడానికి అవకాశాలు మూసుకుపోయినట్లే. ఇప్పటికే వీరిద్దరూ టెస్టులు, టీ20లకు దూరమవ్వడం వల్ల మ్యాచ్ ప్రాక్టీస్ గణనీయంగా తగ్గనుంది. ఈ క్రమంలో వారిద్దరి ఫిట్‌నెస్, ఫామ్‌ను అంచనా కోసం దేశవాళీ క్రికెట్ తప్పనిసరి అని సెలక్టర్లు భావిస్తున్నారు. ఇటీవలే టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్‌లో ఒకరు మాట్లాడుతూ "2027 వరల్డ్ కప్ కోసం మేము రూపొందిస్తున్న ప్రణాళికల్లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేరు" అని వ్యాఖ్యానించారు. అయితే ఇటీవలే జరిగిన ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పాల్గొనేందుకు సిద్ధమైనా, వారిద్దరినీ జట్టులో నుంచి తప్పిస్తున్నట్లు సెలక్టర్లు ముందే తెలియజేసిన తరుణంలో వారిద్దరూ టెస్టులనుంచి తప్పుకోవాల్సి వచ్చింది. తాజాగా టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ విజయవంతం అవ్వడం, జట్టులో కుర్రాళ్లు నిలకడగా రాణిస్తుండటంతో వన్డేటీమ్‌లోనూ మార్పులకు ఇదే కీలకమైన సమయమని సెలక్టర్లు నమ్ముతున్నారు. గిల్‌ను భవిష్యత్తులో అన్ని ఫార్మాట్లకు సారథిగా చేయాలనే ఆలోచన కూడాఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆస్ట్రేలియాతో జరగనున్న వన్డే సిరీస్ కోహ్లీకి, రోహిత్‌కి చివరిది కానున్నట్లు అంచనా. ఈ క్రమంలో వారు దేశవాళీ క్రికెట్‌కు తిరిగి రావడం అసాధ్యమనేది స్పష్టమవుతోంది.

# హండ్రెడ్ లీగ్‌లో సన్‌రైజర్స్ గ్రూప్ సూపర్ చార్జర్స్ ఓటమి

## 5 వికెట్లు తేడాతో ట్రెంట్ రాకెట్స్ విజయం

**న్యూఢిల్లీ:** పురుషుల హండ్రెడ్ లీగ్–2025లో కావ్యా మారన్ యాజమాన్యంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ గ్రూప్‌కు చెందిన నార్తర్న్ సూపర్ ఛార్జర్స్ తొలి ఓటమిని ఎదుర్కొంది. ట్రెంట్ రాకెట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్లు తేడాతో సూపర్ ఛార్జర్స్ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సూపర్ ఛార్జర్స్ నిర్ణీత 100 బంతుల్లో 9 వికెట్లు నష్టానికి 124 పరుగులు మాత్రమే చేసింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (45), గ్రహం క్లార్క్ (36) ఓ మోస్తరు స్కోర్లు చేయగా, మిగలిన ఆటగాళ్లలో మాథ్యూ పాట్స్ (12 నాటౌట్), మొహమ్మద్ అమీర్ (11 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. జాక్ క్రాలే (2), డేవిడ్ మలాన్ (4), మైఖేల్ పెప్పర్ (6), డాన్ లారెన్స్ (2), ఇమాద్ వసీం (0), టామ్ లాస్ (4), ఆదిల్ రషీద్ (0) దారుణంగా విఫలమయ్యారు. ట్రెంట్ రాకెట్స్ బౌలర్లలో అకీల్ హొసేన్, సామ్ కుక్, రెహాన్ అహ్మద్, మార్కస్ స్టొయినిస్ తలో 2 వికెట్లు తీయగా, ఫెర్గూసన్ ఒక వికెట్ దక్కించుకున్నాడు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన రాకెట్స్ 96 బంతుల్లో 5 వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింది. టామ్ బాంటన్ (37), రెహాన్ అహ్మద్ (31)తో రాణించి రాకెట్స్‌ను గెలిపించారు. మిగిలన ఆటగాళ్లలో జో రూట్ 20, మ్యాక్స్ హోల్డన్ 8, మార్కస్ స్టొయినిస్ 8 (నాటౌట్), ఆడమ్ హోస్ 5 (నాటౌట్) పరుగులు చేశారు. ఇక సూపర్ ఛార్జర్స్ బౌలర్లలో ఇమాద్ వసీం 3, ఆదిల్ రషీద్ 2 వికెట్లు తీశారు.



# పాకిస్థాన్‌కు పరాభవం

## 5 వికెట్లు తేడాతో వెస్టిండీస్ విక్టరీ

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను సమం చేసింది. ట్రినిడాడ్‌లో సోమవారం జరిగిన రెండవ వన్డే మ్యాచ్ వర్షం కారణంగా కుదించబడింది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ పాక్‌ను ఓడించి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 33.2 ఓవర్లలో 184/5 స్కోరు చేసింది. వర్షం అంతరాయంతో పాక్ ఇన్నింగ్స్ 37 ఓవర్లలో 171/7తో ముగిసిన తర్వాత, డర్క్‌వర్త్ లూయిస్ సెర్న్ పద్ధతి ప్రకారం ఆతిథ్య జట్టు 35 ఓవర్లలో 181 పరుగుల సవరించిన లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. కుడిచేతి వాటం ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ ఏడు ఓవర్లలో 3/23 వికెట్లు తీసుకున్నాడు. 18 ఓవర్ల తర్వాత 101–3తో ఉన్న వెస్టిండీస్ 24 ఓవర్లలో 111–5కి పడిపోయింది. రూథర్‌ఫోర్డ్ 33 బంతుల్లో మూడు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 45 పరుగులు చేశాడు. చేజ్, గ్రీవ్స్ (31 బంతుల్లో 26) ఆరో వికెట్‌కు 77 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాగా వెస్టిండీస్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా హసన్ నవాజ్ పాకిస్తాన్ తరఫున కీలక పాత్ర పోషించాడు. వన్డే ఓపెనర్‌లో 63 పరుగులతో అజేయంగా నిలిచిన తర్వాత 30 బంతుల్లో 36 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అంతకు ముందు హసన్ ఇన్నింగ్స్‌లో 3 సిక్సర్లు ఉన్నాయి. వాటిలో 2 వర్షం తర్వాత పాక్ ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో ఉన్నాయి. హుస్సేన్ 32 బంతుల్లో 31 పరుగులు చేశాడు. కానీ మిగిలిన పాక్ బ్యాటర్లు విఫలమయ్యారు. కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ 38 బంతుల్లో 16 పరుగులు చేసి గుడకేష్ మోటీ చేతిలో ఎల్‌బిడబ్ల్యుగా చిక్కుకున్నాడు. అంతకు ముందు జరిగిన తొలి వన్డేలో పాకిస్తాన్ ఐదు వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది.




# వాణిజ్యం

### భారతీయ కరెన్సీల్లోనే

# అంతర్జాతీయ చెల్లింపులు!

## సర్క్యులర్ జారీచేసిన రిజర్వు బ్యాంకు

**ముంబయి, ఆగస్టు 11:** డాలర్‌ను బలహీనపరిస్తే ఉపేక్షించదిలేదంటూ ట్రంప్ హెచ్చరికలు చేస్తున్న వేళ ఆర్‌బిఐ కీలక నిర్ణయం ప్రకటించింది. అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీల్లో భారతీయ కరెన్సీల్లోనే చెల్లింపులు ప్రోత్సహించేందుకు తమ ముందస్తు అనుమతి లేకుండానే భారత అధీకృత బ్యాంకులు విదేశా బ్యాంకుల్లో స్పెషల్‌రూపీ వ్రాస్ట్రో ఖాతాలను ప్రారంభించవచ్చని ప్రకటించింది. ఇందుకు సంబంధించి సర్క్యులర్‌కూడా జారీచేసింది.



రూపాయి కరెన్సీలో వాణిజ్యలావాదేవీల సెటిల్మెంట్‌ను వేగవంతంచేసేందుకు ఆర్‌బిఐ ఈ ఆదేశాలు జారీచేసింది. ఈ అంశంపై గతంలో జారీచేసిన మార్గదర్శకాలకు తాజా ఆదేశాలు పొడిగింపు అని వెల్లడించింది. ఆర్‌బిఐ తాజా మార్గదర్శకాలప్రకారం ఇకపై ఎగుమతి దిగుమతులకు చెల్లింపులను రూపాయిల్లోచేయడం సులువవుతుంది. దేశాలమధ్య కరెన్సీ ఎక్చేంజి రేటు మార్కెట్ పరిస్థితులను అనుసరించి నిర్ణయిస్తారు. గతంలో బ్యాంకులు ఆర్‌బిఐనుంచి ముందుగా అనుమతులు తీసుకున్నాకే వాస్ట్రో ఖాతాలు ప్రారంభించాల్సి వచ్చేది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఈవిధానాన్ని ఆర్బీఐ ఇపుడు సవరించింది. చైనా రష్యాలు ఇప్పటికే తమ దేశ కరెన్సీలతో వాణిజ్య లావాదేవీలుచేస్తున్నాయి. బ్రిక్స్ కూటమి దేశాలకోసం ఒక ఉమ్మడి కరెన్సీ ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిపైనే ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. బ్రిక్స్ ప్రత్యేకకరెన్సీ తెస్తే ఆదేశాల దిగుమతులపై 100శాతం సుంకాలు విధిస్తామని ట్రంప ప్రకటించారు. రష్యాచమురు కొంటున్నదని భారత్‌పై ఏకంగా సుంకాలను 50శాతానికి పెంచినసంగతి తెలిసిందే.



# కనీస నిల్వలపై బ్యాంకులదే విచక్షణాధికారం

## ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబయి, ఆగస్టు 11:** బ్యాంకు ఖాతాల్లోని కనీస నిల్వల అంశంపై రిజర్వుబ్యాంక్ గవర్నర్‌సంజయ్ మల్హోత్రా స్పందించారు. కనీస నిల్వ ఎంత ఉండాలనేది పూర్తిగా బ్యాంకుల నిర్ణయమని చెప్పారు. ఆర్బీఐ నియంత్రణ ఏదీ ఉండదని అన్నారు. కనిసనిల్వ పరిమితిని ఐసిఐసిఐబ్యాంకు గరిష్టంగా 50 వేలకు పెంచిన సంగతి తెలిసిందే.
దీనిపై విమర్శలు వ్యక్తం అవుతున్నవేళ గుజరాత్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆర్బీఐ గవర్నర్ కనీస సగటు బ్యాలెన్స్ ఎంత ఉండాలి అనేది ఆర్‌బిఐ బ్యాంకులకే వదిలేసిందన్నారు.
కొన్ని బ్యాంకులు రూ.10వేలు నిర్ణయిస్తే మరికొన్ని రూ.2వేలు కొన్ని కనీస నిల్వ నిబంధనను ఎత్తివేసాయన్నారు. ఈ అంశం ఆర్బీఐ పరిధిలోనికి రాదని సంజయ్‌మల్హోత్రా తెలిపారు. పదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధరుసుమును ఇటీవల కొన్ని బ్యాంకులు తొలగించాయి. ఐసిఐసిఐబ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతాదార్లకు షాకిచ్చింది. సేవింగ్స్ ఖాతాల్లో కనీస నిల్వమొత్తం భారీగాపెంచేసింది. 2025 ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచినవారికే ఇది వర్తించనున్నది. మెట్రో అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదారులు కనీసం రూ.50వేలు నిల్వ ఉంచాలి. గతంలో ఈ మొత్తం రూ.10వేలుగా ఉండేది.
ఇపుడు ఐదురెట్లుపెంచింది. సెమీ అర్బన్ ఖాతాదార్ల కనీస నిల్వమొత్తం రూ.5వేలనుంచి రూ.25వేలు, గ్రామీణ ఖాతాదారులకు రూ.2500 నుంచి రూ.10వేలవరకూ సవరించింది. కనీస నిల్వలేనిపక్షంలో ఛార్జీలు నిల్వకు ఎంత తక్కువ మొత్తం ఉంటుందో దానిపై ఆరుశాతం లేదా రూ.500 ఏది తక్కువయితే అది చెల్లించాలని ఐసిఐసిఐ బ్యాంకుప్రకటించింది.


# నోయిడాలో టెస్లా రెండో షోరూమ్!




**న్యూఢిల్లీ,ఆగస్టు 11:** అమెరికాకుచెందిన ఎలక్ట్రిక్‌కార్ల తయారీసంస్థ టెస్లా భారత్‌లోమరో షోరూం తెరిచింది. దేశరాజధాని ఢిల్లీలోని ఏరోసిటీ, వరల్డ్‌మార్క్2లో తన రెండోషోరూమ్ సోమవారం ప్రారంభించింది. 8200 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్తషోరూమ్‌నుఅ ందుబాటులోకి తెచ్చారు. ఈ షోరూమ్‌కు సమీపంలోనే విమానాశ్రయం, రాయబార కార్యాలయాలు, కార్పొరేట్ ఆఫీసులు ఉండటంతో ఎక్కువమంది కస్టమర్లకు చేరువకావచ్చని కంపెనీ అంచనావేస్తోంది. కస్టమలర్లకు అనుకూలమైన ప్రదేశంలో ఉండటంవల్ల టేస్లాబేస్‌మెంట్ పార్కింగ్‌లో నాలుగు వి4 సూపర్‌ఛార్జర్లను ఏర్పాటుచేసింది. సాకేత్ నోయిడా ఆరిజన్ తదితర ప్రాంతాల్లో ఈసూరన ఛజాజర్ల ఏర్పాటుకు యోచిస్తోంది. ముంబయిలో తొలిషోరూమ్ షురూచేసిన టెస్లా మొదటిసూపర్ ఛార్జర్‌స్టేషన్‌కూడా ప్రారంభించింది. హైదరాబాద్;పూణె, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, జైపూర్ వంటి ఎనిమిది నగరాల్లోను ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తుంది. వి4 సూపర్‌ఛార్జర్ అనేది డీసీ ఛార్జింగ్ సదుపాయంతో వస్తుంది. ఇక్కడ కారుకు ఛార్జింగ్‌చేయడానికి కిలోవాట్‌కు రూ.24 వసూలుచేస్తారు. 11 కిలోవాట్‌స్పీడ్ ఉన్న ఏసీ చార్జింగ్‌కు కిలోవాట్‌ధర రూ.11గా నిర్ణయించారు. ఈ వి4 సూపర్‌ఛార్జర్ కొత్తగా లాంచ్‌చేసిన టెస్లా మోడల్ వైకారుకు కేవలం 15నిమిషాలపాటుఛార్జిచేస్తే 267 కిలోమీటర్లు వెళ్లవచ్చు. రెండు వేరియంట్లు భారత్ మార్కెట్‌కు తెచ్చిన టెస్లా ప్రారంభ ధర 59.89 లక్షలు, లాంగ్‌రేంజ్ మోడల్‌ధర రూ.67.89 లక్షలుగా కంపెనీ వెల్లడించింది. ఒక్కసారి ఛార్జింగ్‌చేస్తే 500 నుంచి 600 కిలోమీటర్లవరకూ వెళ్లేవీలుంటుంది.

# చైనాచిప్స్ ఎగుమతుల్లో అమెరికాకు లాభాల వాటా!

## ఎన్విడియా, ఎఎండి కంపెనీలతో అమెరికా ఒప్పందం



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అమెరికానుంచి చైనాకు అత్యాధునిక కంప్యూటర్‌చిప్‌లను ఎగుమతిచేసే పరంగా మరో ముందుడుగువేసింది. చైనా విక్రయాలపై తమకు వచ్చే లాభాల్లో ట్రంప్ సర్కారుకు వాటా చెల్లించేందుకు అమెరికన్ చిప్ కంపెనీలు ఎన్విడియా, ఎఎండిలు అంగీకరించాయి. దీనితో చిప్ ఎగుమతులు మళ్లీ ప్రారంభం అవుతునానయి. భనరదతా కారణాలుచూపిస్తూ చిప్ ఎగుమతులు అమెరికా నిలిపివేసింది. ప్రతిగా చైనా అరుదైన ఖణిజాల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఈక్రమంలో లాభాల్లో వాటాతీసుకుని చిప్‌ల ఎగుమతికి అమెరికాప్రభుత్వం అంగీకరించింది. చైనాకు అత్యాధునిక చిప్‌లను ఎగుమతిచేయడంపై అమెరికా బైడెన్ హయాంలో ఆంక్షలు విధించింది. చైనా మార్కెట్‌కోసం ఎన్విడియా అత్యాధునికి హెచ్20 చిప్‌లు రూపొందించింది. ట్రంప్ వచ్చాక వాటిపైనా ఆంక్షలు విధించడంవల్ల ఎగుమతులు నిలిపివేసారు. దీనితోచైనాలో ఎన్విడియా విక్రయించే హెచ్20 ఎఐచిప్స్ ఎఎండి విక్రయించే ఎంఐ 308 చిప్స్‌పై వచ్చేలాభాల్లో 15శాతం వాటాను అమెరికాకు చెల్లించేందుకు అంగీకరించాయి. చైనాకు చిప్‌లు ఎగుమతిచేసేందుక లైసెన్స్ పొందిన ఉత్పత్తులకు మాత్రమే లాభాల్లో వాటాచెల్లించేవిధంగా ఇరుకంపెనీలు ఒప్పందంచేసాయి. రెండు కంపెనీలు తమ సేల్‌రికార్డులుభద్రపరచడంతోపాటు వాటిని అమెరికా అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మొత్తం చిప్ రీసెర్చి టెక్నాలజీ సెక్యూరిటీకి వినియోగిస్తారు. అత్యాధునికచిప్‌లను చైనా మిలిటరీ అవసరాలకు వినియోగిస్తుందన్న భయం అమెరికాను వెంటాడుతోంది. అందుకే ఆంక్షలు విధించింది. మరోవైపు రెండుదేశాలమధ్య ట్యారిఫ్ వార్‌కు 90 రోజులు బ్రేక్ పడింది. అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు సడలించగాచిప్ ఎగుమతులకు ట్రంప్ సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

# భారీ లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, ఆగస్టు 11:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిసాయి. పిఎస్‌యు బ్యాంకులు, ఆటో, రియాల్టీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ముఖ్యంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్, ఎస్‌బిఐ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 750కిపైగా పాయింట్లు లాభపడగా నిఫ్టీ 200 పాయింట్ల లాభంతో మళ్లీ 25,550 ఎగువన ట్రేడింగ్ నిలిపివేసింది. సెన్సెక్స్ ఉదయం 79,885.36 పాయింట్లవద్ద స్వల్పలాభాల్లోప్రారంభం కాగా క్రమంగా భారీ లాభాల్లోకి మళ్లింది. ఇంట్రాడేలో 80,636.05 పాయింట్లవద్ద గరిష్టాన్ని తాకిన సూచీ చివరికి 746.29 పాయింట్ల లాభంతో 80,604.08వద్ద ముగిసింది. నిఫ్టీ 221.75 పాయింట్ల లాభంతో 24,585.05 వద్ద స్థిరపడింది. డాలరుతోరూపాయి మారకం విలువ 87.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భెల్, భారతీయ ఎయిర్‌టెల్, మారుసుజుకి షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లు లాభాల్లోముగిసాయి. టాటా మోటార్స్, ఎటెర్నల్, ట్రెంట్ ఎస్‌బిఐ అల్ట్రాటెక్‌సిమెంట్‌షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌క్రూడ్ మ్యారెల్ 66 డాలర్లవద్ద ట్రేడ్ అవుతుండగా బంగారం ఔన్స్ 3362.26 డాలర్లవద్దకొనసాగింది.

# రూ.18వేల కోట్ల ఎఫ్‌పిఐల విత్‌డ్రా!

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అమెరికా భారత్ వాణిజ్య ఉద్రిక్తతలు ఈక్విటీలపై ప్రభావంపడుతున్నాయి. కార్పొరేట్‌ఫలితాలుకూడా నిరాశకలిగిస్తున్నాయి. తొలిత్రైమాసికంలో కంపెనీలు పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. ఫారెక్స్ మార్కెట్‌లోరూపాయి క్షీణించడం వంటి పరిణామాలు విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లను నిధుల విత్‌డ్రాకు పురిగొలుపుతోంది. ఫలితంగా ఎఫ్‌పిఐలు ఆగస్టునెలలో ఇప్పటివరకూ అంటే కేవలం ఆరుట్రేడింగ్ సెషన్లలో రూ.18వేలకోట్లమేరకు ఈక్విటీలు విక్రయించారు. 2025 సంవత్సరంలో ఇప్పటివరకూ తరలించుకుపోయిన నిధులు పరిమాణం రూ.1.13 లక్షలకోట్లకు చేరింది.
డిపాజిటరీలవద్ద ఉన్న సమాచారం ప్రకారం జులై నెలలో ఇన్వెస్టర్లు నికరంగా రూ.17,741 కోట్లు విత్‌డ్రాచేసారు. ఈనెల 8 తేదీనాటికే నికరంగా రూ.17,924 కోట్లువిత్‌డ్రాచేసారు. మార్చినుంచి జూన్‌నెలలమధ్యకాలంలో వారు రూ.38,673 కోట్లు ఇన్వెస్ట్‌చేసారు. ప్రస్తుతంఎ ఫ్‌పిఐల సెంటిమెంట్ చాలా బలహీనంగా ఉంది. వారు ఏమాత్రం రిస్క్‌భరించేస్థితిలో లేరని ఏంజెల్‌వన్ సీనియర్ ఫండమెంటల్ ఆర్థికవేత్త వకర్‌జావేద్‌ఖాన్ అన్నారు. భారతీయ ఉత్పత్తులపై అమెరికా 50శాతం సుంకాలు విధించడం సెంటిమెంట్‌పై ప్రభావం చూపిందనప్నారు. అమెరికా ట్రెజరీ రాబడులు మెరుగుపడటం విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోందని ఖాన్ వెల్లడించారు. ఈపరిస్థితుల్లోనే భారత్‌పే పబ్లిక్ ఇష్యూను వాయిదావేసింది. 19న రెండు కంపెనీలు ఐపిఒలు జారీచేస్తున్నాయి. షిప్పింగ్, లాజిస్టిక్ సొల్యూషన్లు అందించే శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్, సూపర్‌మార్కెట్ రిటైల్ ఈనెల 19న పబ్లిక్ ఇష్యూలు జారీచేయనున్నాయి. 21న రెండు ఇష్యూలు ముగుస్తాయి. ఇష్యూలో ధరల శ్రేణిని రెండుకంపెనీలు నిర్ణయించనున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.